అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

www.navatelangana.com

బుధవారం 12-06-2024

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 10 సంచిక : 113 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | 12 పేజీలు | వెల : 6.50

అది ఫ్యామిలీ క్యాబినెట్

వారసత్వాలకు పెద్దపీట



- మా త్యాగాన్ని బంధుప్రీతిగా మోడీ విమర్శ
- ఎన్డీఏ మంత్రివర్గంలో ఉన్నదెవరు..? : రాహుల్ నిలదీత

రాయ్‌బరేలీ : ప్రధాని మోడీ తాజా మంత్రివర్గంపై రాహుల్‌గాంధీ తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. అదొక కుటుంబ మంత్రివర్గమని తెలిపారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్టు చేశారు. తరతరాలుగా సాగుతున్న పోరాటం, సేవ, త్యాగాలను బంధుప్రీతిగా విమర్శించేవారు (మోడీ) తమ మంత్రివర్గంలో వారసత్వాలకు పెద్ద పీట వేశారని రాహుల్ వ్యాఖ్యానించారు. అలాగే, 'మాటలకు చేతలకు మధ్య వ్యత్యాసం ఉంటే ఆ వ్యక్తిని నరేంద్ర మోడీ అని అంటారు' అని అన్నారు. మోడీ తన నూతన మంత్రివర్గంలో మాజీ ప్రధాని దేవగౌడ కుమారుడు కుమారస్వామి, కేంద్ర మాజీ మంత్రి మాధవరావు సింధియా కుమారుడు జ్యోతిరాదిత్య సింధియా, అరుణాచల్ ప్రదేశ్ స్పీకర్ రించిన్ ఖరు కుమారుడు కిరణ్ రిజిజు, మహారాష్ట్ర మాజీ మంత్రి ...11లో

25లోపు అఫిడవిట్లు సమర్పించాలి

- తప్పుడు సమాచారమిస్తే చట్టరీత్యా చర్యలు
- త్వరలో కాళేశ్వరం నిర్మాణ సంస్థలనూ పిలుస్తాం : జస్టిస్ పీసీ ఘోష్



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

కాళేశ్వరం బ్యారేజీల వైఫల్యంపై విచారణకు హాజరైన వారంతా ఈనెల 25లోపు అఫిడవిట్లు సమర్పించాలని కాళేశ్వరం జ్యుడీషియల్ ...11లో

సింగరేణిలో 'కారుణ్య' వయోపరిమితి పెంపు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

సింగరేణి కాలరీస్‌లో కారుణ్య నియామకాల వయోపరిమితిని 40 ఏండ్ల వరకు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వయోపరిమితి సడలింపు కోసం సింగరేణి కార్మిక కుటుంబాలు చాలా ఏండ్లుగా డిమాండ్ చేస్తున్నాయి. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన సింగరేణి కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఈ అంశాన్ని ...11లో

విమాన ప్రమాదంలో విషాదం

- మాలావి ఉపాధ్యక్షుడు సహా 10మంది మృతి



లిలాంగ్వే : విమాన ప్రమాదంలో మాలావి ఉపాధ్యక్షుడు సాలోస్ క్లాజ్ చిలిమా సహా 10మంది మరణించారు. విమానంలోని వారు ఎవరూ జీవించిలేరని అధ్యక్షుడు లాజరస్ చాక్వెరా తెలిపారు. జాతినుద్దేశించి ఆయన ప్రసంగిస్తూ విమానం అడవిలో కూలిపోయిందని ఈ ప్రమాదంలో అందులో ప్రయాణిస్తున్న వారందరూ చనిపోయారని ...11లో

కిలో @50

మళ్లీ ఘాటెక్కిన ఉల్లి

ఉల్లి మరోసారి ఘాటెక్కింది. గత పక్షం రోజుల్లో దేశంలోని అనేక ప్రాంతాల్లో ఉల్లి ధరలు 30 నుంచి 50 శాతం వరకూ పెరిగాయి. సరఫరా తగ్గటమే దీనికి కారణంగా భావిస్తున్నారు. మరోవైపు బక్రీద్ పండుగ సమీపిస్తుండడంతో ఉల్లికి డిమాండ్ పెరిగింది. నిన్నటి దాకా వందరూపాయలకు ఐదు నుంచి ఏడు కిలోలకు లభ్యమయ్యేది. ఇపుడు కిలో యాభై పలుకుతోంది. డిమాండ్, సరఫరాల మధ్య వ్యత్యాసం కారణంగా ధరలు సామాన్యులకు అందుబాటులో లేకుండా పోతున్నాయి. దీనికితోడు కొందరు వ్యాపారులు ఉల్లిని నిల్వ చేసి కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు.

నిన్నటి దాకా రూ.వందకు ఐదు కిలోలు.. ఇపుడు రెండు కిలోలే..

- పక్షం రోజుల్లో 30-50 శాతం పెరుగుదల
- డిమాండ్, సరఫరాల మధ్య వ్యత్యాసం
- కృత్రిమ కొరత సృష్టిస్తున్న వ్యాపారులు
- సబ్సిడీ ధరతో విక్రయించడానికి చొరవ చూపని ప్రభుత్వాలు



న్యూఢిల్లీ : ఉల్లి ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. నాసిక్‌లోని లాసాల్‌గాన్ మండిలో గత నెల 25న కిలో ఉల్లిగడ్డ ధర రూ.17 పలకగా సోమవారం అది రూ.26కు చేరింది. నాణ్యమైన ఉల్లి కావాలంటే రూ.30 చెల్లించాల్సి వస్తోంది. ఉల్లిగడ్డలు జూన్ నెల నుండి మార్కెట్‌కు వస్తుంటాయి. రైతులు, వ్యాపారులు వాటిని తమ వద్దే నిల్వ చేస్తారు.

రబీ సీజన్‌లో దిగుబడులు తగ్గిన నేపథ్యంలో ఉల్లి ధర రూ. 50కి చేరింది. రాబోయే రోజుల్లో ధరలు మరింత పెరుగుతాయని వారు ఆశిస్తున్నారు. ఇదిలావుండగా కేంద్ర ప్రభుత్వం ఆంక్షలు సడలించడంతో శ్రీలంక, బంగ్లాదేశ్, మలేసియా తదితర దేశాలకు ఉల్లి ఎగుమతులు తిరిగి ప్రారంభమయ్యాయి. గత నెలలో ఉల్లి ఎగుమతులపై నిషేధం ఎత్తివేసిన తర్వాత నాసిక్ జిల్లా నుండి ప్రతి రోజూ సగటున మూడు వేల టన్నుల ఉల్లిగడ్డలతో కంటైనర్లు తరలిపోతున్నాయని ఓ వ్యాపారి తెలిపారు. దీనివల్ల దేశంలో ఉల్లికి డిమాండ్ పెరిగిందని ఆయన చెప్పారు.

ముఖ్యంగా మహారాష్ట్రలో పండే ఉల్లికి దక్షిణాది రాష్ట్రాల నుండి తీవ్రమైన డిమాండ్ ఉంటోంది. ధరలు పెరిగే వరకూ వారు తమ వద్ద ఉన్న నిల్వలను మార్కెట్‌కు పంపబోరని, అందుకే కృత్రిమ కొరత ఏర్పడి ధరలు అందుబాటులో లేకుండా పోతున్నాయని చెబుతున్నారు.

తెలంగాణలోనూ..

తెలంగాణ జనాభా అవసరాలకు ...10లో

పరీక్షల పవిత్రత దెబ్బతింది

మాకు సమాధానాలు కావాలి

- నీట్ పరీక్షల నిర్వహణలో అవకతవకలపై సుప్రీం సీరియస్
- కేంద్రానికి, ఎన్‌టీఏకు నోటీసులు
- జులై 8కి విచారణ వాయిదా

న్యూఢిల్లీ : నీట్ యుజి 2024 పరీక్షా ఫలితాలను రద్దుచేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై కేంద్రానికి, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ)కి సుప్రీం కోర్టు మంగళవారం నోటీసులు జారీ చేసింది. ఈ పిటిషన్‌పై మీ స్పందన ఏమిటో తెలియచేయాల్సిందిగా వారిని కోరింది. దేశవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రయివేటు విద్యాసంస్థల్లో ఎంబీబీఎస్, బీడీఎస్, ఆయుష్ ఇతర సంబంధిత కోర్సుల ప్రవేశానికి నిర్వహించే ప్రవేశ పరీక్ష అయిన నీట్ నిర్వహణపై అనేక ఫిర్యాదులు వచ్చాయి. పేపర్ లీక్ అయిందనే ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో దాఖలైన పిటిషన్‌లపై సుప్రీం స్పందించింది. పరీక్షల పవిత్రత దెబ్బతిందని, అందువల్ల దీనిపై తమకు సమాధానాలు కావాలని కోర్టు కోరింది. అయితే అడ్మిషన్ల కోసం జరుగుతున్న కౌన్సెలింగ్ ప్రక్రియను నిలుపు చేయడానికి తిరస్కరించింది. యథాప్రకారం కౌన్సెలింగ్ కొనసాగుతుందని జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ అహసనుద్దీన్ అమనుల్లాలతో కూడిన వెకేషన్ బెంచ్ వ్యాఖ్యానించింది. దీనిపై తదుపరి విచారణను జులై 8కి వాయిదా వేసింది. ఇప్పటికే ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ వద్ద పెండింగ్‌లో వున్న పిటిషన్‌తో శివంగి మిశ్రా, తదితరులు దాఖలు చేసిన పిటిషన్‌ను కలిపి జులై 8న విచారిస్తామని తెలిపింది. పరీక్షల నిర్వహణకు



సంబంధించి అవకతవకలు జరిగాయని వివిధ దశల్లో అనేక ఆరోపణలు వచ్చాయి. మార్కుల స్కోర్లలో అనేక వ్యత్యాసాలు వున్నాయని, కొంతమంది విద్యార్థులకు ఉద్దేశపూర్వకంగా ప్రాధాన్యత ఇచ్చారని సుప్రీం విచారించిన తాజా పిటిషన్ పేర్కొంది. మే 5న నిర్వహించిన పరీక్షను రద్దు చేసి తాజాగా పరీక్షలు నిర్వహించాలని ఆ పిటిషన్ కోరింది. గ్రేస్ మార్కులు కలపడంలో కూడా చాలా తేడాలున్నాయని, వాటిల్లో లాజిక్ కనబడడం లేదని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లకు చెందిన ఈ పిటిషనర్లు పేర్కొన్నారు. పైగా పరీక్షా సమయాన్ని కొంత మేరకు కోల్పోవడం వల్లనే ఈ గ్రేస్ మార్కులు కలిపామని కారణం చెబుతున్నారని, ఆ పరీక్షా సమయం ...11లో

ఏపీ రాజధానిగా అమరావతి

ఎన్డీఏ శాసనసభాపక్షనేతగా చంద్రబాబు ఎన్నిక

- ప్రజాతీర్పుతో ఏపీకి పెరిగిన ప్రతిష్ట, గౌరవం



విజయవాడ : ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి అని టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ప్రకటించారు. మంగళవారం ఎన్డీయే శాసనసభా పక్ష సమావేశంలో.. కూటమి నేతగా ఎన్నికైన తర్వాత ఆయన మాట్లాడుతూ.. ఎన్డీఏ శాసనసభాపక్ష నేతగా ఎన్నుకున్నందుకు టీడీపీ అధినేత చంద్రబాబు కూటమి పక్షాలకు ధన్యవాదాలు తెలిపారు. మన రాజధాని అమరావతి అని అన్నారు. విశాఖను ఆర్థిక రాజధానిగా అభివృద్ధి చేస్తానని, కర్నూలును అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఏపీ చరిత్రలో ఎప్పుడూ ఇవ్వని తీర్పును ప్రజలు ఇచ్చారన్నారు. ఈ తీర్పును నిలబెట్టుకోవాల్సిన బాధ్యత తమపై ఉందని చెప్పారు. ఏపీని కాపాడుకోవడానికి ప్రజలు చొరవ చూపారని అన్నారు. నూటికి నూరు శాతం మూడు పార్టీల నేతలు, ...11లో

జులై 30 వరకు గడువివ్వండి

జస్టిస్ నర్సింహారెడ్డి కమిషన్‌కు మాజీ సీఎం కేసీఆర్ విజ్ఞప్తి

- జూన్ 15లోపు వివరణ ఇవ్వాలన్న కమిషన్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో



ఛత్తీస్‌గఢ్ విద్యుత్ కొనుగోలు ఒప్పందం, యాదాద్రి, భద్రాద్రి థర్మల్ విద్యుత్కేంద్రాల నిర్మాణాలపై వివరణ ఇవ్వాలని జస్టిస్ ఎల్ నర్సింహారెడ్డి ఏకసభ్య కమిషన్ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్‌ఎస్ అధినేత కే చంద్రశేఖరరావు (కేసీఆర్)కు నోటీసులు జారీ చేసింది. వీటిని ఈ ఏడాది ఏప్రిల్ ...11లో

ఫోన్ ట్యాపింగ్ కేసులో ఆరుగురిపై చార్జిషీట్

పరారీలో ఇద్దరు నిందితులు

- వ్యూహం ప్రకారమే ట్యాపింగ్ చేశారని అభియోగం
- ఇద్దరికి బెయిల్‌పై నేడు నిర్ణయం




నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి -హైదరాబాద్

రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో మొత్తం ఆరుగురు నిందితులపై మంగళవారం నాంపల్లి కోర్టులో కేసు దర్యాప్తు చేస్తున్న పంజాగుట్ట స్పెషల్ టీమ్ అధికారులు చార్జిషీట్ దాఖలు చేశారు. ఎస్ఐబీ మాజీ ఐజీ ప్రభాకర్‌రావు, అదనపు ఎస్పీలు భుజంగరావు, తిరుపతన్న, టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ, ఎస్ఐబీ మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావు, ఐ న్యూస్ ఛానల్ సీఈఓ శ్రవణ్‌కుమార్‌పై చార్జిషీట్ దాఖలైంది. అందులో ప్రభాకర్‌రావు, శ్రవణ్‌కుమార్ పరారీలో ఉన్నట్టు చార్జిషీట్‌లో పేర్కొన్నారు. రాష్ట్రంలో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ ...11లో

మిత్రులకు మొండిచేయి

కీలక పదవులన్నీ బీజేపీకే

- 11 మంత్రి పదవులతో సరి
- అందులోనూ ఐదుగురికే క్యాబినెట్ హోదా



న్యూఢిల్లీ : నరేంద్ర మోడీ మంత్రిమండలిలో బీజేపీ భాగస్వామ్య పక్షాలకు సముచిత ప్రాతినిధ్యం లభించలేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. అనేక మిత్రపక్షాల డిమాండ్లను మోడీ ఖాతరు చేయలేదు. మోడీ క్యాబినెట్‌లోని 72 మంది సభ్యుల్లో బీజేపీ భాగస్వామ్య పక్షాలకు చెందిన 11 మందికి మాత్రమే చోటు దక్కింది. వారిలోనూ ఐదుగురికే క్యాబినెట్ హోదా లభించింది.

క్యాబినెట్ పదవులు వీరికే

దక్షిణాది నుంచి జేడీఎస్ నేత హెచ్‌డీ కుమారస్వామికి భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ లభించగా తెలుగుదేశం పార్టీకి చెందిన కింజరాపు రామ్మోహన్ నాయుడికి పౌర విమానయాన శాఖను కేటాయించారు. బీహార్ నుండి హిందుస్థానీ ఆవామ్ మోర్చ సెక్యులర్ పార్టీకి చెందిన జితన్ రామ్ మాంఝీకి సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖను అప్పగించారు. అదే రాష్ట్రానికి చెందిన జేడీయూ ఎంపీ రాజీవ్ రంజన్ సింగ్‌కు పంచాయతీరాజ్‌తో పాటు మత్స్య, పశు సంవర్థక, డెయిరీ శాఖను ఇచ్చారు. లోక్ జనశక్తి పార్టీ (రాం విలాస్) నేత చిరాగ్ పాశ్వాన్‌కు ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల శాఖను కేటాయించాయి. మిత్రపక్షాలకు చెందిన ఈ ఐదుగురికి మాత్రమే క్యాబినెట్ హోదా దక్కింది.

సహాయ మంత్రులు వీరే

శివసేనకు చెందిన జాదవ్ ప్రతాప్‌రావు గణపతిరావ్, ఆర్ఎల్‌డీకి చెందిన జయంత్ చౌదరికి స్వతంత్ర హోదాతో మంత్రి పదవులు లభించాయి. ఇక రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా (అథావలే) నేత రాందాస్ అథావలేకు ఒక మంత్రిత్వ శాఖలో, అప్నాదళ్‌కు చెందిన అనుప్రియా పటేల్‌కు రెండు మంత్రిత్వ శాఖల్లో సహాయ మంత్రి పదవులు ఇచ్చారు. ఆయా పార్టీలకు సభలో వీరిద్దరు మాత్రమే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. బీహార్ మాజీ ముఖ్యమంత్రి, సోషలిస్టు నేత కర్పూరీ ఠాకూర్ కుమారుడు రామ్‌నాథ్ ఠాకూర్, తెలుగుదేశం పార్టీకి చెందిన పెమ్మసాని చంద్రశేఖర్‌లకు కూడా సహాయ మంత్రి పదవులు లభించాయి.

డిమాండ్లు నెరవేరలేదు

పదహారు మంది సభ్యులున్న తెలుగుదేశం పార్టీ స్పీకర్ పదవితో పాటు నాలుగు కీలక మంత్రిత్వ శాఖల కోసం పట్టుబట్టింది. తన మిత్రపక్షమైన జనసేనకు కూడా క్యాబినెట్‌లో ప్రాతినిధ్యం కల్పించాలని కోరింది. అయితే చివరికి రెండు మంత్రి పదవులతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. జనసేనకు క్యాబినెట్‌లో స్థానం దక్కలేదు. మరోవైపు 12 మంది ఎంపీలున్న జేడీయూ కూడా రైల్వేలు సహా మూడు మంత్రిత్వ శాఖలను కోరింది. ఒకప్పుడు ...11లో



'సీతమ్మ'కు చిక్కులు

- ఏడాదిగా నిర్మాణ పనులకు బ్రేక్
- పర్యావరణ అనుమతులపై అభ్యంతరాలు
- గతేడాది రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ
- అనుమతులు వస్తేనే పనుల్లో కదలిక

నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి:

కేంద్ర పర్యావరణ శాఖ అభ్యంతరాలతో ఏడాది కాలంగా సీతమ్మ సాగర్ ప్రాజెక్టు నిర్మాణ పనులు నిలిచిపోయాయి. ఆ సమయంలో రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు ఉండటంతో కేంద్రంతో చర్చించే అవకాశం లేకపోయింది. ఇప్పుడు ముఖ్యమైన ఎలక్షన్లు పూర్తయిన నేపథ్యంలో అనుమతులు సాధించడంపై రాష్ట్ర ప్రభుత్వం ఏ రకంగా అడుగులు వేస్తుందనేది చర్చ నడుస్తోంది. అశ్వాపురం మండలంలో నిర్మిస్తున్న సీతమ్మ సాగర్ నిర్మాణ పనులతో తాము నష్టపోతున్నామని, కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ నుంచి సరైన అనుమతులు తీసుకోకుండా నిర్మాణ పనులు చేపట్టారని ప్రాజెక్టు నిర్వాసితులు హైకోర్టును, ఆ తర్వాత నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్జీటీ)ను ఆశ్రయించారు. నిర్వాసితుల అభ్యంతరాలను పరిశీలించిన ఎన్జీటీ నిర్మాణ పనులను వెంటనే నిలిపివేయాలని 2023, మే 29న ఉత్తర్వులు జారీ చేసింది. క్షేత్రస్థాయిలో పరిస్థితులను అంచనా వేసి నివేదిక ఇవ్వాలని ద్విసభ్య కమిటీని నియమించింది.

అనుమతులకు ఎన్నికల ఆటంకం

సీతమ్మసాగర్ బ్యారేజీ పనులపై 2023, సెప్టెంబరు 23న రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు అందాయి. అప్పటికే రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు వచ్చాయి. డిసెంబరులో కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఆ వెంటనే రాష్ట్ర ప్రభుత్వం, ఇరిగేషన్ శాఖల ఫోకస్ అంతా మేడిగడ్డ బ్యారేజీపై కేంద్రీకృతమైంది. 2024, మార్చి 16న పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ జారీ అయింది. మరోసారి ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. ఫలితంగా సీతమ్మసాగర్ బ్యారేజీ నిర్మాణ అనుమతుల విషయంలో జాప్యం నెలకొంటోంది. మరోవైపు సీతారామ ప్రాజెక్టు కాలువల నిర్మాణ పనులు సాగుతూనే ఉన్నాయి. పంప్ హౌస్ నిర్మాణం పూర్తయి రెండేండ్లుగా నిరుపయోగంగా ఉంది. ఈ నేపథ్యంలో ప్రస్తుత ప్రభుత్వం సీతమ్మసాగర్ నిర్మాణ అనుమతులు సాధించడంపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.



రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు

ఎన్జీటీ ఆదేశాలతో మినిస్ట్రీ ఆఫ్ ఎన్విరాన్‌మెంట్ అండ్ ఫారెస్ట్ రీజినల్ డైరెక్టర్ (హైదరాబాద్), గోదావరి నదీ జలాల నిర్వహణ బోర్డులో ఎస్ఈ ర్యాంక్‌కు తక్కువకాని ఇద్దరు అధికారులతో కూడిన కమిటీ జూన్‌లో క్షేత్రస్థాయిలో పర్యటించింది. నిర్వాసితులతో మాట్లాడి, రికార్డులు పరిశీలించింది. చివరకు 2023, జులై 15న కేంద్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. ఆ నివేదిక ఆధారంగా కేంద్ర పర్యావరణ శాఖ నుంచి రాష్ట్ర ప్రభుత్వం, ఇరిగేషన్ శాఖకు 2023 సెప్టెంబరు 23న నోటీసులు జారీ అయ్యాయి. అందులో కేంద్ర పర్యావరణ శాఖ నుంచి ఎన్విరాన్‌మెంటల్ క్లియరెన్స్ (ఈసీ) రాకుండా నిర్మాణ పనులు ఎందుకు చేపట్టారో తెలపాలని కోరింది. అంతర్రాష్ట్ర వివాదాలు తలెత్తే అవకాశమున్న ఈ ప్రాజెక్టు విషయంలో ఈసీ క్లియరెన్స్ లేకుండా 35 శాతం వరకు నిర్మాణ పనులు చేపట్టడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది.

తిరిగి ఎప్పుడు ప్రారంభమయ్యేనో..!

గత ప్రభుత్వ హయాంలో ఓవైపు నిర్మాణ పనులు చేపడుతూనే మరోవైపు కేంద్రం నుంచి ఈసీ అనుమతుల కోసం ప్రయత్నాలు చేశారు. 2023 జూన్ నాటికి సీతమ్మ సాగర్ బ్యారేజీ నిర్మాణ పనులు సగానికి పైగా పూర్తి చేయాలనే లక్ష్యంతో భారీ ఎత్తున యంత్రసామగ్రి, వర్కర్లను నిర్మాణ స్థలికి తరలించారు. ఇరిగేషన్ అధికారులు సమర్పించిన డీపీఆర్‌కు పదేపదే కేంద్రం కొర్రీలు వేయడంతో అనుమతులు రాలేదు. ఈ అంశంపై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ నుంచి అభ్యంతరాలు వ్యక్తం కావడంతో 2023, మే 29 నుంచి పనులు ఆపేశారు. నిర్మాణ స్థలం నుంచి భారీ యంత్రాలను తరలించారు. కార్మికుల కోసం ఏర్పాటు చేసి గుడారాలు ఖాళీ చేశారు. ఏడాది కాలంగా నిర్మాణ పనుల్లో స్వల్ప కదలిక కూడా లేదు.

సీతారామ పూర్తయితేనే..

భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాలోని 6.50 లక్షల ఎకరాలకు సాగునీరు, 320 మెగావాట్ల జలవిద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా బహుకార్ధ సాధక ప్రాజెక్టుగా సీతారామ ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వం చేపట్టింది. అందులో భాగంగా అశ్వాపురం, దుమ్ముగూడెం మండలాల మధ్యన గోదావరి నదిపై సీతమ్మ సాగర్ పేరుతో ప్రాజెక్టు నిర్మిస్తోంది. సీతారామ ప్రాజెక్టు పూర్తయితే గానీ ప్రభుత్వం దీనిపై దృష్టి కేంద్రీకరించే అవకాశం ఉంది.

రేపు మంత్రుల పర్యటన

సీతారామ ప్రాజెక్టుతో పాటు సీతమ్మ సాగర్ బ్యారేజీని సందర్శించేందుకు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గురువారం అశ్వాపురం మండలానికి వెళ్తారు. 2016లో ప్రారంభమైన ఈ ప్రాజెక్టు నిర్మాణం కూడా నత్తనడకన సాగుతుండటంపై మంత్రులు సమీక్ష నిర్వహించనున్నారు. సీతమ్మ సాగర్ బ్యారేజీ పర్యావరణ అనుమతులపైనా చర్చిస్తారు.

హైదరాబాద్‌కు ఈవీఎం, వీవీ ప్యాట్లు

- అదనపు కలెక్టర్ అపూర్వ చౌహాన్



నవతెలంగాణ- జోగులాంబ గద్వాల

ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు గద్వాల, అలంపూర్ సెగ్మెంట్లకు సంబంధించిన సి-కేటగిరి, ఫస్ట్ లెవెల్ చెకింగ్‌కాని సీయూలు, బీయూలు, వీవీ ప్యాట్లను హైదరాబాద్‌లోని ఈసీఐఎల్, ఈఎస్ఎండీకి తరలించామని జిల్లా అదనపు కలెక్టర్ అపూర్వ చౌహాన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వర్లు, సి-సెక్షన్ సూపరింటెండెంట్ నరేష్, ఎన్నికల సిబ్బంది, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

హామీల అమలు తేదీలపై స్పష్టతనివ్వాలి

- లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ప్రజలు తిరస్కరించారు
- సీఎం రేవంత్‌రెడ్డికి బీజేపీ ఎల్పీ నేత ఏలేటి లేఖ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రుణమాఫీని ఆగస్టు 15వ తేదీలోగా చేస్తామని ప్రకటించినట్టుగానే మిగతా హామీల అమలు తేదీలపైనా స్పష్టతనివ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని బీజేపీ ఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. మంగళవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. మీరిచ్చిన ఇచ్చిన 420 హామీల్లో ప్రధాన అంశాలు మాత్రం ఎప్పటి నుంచి అమలు చేస్తారనే స్పష్టత ఇవ్వకపోవడమంటే ఓట్లేసిన ప్రజలను మోసం చేయడమేననీ, అందుకే రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్‌కు ఎంపీ ఎన్నికల్లో 8 సీట్లను మాత్రమే ఇచ్చారని విమర్శించారు. రైతు భరోసా కింద కౌలు రైతులకు, రైతులకు ఇస్తామన్న రూ.15 వేల సాయం, వ్యవసాయ కూలీలకు ఇస్తామన్న రూ.12 వేలు ఏమయ్యాయని ప్రశ్నించారు. సన్నవడ్లకే రూ.500 బోనస్ అని రాష్ట్ర ప్రభుత్వం మోసం చేసిందని విమర్శించారు. వరికి బోనస్ హామీని బోగస్ చేసిన విధంగానే మిగిలిన వాగ్దానాలను కూడా ఏదో మెలికలు, షరతులు విధించి నీరు గార్చాలని చూస్తే మాత్రం బిజెపి సహించదని, ప్రజల తరఫున నిలబడి ఇచ్చిన హామీల అమలుకు పోరాడుతామని మహేశ్వర్ రెడ్డి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ప్రజాదర్బార్ అటకెక్కిందని విమర్శించారు. కాళేశ్వరం కుంభకోణంపై న్యాయవిచారణ జరుగుతున్నదనీ, అందుకు బాధ్యులైన వారిపై చర్యలేవని ప్రశ్నించారు. ధరణి పోర్టల్ అక్రమాలపై చర్యలేవని నిలదీశారు.

జీపీ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలి

- ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేయాలి : మంత్రి సీతక్క, ఆ శాఖ ప్రధాన కార్యదర్శి, కమిషనర్‌కు సీఐటీయూ వినతి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

గ్రామపంచాయతీ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న ఆరేడు నెలల వేతనాలను తక్షణమే చెల్లించేలా చూడాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని తెలంగాణ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) ప్రధాన కార్యదర్శి చాగంటి వెంకటయ్య, అధ్యక్షులు జి.పాండు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్కకు, ఆ శాఖ ప్రధాన కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియాకు, కమిషనర్ అనితా రామచంద్రన్‌కు వారు వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర నాయకులు పి.సుధాకర్, పి.యాదమ్మ తదితరులు పాల్గొన్నారు. అనంతరం వెంకటయ్య, పాండు మాట్లాడుతూ..పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లిస్తామనీ, మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేస్తామని మంత్రి సీతక్క హామీనిచ్చారని తెలిపారు. పంచాయతీ సిబ్బంది పర్మినెంట్, వేతనాలకు ప్రత్యేక బడ్జెట్ అంశాలను మంత్రి, అధికారుల దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. మొదటి పీఆర్సీలో నిర్ణయించిన 30 శాతం వేతనాలను జీపీ సిబ్బందికి అమలు చేయాలనీ, రెండో పీఆర్సీ పరిధిలోకి తీసుకురావాలని కోరామన్నారు. కారోబార్, బిల్‌కలెక్టర్లను సహాయ కార్యదర్శులుగా నియమించాలని విన్నవించామన్నారు. విధినిర్వహణలో మరణించిన సిబ్బంది కుటుంబాలకు రూ.10 లక్షల పరిహారాన్ని ప్రభుత్వమే ఇవ్వాలనీ, పోస్టాఫీసు ద్వారా బీమా చెల్లించాలని డిమాండ్ చేశామన్నారు. సహజ మరణ ఇన్సూరెన్స్‌ను రూ.5 లక్షలకు పెంచాలనీ, బాధిత కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరామని తెలిపారు. జనాభా ప్రకారం కాకుండా అవసరాల ప్రాతిపదికన సిబ్బందిని తీసుకోవాలనీ, వేతనాలు పెంచాలని డిమాండ్ చేశామని చెప్పారు. పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాదబీమా, గ్రాట్యూటీ వంటి సౌకర్యాలను కల్పించాలని విజ్ఞప్తి చేశామన్నారు. కార్మికులు మరణిస్తే దహనసంస్కారాలకు రూ.20 వేలు ఇవ్వాలని కోరామని చెప్పారు. ఆదాయమున్న పంచాయతీలలో వేతనాలు పెంచుకునేందుకు అనుమతి ఇవ్వాలని విజ్ఞప్తి చేశామన్నారు. ఏపీలో మాదిరిగా మన రాష్ట్రంలో జీపీ కార్మికులకు గుర్తింపు కార్డులివ్వాలని డిమాండ్ చేసినట్లు తెలిపారు.

మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలల అభివృద్ధికి కృషి

- టీజీఎంఆర్ఈఐఎస్ వైస్ చైర్మెన్ మహమ్మద్ ఫహీముద్దీన్ ఖురేషి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తున్నదని తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ(టీజీఎంఆర్ఈఐఎస్) వైస్ చైర్మెన్ మహమ్మద్ ఫహీముద్దీన్ ఖురేషి తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో తెలంగాణ మైనార్టీ పాఠశాలలు, జూనియర్ కాలేజీల ప్రిన్స్‌పాల్స్, రీజినల్ లేవల్ కో ఆర్డినేటర్లు(ఆర్ఎల్ఎస్), జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఖురేషి మాట్లాడుతూ ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఆయా సంస్థలకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రిన్స్‌పాళ్లకు సూచించారు. ఈ ఏడాది మంచి ఫలితాలు సాధించినందుకు అభినందించారు. ప్రధానోపాధ్యాయులు విద్యార్థుల్లో క్రమశిక్షణను పెంపొందించాలని సూచించారు. టీజీఎంఆర్ పాఠశాలలు అన్ని విధాలుగా అగ్రస్థానంలో ఉండాలన్నారు. విద్యార్థులకు మంచి పరిశుభ్రమైన ఆహారాన్ని అందించాలని సూచించారు.

మాది ప్రజా ప్రభుత్వం.. సంక్షేమమే ధ్యేయం

ప్రజాప్రతినిధులు, అధికారులూ సమన్వయంతో పనిచేయాలి

- భద్రాద్రి జిల్లా స్థాయి సమీక్షా సమావేశంలో మంత్రి పొంగులేటి



నవతెలంగాణ-పాల్వంచ

తమది ప్రజా ప్రభుత్వమని, వారి సంక్షేమమే తమ ధ్యేయం అని రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మంగళవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఐడీఓసీ కార్యాలయంలోని సమావేశ మందిరంలో రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల జిల్లా స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రజలందరికీ చేరవేసే విధంగా ప్రజాప్రతినిధులతో పాటు ప్రభుత్వ అధికారులు సమన్వయంతో కలిసికట్టుగా పనిచేయాలన్నారు. ముఖ్యంగా పింఛన్లు, తాగునీరు, విద్యా, వైద్యం, గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు, కల్వర్టుల మీద ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. భద్రాచలం, కొత్తగూడెం డివిజన్లలో చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పనులు త్వరగా పూర్తి చేసి లబ్దిదారులకు అందించాలన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల పనులు త్వరగా పూర్తిచేసి పండుగ వాతావరణంలో పాఠశాలలు ప్రారంభించాలని, అదే రోజు పిల్లలకు బుక్స్, యూనిఫామ్ మిగతా మెటీరియల్ అందజేయాలని తెలిపారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దడానికి రూ.650 కోట్లకు పైగా ఖర్చు పెట్టి పెద్ద ఎత్తున పాఠశాలల నిర్మాణం చేపట్టామని, 80 శాతం వరకు పాఠశాలలు పూర్తయ్యాయని, వారం రోజుల్లో అన్ని పనులు పూర్తయ్యేలా కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేశామన్నారు.

ధరణి దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియలో ముఖ్యంగా గిరిజన గ్రామాల్లోని రైతులకు ఇబ్బందులు కలుగకుండా పూర్తి చేయాలన్నారు. అవకతవకలు జరిగినట్టు తన దృష్టికి వస్తే తప్పనిసరిగా సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న 2 లక్షల 45 వేల ధరణి దరఖాస్తుల్లో ఎలక్షన్ కోడ్ రాకముందే లక్ష వరకు క్లియర్ చేశామన్నారు. ఆ తర్వాత మిగిలిన దరఖాస్తులు, కొత్తగా రైతులు సమర్పించిన వాటితో కలిపి 2 లక్షల 55 వేలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటినీ వారం రోజుల్లో పరిష్కరిస్తామని అన్నారు. ధరణిలో లోపాలను సరిచేసేందుకు ప్రత్యేకంగా ఒక కమిటీని ఏర్పాటు చేశామన్నారు. కొత్తగూడెం నియోజకవర్గంలోని చేతకొండ, రేగళ్ల, పాల్వంచ తదితర గ్రామాల్లోని వేల ఎకరాల భూములకు ఆన్‌లైన్ ప్రక్రియలో సమస్యలు వస్తున్నట్టు తన దృష్టికి వచ్చిందని, నియోజకవర్గ ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్ సమన్వయంతో వారం రోజుల్లో సమస్య పరిష్కరించుకోవాలని సూచించారు.

వర్షాకాలం ప్రారంభమైనందున వైద్య పరంగా మారుమూల గిరిజన గ్రామాల్లో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అన్ని పీహెచ్‌సీల్లో సరిపడా మందులు, అంబులెన్స్‌లు అందుబాటులో ఉంచుకోవాలని, వైద్య సిబ్బంది స్థానికంగా ఉండేలా సంబంధిత వైద్యశాఖ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని రిమోట్ ఏరియాల్లో ఎమ్మెల్యేలు, కలెక్టర్‌తో పాటు ఐటీడీఏ పీవో, ఆర్డీవోలు, జిల్లా అధికారులు అన్ని ఆస్పత్రులను తనిఖీ చేయాలని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నిర్మాణం అసంపూర్తిగా ఉంటే వెంటనే పూర్తి చేయాలని తెలిపారు. భద్రాచలం నియోజకవర్గంలో ఎక్కువ శాతం గిరిజన గ్రామాల్లో త్రీ ఫేస్ కరెంటు సరిగా లేదని, దానికి సంబంధించిన సర్వే చేపట్టి ప్రతిపాదనలను సమర్పించాలన్నారు.

జిల్లాలోని రైతులకు నాణ్యమైన విత్తనాలతో పాటు ఆగస్టు, సెప్టెంబర్ వరకు ఎరువులు సిద్ధంగా ఉంచాలన్నారు. అలాగే ఆగస్టు 15వ తేదీలోగా రైతులందరికీ రుణమాఫీకి సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని తెలిపారు. ప్రభుత్వ భూములతో పాటు పట్టా భూములను ఎవరైనా కబ్జా చేసినట్టు దృష్టికి వస్తే వెంటనే వారిపై క్రిమినల్ కేసులు పెట్టి కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్మెన్ కంచర్ల చంద్రశేఖర్, ఎమ్మెల్యేలు కూనంనేని సాంబశివరావు, పాయం వెంకటేశ్వర్లు, కోరం కనకయ్య, మాలోతు రాందాస్, తెల్లం వెంకట్రావు, జారే ఆదినారాయణ, కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా, ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్, జేసీ వేణుగోపాల్, డీఆర్ఓ రవీంద్రనాథ్, ఆర్డీఓలు మధు, దామోదర్ రావు, డీఎఫ్ఓ కృష్ణ గౌడ్, మున్సిపల్ చైర్మెన్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

'రవాణా' రెవెన్యూ పెంచండి



- స్కూల్ బస్సుల ఫిట్‌నెస్‌పై తనిఖీలు చేయండి
- కార్లకు బ్లాక్ ఫిల్మ్ ఉంటే చలాన్లు వేయండి
- చెక్‌పోస్టుల్లో నిఘా పెంచాలి
- రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాలి : అధికారులకు మంత్రి పొన్నం ప్రభాకర్ దిశానిర్దేశం

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రవాణాశాఖ ఆదాయాన్ని పెంచేందుకు చట్టపరిధికి లోబడి ఉన్న ప్రత్యామ్నాయ మార్గాలపై అధ్యయనం చేయాలని ఆ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారుల్ని ఆదేశించారు. చెక్‌పోస్టుల్ని బలోపేతం చేయడం ద్వారా అక్రమ రవాణాను అరికట్టొచ్చనీ, స్కూళ్లు రీఓపెన్ అవుతున్నందున స్కూల్ బస్సుల ఫిట్‌నెస్‌పై తనిఖీలు చేపట్టాలని చెప్పారు. కార్లకు బ్లాక్ ఫిల్మ్‌లు ఉంటే చలాన్లు విధించాలనీ, ఓవర్‌లోడ్‌ను అనుమతించొద్దని అన్నారు. పన్ను వసూళ్లను వందశాతం చేయాలనీ, విధినిర్వహణలో నిర్లక్ష్యం వద్దని హెచ్చరించారు. మంగళవారంనాడాయన బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో రవాణా శాఖ ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లా రవాణా శాఖ అధికారులు, డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్లు, ఆర్టీవోలు పాల్గొన్నారు. త్రైమాసిక టాక్స్ వసూళ్ళను తక్కువగా నమోదు చేసిన ఆయా జిల్లాల అధికారులు తమ పనితీరు మెరుగుపర్చుకోవాలని సూచించారు. వందశాతం పన్ను వసూలు చేసిన జిల్లా అధికారులను అభినందించారు. సమావేశానికి హాజరకాని అధికారులకు నోటీసులు ఇచ్చి వివరణ కోరాలని ఆదేశించారు. ప్రయివేటు భవనాల్లో నడుస్తున్న రవాణాశాఖ కార్యాలయాలకు సొంత భవనాల నిర్మాణం కోసం భూమిని పరిశీలించాలనీ, ముఖ్యమంత్రితో చర్చించి ఆయా భూముల కేటాయింపుపై నిర్ణయం తీసుకుంటామన్నారు. ప్రభుత్వం ఆదాయం పెంచమందనే కారణాన్ని సాకుగా తీసుకొని, విచక్షణా రహితంగా వేధించొద్దనీ, చట్ట ప్రకారమే వ్యవహరించాలని సూచించారు. జిల్లాల్లో విధిగా వాహనాలను తనిఖీలు చేస్తూ ప్రభుత్వం ఇచ్చిన టార్గెట్లు పూర్తి చేయాలని సూచించారు. రోడ్డు భద్రతపై అన్ని స్కూళ్లు, కాలేజీల్లో జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో వారం రోజులపాటు అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. స్కూల్ బస్సుల వివరాలు, రూట్, గమ్యానికి చేరే సమయం తెలిసేలా స్కూల్‌బస్ యాప్‌ను అప్‌డేట్ చేస్తే, తల్లిదండ్రులు తమ పిల్లల క్షేమ సమాచారం తెలుసుకోవడం సులభమవుతుందని కొందరు అధికారులు మంత్రి దృష్టికి తెచ్చారు.

ఈ సూచనను పరిశీలన చేయాలని ఈ సందర్భంగా ఆయన ఆదేశించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్‌ను మరింత బలోపేతం చేయాలనీ, సీజ్ అయిన వాహనాలపై విధానపరంగానే చర్యలు ఉండాలనీ, వాటిని భద్రపరిచే ప్రదేశాలపై జిల్లా పోలీస్ అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. హైదరాబాదులో ఆటోరిక్షాలపై ప్రస్తుతం ఉన్న పాలసీని సీఎన్‌జీ, ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహించేలా రూపొందించాలన్నారు. డ్రైవింగ్ లైసెన్స్, రిజిస్ట్రేషన్ విషయంలో అవినీతికి ఆస్కారం లేకుండా సేవలన్నింటినీ కేంద్రీకృతం చేస్తే ఎలా ఉంటుందనే దానిపై అధ్యయనం చేయాలని చెప్పారు. సమావేశంలో స్పెషల్ సెక్రటరీ విజయేంద్ర బోయి, రవాణా శాఖ కమిషనర్ జ్యోతి బుద్ధప్రకాష్, జాయింట్ కమిషనర్లు ప్రవీణ్, రమేష్ మమత తదితరులు పాల్గొన్నారు.

మోగిన బడిగంట

- నేటినుంచి పాఠశాలలు పున:ప్రారంభం
- ఇంకా పూర్తి కాని అమ్మ ఆదర్శ పనులు
- సమస్యలతో సర్కారు స్కూళ్లు సతమతం
- బదిలీలు, పదోన్నతుల్లో అధికారులు, పంతుళ్లు బిజీబిజీ
- స్వచ్ఛ కార్మికుల నియామకం ప్రశ్నార్థకం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్
రాష్ట్రంలో ప్రభుత్వ ఎయిడెడ్, ప్రయివేటు పాఠశాలలు బుధవారం నుంచి పున:ప్రారంభం కానున్నాయి. ఈ ఏడాది ఏప్రిల్ 24 నుంచి మంగళవారం వరకు పాఠశాలలకు ప్రభుత్వం వేసవి సెలవులు ప్రకటించింది. మంగళవారంతో సెలవులు ముగిశాయి. బుధవారం బడిగంట మోగనుంది. వేసవి సెలవులకు బైబై చెప్పి పిల్లలంతా బడిబాట పడతారు. అయితే రాష్ట్రంలో సర్కారు బడులు సమస్యల్లో కొట్టుమిట్టాడుతున్నాయి. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన పనులు చేపట్టినా నామమాత్రంగానే పూర్తయ్యాయి. ఆ పనులు ఇంకా పూర్తి కాలేదు. దీంతో సర్కారు బడులు సమస్యలతో స్వాగతమిస్తున్నాయి. హన్మకొండ జిల్లాలో మొదటి దశలో 270 పాఠశాలలను ఎంపిక చేశారు. రూ.9.29 కోట్ల అంచనాతో పనులు చేపట్టినా రూ.2.32 కోట్లు ముందస్తుగా విడుదలయ్యాయి. 226 బడుల్లో పనులు పూర్తయ్యాయి. 46 పాఠశాలల్లో పనులు ఇంకా పూర్తి కాలేదు. జనగామ జిల్లా పాలకుర్తి మండలంలో 74 ప్రభుత్వ ఉన్నత, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలలతోపాటు గురుకులాలున్నాయి. విద్యార్థుల్లేక 16 బడులు గతేడాది మూతపడ్డాయి. 30 అమ్మ ఆదర్శ పాఠశాలలు ఎంపికయ్యాయి. ఆ పనులు తుదిదశకు చేరుకున్నాయి. దేశంలోనే అక్షరాస్యతలో పాలమూరు అత్యంత వెనకబడిన జిల్లాగా పేరుంది. గట్టు, ఐజ, ఆలంపూర్ ప్రాంతాలలో 25 శాతానికి మించి అక్షరాస్యత లేదు. ప్రభుత్వ పాఠశాలలు మౌలిక వసతులు లేక సతమతమవుతున్నాయి. బుధవారం నుంచి బడులు ప్రారంభమవుతున్నా వసతులు పూర్తిస్థాయిలో అధికారులు సిద్ధం చేయలేదు. దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి రానుంది. ముఖ్యంగా అమ్మాయిలకు ప్రత్యేకంగా మరుగుదొడ్ల నిర్మాణం పూర్తి కాకపోవడంతో మరిన్ని కష్టాలు ఎదుర్కోవాల్సి వస్తుంది. రాష్ట్రంలో మొత్తం 26,823 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. వాటిలో 21.19 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, ఒక జత బట్టలు (యూనిఫారాలు) విద్యార్థులకు అందనజేసేందుకు సిద్ధంగా ఉన్నాయి. 2019-20 విద్యాసంవత్సరంలో రాష్ట్రంలో 15 వేల మంది వరకు స్వచ్ఛ కార్మికులను గత ప్రభుత్వం నియమించింది. పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను బట్టి ఒకరి నుంచి ఆరుగురు స్వచ్ఛ కార్మికులు పనిచేశారు. వారికి ప్రభుత్వం నెలకు ఇచ్చే పారితోషికం రూ.2,500 మాత్రమే. ప్రస్తుతం అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోనూ స్వచ్ఛ కార్మికుల అవసరమున్నది. ఏడాదికి వారికయ్యే వ్యయం రూ.వంద కోట్లు మాత్రమేనని విద్యాశాఖ అంచనా వేసింది. స్వచ్ఛ కార్మికుల నియామకంపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. దీంతో బడుల్లో పారిశుధ్యం ప్రశ్నార్థకంగా మారనుంది. అమ్మ ఆదర్శ పాఠశాలల కింద పనులు చేపట్టినా మరుగుదొడ్లు ఎవరు శుభ్రం చేస్తారన్న ప్రశ్న తలెత్తుతున్నది. ఇదే విషయాన్ని ఇప్పటికే ఉపాధ్యాయ సంఘాలు అధికారుల దృష్టికి తీసుకెళ్లాయి. అయినా ఇప్పటి వరకు స్పష్టత రాలేదు.

ఉపాధ్యాయుల కొరత తీరేనా?

రాష్ట్రంలో ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ శనివారం నుంచి కొనసాగుతున్నది. మల్టీజోన్-1 పరిధిలో శనివారం నుంచి ఈనెల 22 వరకు, మల్టీజోన్-2 పరిధిలో శనివారం నుంచి ఈనెల 30 వరకు బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ పూర్తవుతుంది. టెట్‌తో సంబంధం లేకుండానే ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పిస్తారు. దీంతో విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు బదిలీలు, పదోన్నతుల ప్రక్రియలో బిజీబిజీగా ఉండనున్నారు. ఆ ప్రక్రియ పూర్తయిన తర్వాత కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్ల కొరత ఉండే అవకాశమున్నది. డీఎస్సీ-2024 నియామకాల ప్రక్రియ ఆలస్యమవుతుంది. దీంతో సబ్జెక్టు టీచర్ల కొరత తీరేనా? అన్న ఆందోళన వ్యక్తమవుతున్నది.

ఆ తేడా ఎందుకు వచ్చిందో...?

పోలైన, లెక్కించిన ఓట్ల మధ్య వ్యత్యాసాలు

- 362 స్థానాల్లో లెక్కకు రాని ఐదున్నర లక్షల ఓట్లు
- 176 స్థానాల్లో మిగులు ఓట్లు నమోదు



న్యూఢిల్లీ : లోక్‌సభ ఎన్నికలు ముగిసి కేంద్రంలో నరేంద్ర మోడీ నేతృత్వంలో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడింది. అయితే అనేక లోక్‌సభ స్థానాల్లో ఈవీఎంల్లో పోలైన ఓట్లకు, లెక్కించిన ఓట్లకు మధ్య వ్యత్యాసాలు కన్పిస్తున్నాయి. 362 స్థానాల్లో అక్షరాలా 5,54,598 ఓట్ల తేడా కన్పించింది. అంతేకాదు...176 నియోజకవర్గాల్లో ఈవీఎంల్లో అదనంగా 35,093 ఓట్లు నమోదయ్యాయని ఎన్నికల కమిషన్ గుర్తించింది. ఓటింగ్‌కు సంబంధించి ఎన్నికల కమిషన్ విడుదల చేసిన రెండు రకాల సమాచారాలను 'ది క్వింట్' పోర్టల్ విశ్లేషించింది. మొదటిది... పోలైన ఓట్లు. రెండోది... ఫలితాల రోజు లెక్కించిన ఓట్లు. లోక్‌సభలో మొత్తం 542 స్థానాలు ఉండగా ఏకంగా 538 చోట్ల సమాచారాల మధ్య వ్యత్యాసం కన్పించింది. ఈవీఎంల్లో పడిన ఓట్లు, ఫలితాల రోజు లెక్కించిన ఓట్ల మధ్య స్పష్టమైన తేడా ఉందని 'ది క్వింట్' పోర్టల్ గుర్తించింది.కనీసం 267 నియోజకవర్గాల్లో ఈ వ్యత్యాసం 500 ఓట్ల కంటే ఎక్కువగానే కన్పించింది. ఉదాహరణకు తమిళనాడులోని తిరువల్లూర్ స్థానంలో ఈవీఎంల్లో 14,30,738 ఓట్లు పోలయ్యాయి.

కానీ ఫలితాల రోజు 14,13,947 ఓట్లను మాత్రమే లెక్కించారు. అంటే 16,791 ఓట్ల తేడా వచ్చింది. ఇలా ఎందుకు జరిగిందనే విషయంపై ఎన్నికల కమిషన్ ఎలాంటి వివరణ ఇవ్వలేదు. అయితే మాక్ పోలింగ్ డాటాను కంట్రోల్ యూనిట్ నుండి తొలగించకుండా ప్రిసైడింగ్ అధికారులు అసలైన పోలింగ్‌ను ప్రారంభిస్తే ఓట్లలో వ్యత్యాసం వస్తుందని ఉత్తరప్రదేశ్ ఎన్నికల అధికారి తెలిపారు. ప్రిసైడింగ్ అధికారి పోలైన ఓట్లను ఫారం 17-సీలో తప్పుగా నమోదు చేసినా ఇలా జరుగుతుందని ఆయన వివరణ ఇచ్చారు.

> ఈవీఎంల్లో ఎక్కువ లేదా తక్కువ ఓట్లు పడడంపై ఎన్నికల కమిషన్ నియోజకవర్గాల వారీగా నిర్దిష్టమైన వివరణ ఇవ్వాల్సి ఉంటుందని, అప్పుడే ఓట్ల లెక్కింపు ప్రక్రియలో పారదర్శకత కన్పిస్తుందని అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) సహ వ్యవస్థాపకుడు జగదీప్ ఛోకర్ చెప్పారు. ఒడిషాలోని జల్‌పూర్‌లో 809 ఓట్లను అదనంగా లెక్కించారు. అక్కడ బీజేపీ అభ్యర్థి రవీంద్ర నారాయణ్ బెహరా 1,587 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు.

లెక్కించిన ఓట్లే అధికం

కారణం ఏదైనప్పటికీ పలు నియోజకవర్గాల్లో ఈవీఎంల్లో పోలైన ఓట్లకు, లెక్కించిన ఓట్లకు మధ్య తేడాలు కన్పించాయి. అసోంలోని కరింగంజ్‌లో 3,811 ఓట్లు, ఆంధ్రప్రదేశ్‌లోని ఒంగోలులో 1,467 ఓట్లు, ఒడిషాలోని బాలాసోర్‌లో 1,173 ఓట్లు, మధ్యప్రదేశ్‌లోని మాండ్లాలో 1,089 ఓట్లు, బీహార్‌లోని బక్సర్ స్థానంలో 1,010 ఓట్ల వ్యత్యాసం ఉంది. ఈ స్థానాలన్నింటిలోనూ ఈవీఎంల్లో పోలైన ఓట్ల కంటే లెక్కించిన ఓట్లే అధికారంగా ఉన్నాయి.

అక్కడ ఈవీఎం ఓట్లే అధికం

ఈవీఎంల్లో పోలైన ఓట్ల కంటే లెక్కించిన ఓట్లు తక్కువగా ఉన్న నియోజకవర్గాలు కూడా ఉన్నాయి. తమిళనాడులోని తిరువల్లూరులో 16,791, అసోంలోని కోక్రాఝార్‌లో 10,760, ఒడిషాలోని ఢెన్కానాల్‌లో 9,427, కేరళలోని అలప్పుజాలో 7,928, ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరులో 7,928 ఓట్లు ఈ విధంగా తక్కువగా లెక్కింపుకు వచ్చాయి.

సుప్రీంకోర్టు ఏం చెప్పింది?

2019 ఎన్నికల్లో కూడా ఈవీఎం ఓట్లకు, లెక్కించిన ఓట్లకు మధ్య వ్యత్యాసాలు బయటపడ్డాయి. దీనిపై ఏడీఆర్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. వాస్తవమైన, కచ్చితమైన ఓటింగ్ సమాచారాన్ని సరిపోల్చుకున్న తర్వాతే తుది ఫలితాన్ని ప్రకటించేలా ఎన్నికల కమిషన్‌ను ఆదేశించాలని ఆ పిటిషన్‌లో కోరింది. ఈవీఎంలో పడిన ఓట్లను వీవీపాట్ స్లిప్పులతో సరిపోల్చుకోవాలంటూ దాఖలైన పలు పిటిషన్లను సుప్రీంకోర్టు ఏప్రిల్ 26న తోసిపుచ్చింది. తాము నాలుగు కోట్ల స్లిప్పులను వెరిఫై చేశామని, ఎక్కడా తేడా రాలేదని ఎన్నికల కమిషన్ సుప్రీంకోర్టుకు నివేదించిన తర్వాత ఈ తీర్పు వెలువడింది.

ఈసీ వివరణ కోరుతున్న ప్రజలు

ఈవీఎంలో పోలైన ఓట్లకు, లెక్కించిన ఓట్లకు మధ్య వ్యత్యాసం ఉంటే ప్రజల మనసుల్లో అనుమానాలు ఏర్పడతాయని ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత కోసం కృషి చేస్తున్న అంజలి భరద్వాజ్ తెలిపారు. ఎన్నికల ఫలితాలకు సంబంధించిన పార్ట్-2 సహా ఫారం 17-సీని పూర్తిగా పబ్లిక్ డొమైన్‌లో ఉంచితే అనుమానాలకు ఆస్కారం ఉండదని చెప్పారు.

పోలైన ఓట్లకు సంబంధించిన సమాచారం ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్‌లో కన్పిస్తుందని, కాబట్టి సాంకేతికంగా చూస్తే వ్యత్యాసం రాకూడదని, అయినప్పటికీ వస్తే నియోజకవర్గాల వారీగా కమిషన్ వివరణ ఇవ్వాలని ఆమె సూచించారు.

బీజేపీలో సంస్థాగత మార్పులు ?



- కేంద్రమంత్రైన పార్టీ అధ్యక్షుడు నడ్డా
- పదవీకాలం ముగిసిన ప్రధాన కార్యదర్శి సంతోష్
- ఈ రెండు పదవుల భర్తీకి ప్రయత్నాలు
- ఓడిన మంత్రులకూ పార్టీ పనులు

న్యూఢిల్లీ : లోక్‌సభ ఎన్నికల ఫలితాలు బీజేపీకి నిరుత్సాహాన్ని కలిగించాయి. ఆ పార్టీ 63 స్థానాలను కోల్పోయింది. ఈ నేపథ్యంలో సంస్థాగతంగా పార్టీలో భారీ మార్పులు చేపట్టేందుకు ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం పార్టీ అధ్యక్షుడిగా ఉన్న జేపీ నడ్డాను కేంద్ర మంత్రిమండలిలోకి తీసుకోవడంతో ఆ పదవిని భర్తీ చేయాల్సి ఉంటుంది. పార్టీ వ్యవస్థలో అత్యంత శక్తివంతమైన మరో పదవి ప్రధాన కార్యదర్శి. పార్టీలో అధ్యక్షుడి తర్వాత రెండో స్థానం ప్రధాన కార్యదర్శిదే. ప్రస్తుతం ఆ పదవిలో ఉన్న బీఎల్ సంతోష్ తన రెండు సంవత్సరాల పదవీకాలాన్ని పూర్తి చేసుకున్నారు. దీంతో అధ్యక్షుడితో పాటు ప్రధాన కార్యదర్శిని కూడా ఎంపిక చేయాల్సిన అవసరం ఏర్పడింది.

గతంలో బీజేపీ అధ్యక్షులుగా వ్యవహరించిన రాజ్‌నాథ్ సింగ్, అమిత్ షా కూడా కేంద్ర క్యాబినెట్‌లో చేరారు. 2014లో నరేంద్ర మోడీ ప్రధాని అయిన తర్వాత వారిద్దరూ పార్టీ పదవుల నుండి వచ్చి ప్రభుత్వంలో సీనియర్ మంత్రులుగా ఎదిగారు. 2019లో నడ్డా బీజేపీ వర్కింగ్ ప్రసిడెంట్‌గా నియమితులయ్యారు. 2020లో అమిత్ షా స్థానంలో పార్టీ అధ్యక్షుడయ్యారు. అప్పుడు అమిత్ కేంద్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. హిమాచల్ ప్రదేశ్‌కు చెందిన నడ్డా మూడేండ్ల పదవీకాలం గత సంవత్సరం జనవరితోనే ముగిసినప్పటికీ లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని దానిని పొడిగించారు. కేంద్ర మంత్రిగా నియమితులైనప్పటికీ నడ్డా ఇప్పటి వరకూ పార్టీ అధ్యక్ష పదవికి రాజీనామా చేయలేదు. మోడీ ఆర్‌ఎస్‌ఎస్ సీనియర్ నేతలతో చర్చించి నడ్డా స్థానంలో వేరొకరిని అధ్యక్షుడిగా నియమిస్తారా లేక ప్రస్తుతం వర్కింగ్ ప్రెసిడెంటును నియమించి, ఆ తర్వాత ఆయనను అధ్యక్షుడిని చేస్తారా అనేది చూడాల్సి ఉంది.

బీజేపీ అధ్యక్ష పదవికి గతంలో ఇద్దరు మాజీ ముఖ్యమంత్రులు...శివరాజ్ సింగ్ చౌహాన్, మనోహర్ లాల్ ఖట్టర్ పేర్లు వినిపించాయి. అయితే వారిని కూడా కేంద్ర క్యాబినెట్‌లో చేర్చుకున్నారు. అధ్యక్ష పదవికి పోటీ పడిన భూపేంద్ర యాదవ్, పీయుష్ గోయల్ కూడా మంత్రులయ్యారు. తాజాగా మహారాష్ట్రకు చెందిన వినోద్ తాడే పేరు విన్పిస్తోంది.

బీజేపీకి దళితులు, ఓబీసీలు దూరమైన నేపథ్యంలో వెనుకబడిన తరగతులకు చెందిన వ్యక్తికి పార్టీ అధ్యక్ష పదవిని అప్పగించే యోచన కూడా చేస్తున్నారు. మహారాష్ట్ర, జార్ఖండ్, హర్యానా రాష్ట్రాల్లో జరగబోయే శాసనసభ ఎన్నికలు నూతన అధ్యక్షుడికి పరీక్షగా నిలవబోతున్నాయి.లోక్‌సభ ఎన్నికల్లో పరాజయం పాలైన 16 మంది కేంద్ర మంత్రులకు కూడా బీజేపీ ఏదో ఒక బాధ్యత అప్పగించాల్సి ఉంటుంది. వారిలో కొందరికి పార్టీ పదవులు కట్టబెట్టవచ్చు. లోక్‌సభ ఎన్నికల్లో విజయం సాధించినా మంత్రి పదవి కోల్పోయిన అనురాగ్ సింగ్ ఠాకూర్‌కు సైతం పార్టీ పదవి లభించే అవకాశం ఉంది.

రాజ్యసభలో పది స్థానాలు ఖాళీ

లోక్‌సభకు ఎన్నికైన ఎగువసభ సభ్యులు

నవతెలంగాణ - న్యూఢిల్లీ బ్యూరో
రాజ్యసభలో పది స్థానాలు ఖాళీ అయ్యాయి. మొన్న జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఈ పది మంది సభ్యులు ఎన్నికయ్యారు. రాజ్యసభ సెక్రెటేరియట్ ఆ ఖాళీలను నోటిఫై చేసింది. ఇందులో అసోం, బీహార్, మహారాష్ట్రల్లో రెండు, హర్యానా, మధ్యప్రదేశ్, రాజస్థాన్, త్రిపురల్లో ఒక్కొటి చొప్పున ఉన్నాయి. రాజ్యసభ సెక్రెటేరియట్ సీట్ల ఖాళీ వివరాలు తెలియజేస్తూ నోటిఫికేషన్‌లో పేర్కొంది. "కామాఖ్య ప్రసాద్ తాసా, సర్బానంద సోనోవాల్ (అసోం), మిసా భారతి, వివేక్ ఠాకూర్ (బీహార్), దీపేందర్ సింగ్ హుడా (హర్యానా), జ్యోతిరాదిత్య సింధియా (మధ్యప్రదేశ్), ఉదయన్‌రాజే భోంస్లే (మహారాష్ట్ర), పీయూష్ గోయల్ (మహారాష్ట్ర), కేసీ వేణుగోపాల్ (కేరళ), విప్లవ్ కుమార్ దేబ్ (త్రిపుర) ఖాళీలు ఏర్పడ్డాయి. నోటిఫికేషన్ తర్వాత ఈ ఖాళీల భర్తీకి ఎన్నికల నిర్వహణకు కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) తేదీలను ప్రకటించనుంది.

కాలిఫోర్నియా వర్సిటీలో పాలస్తీనా అనుకూల ఆందోళనకారుల నిరసనలు

లాస్‌ఏంజెల్స్ : లాస్‌ఏంజెల్స్‌లోని కాలిఫోర్నియా యూనివర్సిటీలో పాలస్తీనా అనుకూల ఆందోళనకారులు సోమవారం పోలీసులతో ఘర్షణ పడ్డారు. కాలేజీ కేంపస్‌లో మూడోసారి శిబిరాన్ని ఏర్పాటు చేసిన నేపథ్యంలో ఈ ఘర్షణలు చోటు చేసుకున్నాయి. యూనివర్సిటీలోని డిక్సన్ ప్లాజా పశ్చిమ ప్రాంతంలో ఆందోళనకారులు శిబిరాలు వేసి, బారికేడ్లు ఏర్పాటు చేశారని విద్యార్థుల పత్రిక డైలీ బ్రూయిన్ పేర్కొంది. ఇజ్రాయిల్ దాడుల్లో మరణించిన పాలస్తీనియన్లకు ప్రతీకగా రక్తమోడుతున్న శరీరపు భాగాల బొమ్మలను పట్టుకుని ఆందోళనకారులు ప్రదర్శన నిర్వహించారు. "మన అమరులను గౌరవిద్దాం" అని వారు నినదించారు. ఇప్పటివరకు 46వేల మందికి పైగా పాలస్తీనియన్లు ఈ మారణహోమంలో మరణించారని ఈ నిరసన ప్రదర్శన నిర్వాహక సంస్థ స్టూడెంట్స్ ఫర్ జస్టిస్ ఇన్ పాలస్తీనా తెలిపింది. ఈ నిరసనలకు చేతులు కలపాల్సిందిగా ప్రజలను కోరింది. ఈ నేపథ్యంలో ఆ ప్రాంతమంతా అలర్ట్ ప్రకటించారు. వెంటనే అక్కడ నుండి వెళ్ళిపోవాల్సిందిగా ఆందోళనకారులను పలుసార్లు ఆదేశించారు. పోలీసు అధికారులు, నిరసనకారుల మధ్య అనేకసార్లు ఘర్షణలు చోటు చేసుకున్నాయి. రాత్రయిన తర్వాత, వందలాదిమంది పాలస్తీనా అనుకూల ఆందోళనకారులు దాడ్ హాల్ వెలుపల నిలుచుని నినాదాలు చేశారు. పదుల సంఖ్యలో ఆందోళనకారులను పోలీసులు అరెస్టు చేశారు.

కౌన్ బనేగా ఉప సభాపతి

- బరిలో నిలవాలని ప్రతిపక్షాల నిర్ణయం
- ఈసారైనా ఆపోస్టును భర్తీ చేస్తారా ?



న్యూఢిల్లీ : లోక్‌సభ ఉప సభాపతి పదవికి పోటీ చేయాలని ప్రతిపక్ష పార్టీలు నిర్ణయించాయి. గత లోక్‌సభలో డిప్యూటీ స్పీకర్ పదవిని భర్తీ చేయకుండా ఖాళీగానే ఉంచారు. 18వ లోక్‌సభ తొలి సమావేశాలు జూన్ మొదటి వారంలో ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నాయి. ఈ సమావేశాల్లో సభ్యుల ప్రమాణస్వీకారం, స్పీకర్ ఎన్నిక ఉంటాయి. ఈ సభకైనా డిప్యూటీ స్పీకర్ ఉంటారా లేదా అన్నది ప్రశ్నార్థకంగానే ఉంది. నూతన లోక్‌సభలో ఇండియా బ్లాక్‌కు 234 మంది సభ్యులు ఉన్నారు. అధికార పక్షానికి సభాపతి పదవి, ప్రతిపక్షానికి ఉప సభాపతి పదవి ఇవ్వడం ఆనవాయితీగా వస్తోంది. అయితే డిప్యూటీ స్పీకర్ పదవిని ప్రతిపక్షాలకు ఇవ్వాలా వద్దా అనేది పాలక పక్షం నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది.17వ లోక్‌సభ సమావేశాలు అసాధారణ రీతిలో డిప్యూటీ స్పీకర్ లేకుండానే ముగిశాయి. స్పీకర్ ఎన్నిక ముగిసిన వెంటనే డిప్యూటీ స్పీకర్‌ను ఎన్నుకోవాలని రాజ్యాంగం చెబుతోందని లోక్‌సభ మాజీ సెక్రటరీ జనరల్ ఆచారి తెలిపారు. డిప్యూటీ స్పీకర్ పదవి రాజ్యాంగబద్ధమైన పదవి అని, పార్లమెంటరీ వ్యవస్థలో ఉప సభాపతికి రాజ్యాంగం ముఖ్యమైన స్థానాన్ని కల్పించిందని ఆయన చెప్పారు. ఆ పదవికి ఎవరినీ నియమించకపోవడం రాజ్యాంగ విరుద్ధమని అన్నారు.'సాధ్యమైనంత త్వరగా స్పీకర్, డిప్యూటీ స్పీకర్‌లను లోక్‌సభ విధిగా ఎన్నుకోవాల్సి ఉంటుంది' అని రాజ్యాంగంలోని ఆర్టికల్ 93 నిర్దేశిస్తోంది. 'డిప్యూటీ స్పీకర్ పోస్టు రాజ్యాంగ పదవి. అది ప్రతిపక్షానికి చెందుతుంది. తమకు ఆ పదవిని ఇవ్వాలని నూతన లోక్‌సభలో ప్రతిపక్షాలు కోరవచ్చు. అది సభ్యులు ఎన్నుకునే పోస్టు. ముందుగా స్పీకర్‌ను ఎన్నుకోవాలి. వారం రోజుల వ్యవధిలో డిప్యూటీ స్పీకర్‌ను ఎన్నుకోవాలి. ఇది పద్ధతి' అని ఆచారి తెలిపారు. కాగా గతంలో తాము ఉప సభాపతి స్థానాన్ని నిర్వహించామని, ఇప్పుడు కూడా ఆ పదవికి పోటీ చేస్తామని ప్రతిపక్ష నేత ఒకరు చెప్పారు. '2004-2014 మధ్యకాలంలో యూపీఏ అధికారంలో ఉన్నప్పుడు డిప్యూటీ స్పీకర్ పదవిని ప్రతిపక్ష ఎన్డీఏకు ఇచ్చాము. గతంలో అనేక ప్రభుత్వాలు డిప్యూటీ స్పీకర్ పదవిని ఏకాభిప్రాయంతో ప్రతిపక్షాలకే ఇచ్చాయి' అని ఆయన గుర్తు చేశారు. 1956లో తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ప్రతిపక్ష అకాలీదళ్ ఎంపీ సర్దార్ హుకుమ్ సింగ్‌ను డిప్యూటీ స్పీకర్ పదవికి ప్రతిపాదించారు. ఆ తర్వాత వచ్చిన అనేక ప్రభుత్వాలు ఈ సంప్రదాయాన్నే అనుసరించాయి. స్పీకర్ లేనప్పుడు ఆ స్థానంలో డిప్యూటీ స్పీకర్ కూర్చుని సభను నడిపిస్తారు. ఆ సమయంలో స్పీకర్‌కు ఎన్ని అధికారాలు ఉంటాయో డిప్యూటీ స్పీకర్‌కు కూడా అవే అధికారాలు ఉంటాయని నిబంధనలు చెబుతున్నాయి.

విధుల్లో రాణించాలి

సీఎంను కలిసిన ట్రైనీ ఐఏఎస్‌లు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్
మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో శిక్షణ పొందుతున్న ట్రైనీ ఐఏఎస్‌లు మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. విధుల్లో రాణించాలని ఈ సందర్భంగా సీఎం వారికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను కలిశారు. ట్రైనింగ్‌లో వారికి కేటాయించిన జిల్లాలు, గత ఎన్నికల్లో వారు నిర్వహించిన విధుల గురించి డిప్యూటీ సీఎంకు స్పెషల్ చీఫ్ సెక్రటరీ డాక్టర్ శశాంక్ గోయల్ ఈ సందర్భంగా వివరించారు. ప్రజలకు సేవ చేసేందుకు వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని వారి హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించుకోవాలని వారికి ఆయన సూచించారు. శిక్షణ కాలంలో తెలుసుకున్న అంశాలు పరిపాలనలో ఎంతగానో ఉపయోగ పడుతాయని అన్నారు. భౌగోళిక, వాతావరణ విషయంలో తెలంగాణ రాష్ట్రం బాగుంటుందనీ, ప్రజల నుంచి కూడా అదే స్థాయిలో సహకారం లభిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం సెక్రెటరీ కృష్ణ భాస్కర్, ఐఏఎస్ కోర్సు డైరెక్టర్ డాక్టర్ ఉషారాణి, నోడల్ అధికారి డాక్టర్ శ్రీనివాస్ పెద్ద బోయిన తదితరులు ఉన్నారు.

నవతెలంగాణ

అలవాటు అనే దాన్ని అరికట్టకపోతే, అది అతి త్వరలోనే ఒక అవసరంగా మారిపోతుంది - సెయింట్ అగస్టన్

సంపాదకీయం

స్కాములతో పాలన షురూ..

మోడీ 3.0 సర్కారు ప్రమాణ స్వీకారానికి ముందే విచ్చుకున్న స్కాముల్లో 'నీట్'గా జరిగిన ఈ స్కామొకటి. 23 లక్షల మంది విద్యార్థుల జీవితాలతో కొత్తగా కొలువు తీరిన ఎన్డీయే ప్రభుత్వం చెలగాటమాడుతోంది. నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ (ఎన్ఈఈటీ - నీట్)లో జరిగిన భారీ అవకతవకలు లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును ఆందోళనకరంగా మర్చాయి. వివిధ కోర్టుల్లో పెద్దఎత్తున దాఖలయిన పిటిషన్లు ఈ సమస్య తీవ్రతకు అద్దం పడుతున్నాయి.

ఎన్‌టీఏ అవకతవకలకు పాల్పడిందని చెప్పడానికి మరో బలమైన కారణం ఉంది. అదే ఫలితాల ప్రకటన. వాస్తవానికి నీట్ పరీక్షా ఫలితాలు జూన్ 14న ప్రకటించాలి. కానీ అంతకంటే 10 రోజుల ముందే జూన్ 4న ముందస్తుగా ఎలాంటి సమాచారం లేకుండానే ప్రకటించేశారు. ఎన్నికల ఫలితాల హడావుడిలో ఈ నీట్ అవకతవకలపై ఎవరూ దృష్టిపెట్టరనుకున్నారేమో! కానీ ఇదే పలు అనుమానాలకు తావిచ్చిందని మేధావులు అంటున్నారు. ఈ విషయంలో విద్యార్థులు, కోచింగ్ ఇన్‌స్టిట్యూట్‌లు కూడా తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి.

నీట్ వంటి ప్రవేశ పరీక్షల కోసం లక్షలాది మంది కష్టపడి సిద్ధమవుతుంటారు. తమ జీవితంలోని అత్యంత విలువైన క్షణాలను దీని కోసం వెచ్చిస్తారు. కానీ ఈ పరీక్షల్లో ఏటా పేపర్‌లీక్‌లు, ఫలితాల్లో అక్రమాలు పరిపాటిగా మారిపోయాయి. ఫలితంగా లక్షల మంది భవిష్యత్ ప్రశ్నార్థకంగా మిగిలిపోతోంది. అయినా వీటి పట్ల ప్రభుత్వానికి చీమ కుట్టినట్టయినా లేదు. ఒకవైపు గుజరాత్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులు పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించేలా చేస్తామంటూ కొంత మంది దగ్గర డబ్బు తీసుకున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. జూన్ 4న నీట్ ఫలితాలు విడుదలైంది మొదలు పరీక్ష నిర్వహణ సక్రమంగా లేదంటూ అనేక వాదనలు వస్తూనే ఉన్నాయి. విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాలు, మేధావులు వీటిపై ఆవేదన చెందుతూనే ఉన్నారు. అయితే నీట్ పరీక్ష నిర్వహించే 'నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ)' మాత్రం పరీక్ష నిర్వహణలో అవకతవకలు జరిగాయన్న వాదనలను తోసిపుచ్చుతోంది.

నీట్‌లో మొదటి ర్యాంకు సాధించిన 67 మందిలో ఆరుగురు విద్యార్థులు హరియాణాలోని జఝూర్‌లోని ఒకే పరీక్షా కేంద్రంలో పరీక్ష రాశారు. ఆ తర్వాతి రెండు ర్యాంకులు కూడా అదే కేంద్రంలో పరీక్ష రాసిన విద్యార్థులకే వచ్చాయి. ఎన్‌టీఏ వాదనే నిజమైతే ఇది ఎలా సాధ్యమని నిపుణులు ప్రశ్నిస్తున్నారు. పైగా ఎన్ని ప్రశ్నలకు, ఎన్ని



మార్కులనే లెక్కలకు అంతుచిక్కని రీతిలో కొందరు విద్యార్థులు స్కోర్ సాధించారు. దీనికి ఎన్‌టీఏ వద్ద సరైన సమాధానం లేదు. నిజానికి ప్రతి ఏడాది మొదటి ర్యాంకులు ఇద్దరు ముగ్గురు సాధించడమే చాలా కష్టం. అలాంటిది ఈ ఏడాది ఏకంగా 67 మందికి మొదటి ర్యాంకులు ఎలా వచ్చాయో ఎన్‌టీఏకే తెలియాలి? ఇంతమంది టాప్ స్కోర్ సాధించడం ఇదే మొదటిసారి. 2023లో ఇద్దరికి మాత్రమే 720/720 మార్కులు వచ్చాయి. ఇక 2022లో ఒక్కరు కూడా పూర్తి మార్కులు సాధించలేదు. ఆ ఏడాది టాపర్లు 720 మార్కులకి గానూ 715 మాత్రమే సాధించగలిగారు. అదేంటో ఈ ఏడాది మాత్రం కొందరికి 718, 719 మార్కులు వచ్చేశాయి. నిపుణులేమో ఇది అసాధ్యమని తేల్చి చెబుతున్నారు.

ఎన్‌టీఏ అవకతవకలకు పాల్పడిందని చెప్పడానికి మరో బలమైన కారణం ఉంది. అదే ఫలితాల ప్రకటన. వాస్తవానికి నీట్ పరీక్షా ఫలితాలు జూన్ 14న ప్రకటించాలి. కానీ అంతకంటే 10 రోజుల ముందే జూన్ 4న ముందస్తుగా ఎలాంటి సమాచారం లేకుండానే ప్రకటించేశారు. ఎన్నికల ఫలితాల హడావుడిలో ఈ నీట్ అవకతవకలపై ఎవరూ దృష్టిపెట్టరనుకున్నారేమో! కానీ ఇదే పలు అనుమానాలకు తావిచ్చిందని మేధావులు అంటున్నారు. ఈ విషయంలో విద్యార్థులు, కోచింగ్ ఇన్‌స్టిట్యూట్‌లు కూడా తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి.

వీటితో పాటు పేపర్ లీక్ ఆరోపణలు కూడా పెద్ద ఎత్తున వస్తున్నాయి. ఇప్పటికే బీహార్‌లో ఇదే విషయమై ఎఫ్ఐఆర్ నమోదు చేసి 13 మందిని అరెస్టు చేశారు. ఈ కేసును దర్యాప్తు చేసేందుకు బీహార్ పోలీసు శాఖ ఆర్థిక నేరాల విభాగం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసింది. అదనపు మార్కుల కేటాయింపు కూడా పారదర్శకంగా జరగలేదని కొందరు భావిస్తున్నారు. ఇంత జరుగుతున్నా ఎన్‌టీఏ మాత్రం అవకతవకలు, పేపర్ లీక్ వంటివేవీ జరగలేదంటూ పదే పదే పాచి పాటే పాడుతోంది. మరోపక్క అధికారంలో ఉన్న ఎన్డీయే ప్రభుత్వం దీనిపై కనీసం నోరు మెదపడం లేదు. అందువల్ల ఈ అవకతవకల వెనక ఉన్నదెవరో తెలుసుకోవడం అంత కష్టమేమీ కాదు. ఇన్ని అవకతవకలు జరిగిన నీట్ పరీక్షలు రద్దు చేయమంటూ విద్యార్థులు పెద్ద సంఖ్యలో సుప్రీంకోర్టు తలపు తట్టారు. న్యాయం చేయాల్సిన సుప్రీం కోర్టు 'కౌన్సెలింగ్ ప్రారంభించండి, మేము కౌన్సెలింగ్‌ను ఆపడం లేదు' అంటూ ప్రకటించింది. ఇప్పుడు విద్యార్థుల వేదన అరణ్యరోదనగా మారిపోయింది.


అంతిమంగా నీట్ పరీక్ష నిర్వహించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమయిందనేది స్పష్టం. ఇప్పుడు లక్షలాదిమంది విద్యార్థుల భవిత గందరగోళంలో పడింది. తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడకుండా నీట్ అవకతవకలపై కేంద్రం వెంటనే స్పందించాలి. దీనిపై సమగ్ర విచారణ జరిపి విద్యార్థులకు న్యాయం చేయాలి. ఇప్పటికైనా ఎన్‌టీఏ చేస్తున్న అవకతవకలను నియంత్రించి, మరింత విశ్వసనీయమైన, సురక్షితమైన పరీక్షా విధానాన్ని రూపొందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.

నేను సర్కారు బడిని..!

నా గురించి మాట్లాడుకునే యాళ్లయింది. నేనెవరనుకుంటున్నారా? ఇయ్యాల్టి నుంచి బళ్లు షురూ అయితున్నయి కదా! అదే నేను సర్కారు బడిని. ఏనుకట అందరూ నా దగ్గరకి వచ్చి బాగా సదువుకుందురు. నాకాడ సదువుకున్నోళ్లందరూ మంచిగా ఎదిగిన్రు. వాళ్లను సూసినప్పుడు నాకు మస్తు కుషిగా అనిపిస్తది. గానీ గిప్పుడు ప్రయివేటు స్కూల్ అని, టెక్నో స్కూల్ అని, ఇంటర్నేషనల్ స్కూల్‌ల వెనుక తిరుగుతూ నన్ను సరిగా పట్టించుకుంటలేరు. ఏం చేయాలో నాకైతే అర్థమయితలేదు.

ఇగ నాకు పోటీగా సర్కారోళ్లు గురుకులాలను, మోడల్ స్కూళ్లను, కేజీబీవీలను పెట్టిన్రు.నాకైతే పిల్లలు అందరూ నాదగ్గరే సదువుకుంటే మస్తుగా అనిపిస్తది.మా బడికి వచ్చే సార్లను,మేడంలను ఏమైంది? మన బడికి ఎక్కువ మంది పిల్లలు అత్తలేరు అంటే మన దగ్గరే అన్ని సౌల తులు ఉన్నయి కానీ ఈ జనాలకు అర్థం అయితలే. అందరూ ప్రయివేటు బడులెంట ఉరుకుతున్నరు, గట్ల ఉరికి ఉరికి ఆగమై, పైసలు పోగొట్టుకుంట్రు అంటున్నరు.

మా బడికి మీ పిల్లల్ని ఎందుకు పంపుతలేరని పొరగాండ్ల అయ్యా, అవ్వలను అడిగితే ప్రయివేటు బల్లె



పట్టించుకున్నట్టు మీ సర్కారు బల్లే పిల్లల్ని పట్టించుకోరు, మీ బడికి పొరగండ్లను పంపితే ఆగం అయితరు, అయినా సర్కార్ బల్లె ఇంగ్లీష్ మీడియం లేక పంప బుద్ధి అయితలే అనబట్టిరి. అరే గిదేం కిరికిరి? మా బల్లె పట్టించుకున్నట్టు ఎక్కడన్నా పట్టించుకుంటరా మా సార్లు, మేడంలు బాగా చదువుకున్నోళ్లు మంచిగా పాఠాలు చెప్తరు. మా బల్లె ఆటలు పాటలు అన్ని ఉంటయి, ఇగ ఇంగ్లీష్ మీడియం ఎలాగు ఉండనే ఉండే.పొరగాండ్లందరికి ఫ్రీగా బుక్స్ ఇత్తం, యూనిఫామ్స్ కూడా ఇయ్యవడితిమి, పగటిలీ మంచిగా బువ్వ పెడతాం. ఇంకేం కావాలి. అందరినీ మా బడికి పంపుమని చెప్పనయితే చెప్పిన. చూడాలి మరి ఈసారన్నా పంపిస్తారో లేక ప్రయివేటుకే పంపుతరో?

మా పెద్ద సార్‌తో ఈసారి ఎట్లనన్న చేసి మన బడికి ఫుల్‌గా పిల్లలు ఆచ్చేటట్లు చేయాలె సర్ అంటే, 'ఏం జేసుడో ఏమో, బల్లె ఊడ్చేటోళ్లు, గంట కొట్టేటోళ్లు లేరు. అన్ని సబ్జెక్టులకు సార్లు లేరు. ఎల్లదీసుడే ఉన్నది. ఇదివరకటి గవర్నమెంట్ కరెంట్ బిల్లు కట్టడానికి, చాక్పీస్, డస్టర్లకు కూడా సరిగా పైసలు ఇయ్యకపాయే. జేబులకెళ్లి పెట్టుకుంటి. ఎట్ల జేశుడో ఏమో' అనబట్టే.ఇప్పుడున్న సర్కారోల్లు జర మా పెద్ద సారుకు టెన్షన్ లేకుండా బడి మంచిగా నడిపేటట్లు చెయ్రి.

ఏ మాటకామాట చెప్పుకోవాలి. ఎనుకటికంటే ఇప్పుడు సర్కారు బళ్లల్లో సౌలతులు మంచిగా అయినయి. లైబ్రరీ,సైన్స్ ల్యాబ్, కంప్యూటర్ ల్యాబ్,అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు అన్ని పెట్టిన్రు.జనాలు కూడా జర సోచయించాలే. గివన్ని ప్రయివేటులో ఉంటాయా? జర మీరే చెప్పుండ్రి.పుక్కిడి వస్తే జనాలకు నచ్చడం లేదోమో మరి. మంచిగా మా బడికి పంపక ఇదెందో ఏమో.

పంతుళ్లతో మాట్లాడితే 'ఈ నౌకరీ జేయబట్టి ఇరువై ఏండ్లు అయితుంది ఓ ప్రమోషన్ లేదు ఏం లేదు అయినా ఇదే బల్లె పదేండ్లుగా పనిచేస్తున్న ట్రాన్స్ఫర్ కూడా లేదు ఏం నౌకరో ఏమో అనబట్టిరి.' ఇప్పటికన్నా ఇంకా మంచిగా మావోల్లు పనిచేస్తరు, మంచి రిజల్ట్స్ తెస్తరు అందులో డౌటనుమానం లేదు.ఈ సారి కూడా మన బడిలో టెన్త్ క్లాస్ ఓల్లు అందరూ పాస్ అయిండ్రు.10 జీపీఏ లు కూడా వచ్చినయి. బాసర ట్రిబుల్ ఐటీలో సీట్లు వస్తయని పోరగాండ్లు ఫుల్ ఖుషీగా ఉన్నరు.

అంతట్లకే మా ఎంఈఓ సర్ వచ్చే. 'ఈ బడి బాటేందో నా సావుకొచ్చింది. ఒక్కొన్ని ఎనిమిది మండలాలు తిరుగాలే. ఏం తిరుగుడో ఏమో, ఎప్పుడు ఎక్కడ ఉంటానో, ఏం చేస్తానో నాకే సమజైత లేదు. ఏ బడిలో ఏముందో? ఏం లేదో కూడా నాకు తెలుస్తలేదు.అటు నా బడి సూసోకోవాలి, ఇటు ఎనిమిది మండలాలకు నేనే ఇన్‌చార్జినట. ఎట్ల జెసుడో ఏమో, ఈ టెన్షన్ కె నాకు బీపీ, షుగర్ వచ్చినయి. అయినా కూడా గోళీలు మింగుకుంటూ తిరుగుతున్న' అనబట్టే.

ఇవన్నీ విన్నంక నాకు అర్థమైంది మా స్కూల్‌కి పిల్లలెందుకు అత్త లేరో. ఇదివరకటి సర్కారు పట్టించుకోలే, ఇప్పుడున్న సర్కారైన పట్టించుకోని బల్లు మంచిగా నడుపడానికి పైసలు, ఊడ్చేటోల్లను, గంటకొట్టెటోల్లను ఇచ్చి,సరిపోయేంత టీచర్లు ఉండేటట్లు చేయాలే.మా సార్లకు, మేడంలకు జర పదోన్నతులు ఇచ్చుడు, బదిలీలు చేసుడు సురువుజెయ్యాలే. పాపం గా ఏంఈఓ సార్లు ఎన్నని తిరుగుతరు? ఎక్కడోల్లకు అక్కడ ఇయ్యలే స్కూల్‌లను, సార్లను సూసుకోవడం.అందరం మనిషికో చేయ్యేస్తే ఏదైనా చేయచ్చు. అందరం గట్టిగా అనుకుంటే గవర్నమెంట్ స్కూల్‌లు మంచిగా నడుస్తయి. సర్కారీ బడి మంచిగా నడిస్తేనే బీద బిక్కి అందరూ బాగా సదువుకుంటరు.

నేను అందరికీ చేతులెత్తి మొక్కుతున్న. మీరందరూ పిల్లలను సర్కారు బడికి పంపుర్రి.సర్కారోల్లు ఫ్రీ బస్ పెడితే ఉరికి ఉరికి ఎక్కుతుండ్రు కదా! మరి ఫ్రీ స్కూల్ అంటే ఎందుకు ఏనుక ముందు ఆడుతుండ్రు.ఇదివరకు మూతబడ్డ బల్లను కూడా సర్కారోళ్ళు ఇప్పుడు మళ్ళీ నడుపుతరట.అన్నింటికీ దగ్గరగా ఉండే మన బల్లెనే మన పిల్లలను చేర్పిద్దాం. మన బడిని బతికించుకుందాం. వింటున్నరా? అన్ని ముచ్చట్లు అయితే ఇగ చెప్పిన. ఇక మీ ఇష్టం. ఉంట మల్ల.

- పాకాల శంకర్ గౌడ్,
9848377734.

ఐరోపా పార్లమెంటు ఎన్నికలు:పెరిగిన నాజీ,ఫాసిస్టుల ముప్పు!



ఎం కోటేశ్వరరావు
8331013288

ఐరోపా యూనియన్‌లోని 27దేశాలలో జూన్ ఆరు నుంచి తొమ్మిదవ తేదీవరకు జరిగిన యూనియన్ పదవ పార్లమెంటు ఎన్నికల ఫలితాల్లో ఆందోళనకర సూచనలు వెలువడ్డాయి. అధికారికంగా ఫలితాల పూర్తి ప్రకటన వెలువడ లేదు, నాలుగు దేశాల్లో లెక్కింపు కొనసాగుతోంది. మంగళవారం సాయంత్రానికి అందిన సమాచారం, ఫలితాల తీరుతెన్నుల ప్రకారం నయా నాజీ, ఫాసిస్టు, పచ్చి మితవాద శక్తులు బలం పుంజుకున్నాయి. ఈ పరిణామం ఐరోపా విధానాలనే తీవ్రంగా ప్రభావితం చేసేదిగా ఉంది. వివిధ దేశాలలో పాలక పార్టీలు, కూటములకు ఎదురుదెబ్బలు తగిలాయి.ఐరోపా సమాఖ్య వైఖరిలో వచ్చే మార్పులు, చేర్పుల గురించి చర్చ ప్రారంభమైంది. ఐరోపా సమాఖ్యకు ఒక స్తంభం వంటి ఫ్రాన్సు మీద పిడుగులా పడి ఇంకా రెండేండ్ల గడువు ఉన్న పార్లమెంటు రద్దుకు దారితీసింది.పాలకపక్షం ఘోరంగా దెబ్బతినటంలో పార్లమెంటును రద్దుచేసి తిరిగి ఎన్నికలు జరపనున్నట్లు అధ్యక్షుడు ఇమ్మాన్యుయెల్ మక్రాన్ వెంటనే ప్రకటించాడు. అక్కడి రాజ్యాంగం ప్రకారం పార్లమెంటులో ప్రతిపక్షాలకు మెజారిటీ ఉన్నా, ప్రధాని, మంత్రులు వేరే పార్టీకి చెందినవారైనా, అధ్యక్షుడికే సర్వాధికారాలు ఉంటాయి. 2027లో జరిగే అధ్యక్ష ఎన్నికలలో మక్రాన్ పోటీ చేసేందుకు నిబంధనలు అంగీకరించవు. జర్మనీ ప్రతిపక్షం మధ్యంతర ఎన్నికలకు డిమాండ్ చేసింది.అధికార ప్రతిపక్ష సంకీర్ణ కూటమికి ఎదురుదెబ్బ తగిలినా ఎన్నికలకు వెళ్లేది లేదని ప్రకటించింది.

పార్లమెంటులోని మొత్తం 720స్థానాలకు ఎన్నికలు జరిగాయి. మెజారిటీ 361 సాధించిన కూటమి ఎంచుకున్న నేత ఐరోపా కమిషన్ అధ్యక్ష పదవిని అధిష్టిస్తారు. కమిషన్ విధానాలను ఐరోపా పార్లమెంటు రూపొందిస్తుంది. ప్రతి దేశానికి జనాభా ప్రాతిపదికన సీట్లు కేటాయిస్తారు. గత ఎన్నికల్లో 751 స్థానాలుండగా 27 సీట్లున్న బ్రిటన్ ఐరోపా సమాఖ్య నుంచి వైదొలిగినందున వాటిని ఇతర దేశాలకు కేటాయించినప్పటికీ తరువాత వాటికి ఉపఎన్నికలు జరగలేదు. తరువాత 46 స్థానాలను రద్దు చేశారు. తాజా ఎన్నికలకు ముందు ఆమోదించిన విధానం ప్రకారం 705 నుంచి 720కి స్థానాలను పెంచారు. జర్మనీలో 96,ఫ్రాన్స్81, ఇటలీ 76 స్థానాలతో అగ్రభాగాన ఉన్నాయి. మాల్టా, సైప్రస్, లక్సెంబర్గ్ దేశాలలో తక్కువగా ఆరేసి స్థానాల చొప్పున ఉన్నాయి. ఏ దేశానికి ఆదేశం ఎంచుకున్న పద్ధతిలో ఎన్నికలు జరుగుతాయి. పార్లమెంటులో ఒక పక్షాన్ని గుర్తించాలంటే ఏడు దేశాలలో పోటీచేసి కనీసం 23 స్థానాలను తెచ్చుకోవాల్సి ఉంది. ఆ నిబంధనకు అనుగుణంగా లేని వాటిని గుర్తింపులేని పార్టీలుగా పరిగణిస్తారు. ఈ ఎన్నికల్లో కేవలం 51శాతం మాత్రమే ఓటర్లు పాల్గొన్నట్లు తొలి వార్తలు తెలిపాయి. గరిష్టంగా బెల్జియంలో 89.2, లక్సెంబర్గ్‌లో 82.3శాతం పోలు కాగా క్రోషియాలో అత్యల్పంగా కేవలం 21.3శాతమే ఓటర్లు పాల్గొని ఒక రికార్డు సృష్టించారు. కొన్ని దేశాలలో ఈ సందర్భంగానే స్థానిక సంస్థల ఎన్నికలు కూడా నిర్వహించారు.

ఈ ఎన్నికలలో ప్రస్తుతం సమాఖ్య అధ్యక్షురాలిగా ఉన్న ఉర్సులా వాండరె లెయన్ నాయకత్వంలోని యూరోపియన్ పీపుల్స్ పార్టీ(ఇపిపి) 191సీట్లతో పెద్దపక్షంగా అవతరించింది. పచ్చి మితవాదులను అధికారంలోకి రాకుండా నిరోధించగలమని ఆమె చెప్పింది. మరోసారి ఆమె సమాఖ్య అధ్యక్ష స్థానం కోసం పోటీలో ఉన్నారు. ఐరోపా రాజకీయ పరిభాషలో ఇపిపిని మధ్యేవాద మితవాద పార్టీగా పరిగణిస్తారు. ఫ్రాన్సులో మేరీనె లీపెన్ నాయకత్వంలోని పచ్చి మితవాద ఐడెంటిటీ (ఉనికి)- డెమోక్రసీ (ప్రజాస్వామ్య) పార్టీ(ఐడి)కి 57 వచ్చాయి. ఇటలీ ప్రధాని జియోర్జియా మెలోనీ నాయకత్వంలోని యూరోపియన్ కన్సర్వేటివ్, రిఫార్మిస్టు (ఇసిఆర్) పార్టీకి 71 వచ్చాయి. ఈ మూడు పక్షాలూ గతం కంటే ఎక్కువ సీట్లు తెచ్చుకున్నాయి. సోషలిస్టు, డెమోక్రాట్స్ కూటమి (ఎస్‌డి) రెండవ పెద్ద పక్షంగా 135 సీట్లు తెచ్చుకుంది. గుర్తింపు పొందని చిన్న పక్షాలు 95 గెలుచుకున్నాయి. గ్రీన్స్ పార్టీ 53, రెన్యూ (పునరుద్ధరణ) యూరోప్ (ఆర్ఇ) 83, ఐరోపా వామపక్ష పార్టీ 35 సీట్లు తెచ్చుకుంది. గత ఎన్నికల్లో ఐరోపా కమిషన్ అధ్యక్షురాలిగా ఉర్సులా వాండెర్ లెయాన్ అభ్యర్థిత్వాన్ని సమర్థించి గెలిపించిన పార్టీలు తాజా ఎన్నికల్లో 720కి గాను 402 స్థానాలను తెచ్చుకున్నట్లు వెల్లడైంది. అందువలన ఆమె తిరిగి మరోసారి అదే పదవిలో కొనసాగవచ్చు. ఆమె గనుక పచ్చిమితవాద పార్టీల మద్దతుకోసం ప్రయత్నిస్తే తాము దూరంగా ఉంటామని, ఉదారవాద, మితవాద పార్టీల ప్రతినిధులు హెచ్చరించారు. ఆమె బలహీన పడిన గ్రీన్స్, ఇటలీ మితవాది మెలోనీ పార్టీ మద్దతు కోరవచ్చని కొందరు విశ్లేషకులు జోస్యం చెప్పారు.హంగరీలో జాతీయ వాద నేత విక్టర్ ఒర్బాన్ పార్టీ బలం తగ్గినా 44శాతం తెచ్చుకుంది.ఇటలీలో మితవాద ప్రధాని మెలోనీ పార్టీ 30శాతం తెచ్చుకుంది.

ఫ్రెంచి పార్లమెంటును ఆకస్మికంగా రద్దు చేయటంతో ఫ్రాన్స్‌లో సంకీర్ణ రాజకీయాలకు తెరలేచింది. ఈనెల 30,జూలై ఏడున ఎన్నికలు జరగనున్నాయి. పదహారవ తేదీలోగా అభ్యర్థుల ప్రకటన జరుగుతుంది. అధ్యక్షుడు మక్రాన్ ప్రకటన వెలువడిన వెంటనే ఐడి పార్టీ నాయకురాలు మేరీనే లీపెన్ దేశ పౌరులు ఈ ఎన్నికల్లో కూడా తనకు మద్దతు ఇవ్వాలని కోరారు.ఐరోపా పార్లమెంటు ఎన్నికల్లో ఆమె పార్టీ 31.5శాతం ఓట్లతో ప్రథమ స్థానంలో ఉంది. గతంలో నేషనల్ ఫ్రంట్ పేరుతో పార్టీని ఏర్పాటు చేసిన జీన్ మారీ లీపెన్ కుమార్తె మేరీనే కాగా మనుమరాలు మరియో మార్చెల్ ఆమెతో వేరుపడి రికగ్నిట్ పేరుతో మరో పచ్చిమితవాద పార్టీని ఏర్పాటు చేసింది. ఎన్నికల సమయంలో మేనత్త మీద ఎలాంటి విమర్శలూ చేయలేదు, మితవాదులందరూ కలవాల్సిన అవసరం గతం కంటే నేడు ఎక్కువగా ఉందంటూ ఎన్నికల ఫలితాల తరువాత మరియో వ్యాఖ్యానించింది. వ్యతిరేకులు, పోటీదార్లకు తేడా ఉంది అన్నారు.అయితే ఇప్పటికే మార్చెల్‌తో మేరీ లీపెన్ ప్రతినిధి జోర్డాన్ బార్‌డెలా సంప్రదింపులు జరిపినట్లు వార్తలు వచ్చాయి. మక్రాన్ నాయకత్వాన్ని వ్యతిరేకించే మితవాద పార్టీలు మేరీ లీపెన్, మార్చెల్‌తో కలిసే అవకాశాలు ఉన్నాయి. వివిధ పార్టీలలో చీలికలు తెచ్చి తనవైపు తిప్పుకొనేందుకు మక్రాన్ ఇప్పటికే ప్రయత్నాలు ప్రారంభించాడు. అతగాడి అధ్యక్ష పదవీకాలం 2027 వరకు ఉంది. పార్లమెంటులో ప్రతిపక్షాలకు మెజారిటీ ఉంటే ఇబ్బంది కనుక వాటిని అడ్డుకొనేందుకు సర్వశక్తులూ వడ్డాలని చూస్తున్నాడు. సోషలిస్టులు, గ్రీన్స్, మరికొన్ని వామపక్ష పార్టీలు కూడా కూటమిగా ఏర్పడేందుకు చూస్తున్నాయి. ఐరోపా యూనియన్ ఎన్నికలలో సోషలిస్టు పార్టీ(పిఎస్)కు 14శాతం ఓట్లు వచ్చాయి.కొన్ని సర్వేల ప్రకారం ప్రస్తుతం ఉన్న సీట్లలో మక్రాన్ నాయకత్వంలోని రినయసాన్స్ పార్టీ(ఆర్ఎన్) సగం స్థానాలను కోల్పోనున్నట్లు వెల్లడైంది.



ఫ్రెంచి పార్లమెంటును ఆకస్మికంగా రద్దు చేయటంతో ఫ్రాన్స్‌లో సంకీర్ణ రాజకీయాలకు తెరలేచింది. ఈనెల 30,జూలై ఏడున ఎన్నికలు జరగనున్నాయి. పదహారవ తేదీలోగా అభ్యర్థుల ప్రకటన జరుగుతుంది. అధ్యక్షుడు మక్రాన్ ప్రకటన వెలువడిన వెంటనే ఐడి పార్టీ నాయకురాలు మేరీనే లీపెన్ దేశ పౌరులు ఈ ఎన్నికల్లో కూడా తనకు మద్దతు ఇవ్వాలని కోరారు.ఐరోపా పార్లమెంటు ఎన్నికల్లో ఆమె పార్టీ 31.5శాతం ఓట్లతో ప్రథమ స్థానంలో ఉంది. గతంలో నేషనల్ ఫ్రంట్ పేరుతో పార్టీని ఏర్పాటు చేసిన జీన్ మారీ లీపెన్ కుమార్తె మేరీనే కాగా మనుమరాలు మరియో మార్చెల్ ఆమెతో వేరుపడి రికగ్నిట్ పేరుతో మరో పచ్చిమితవాద పార్టీని ఏర్పాటు చేసింది. ఎన్నికల సమయంలో మేనత్త మీద ఎలాంటి విమర్శలూ చేయలేదు, మితవాదులందరూ కలవాల్సిన అవసరం గతం కంటే నేడు ఎక్కువగా ఉందంటూ ఎన్నికల ఫలితాల తరువాత మరియో వ్యాఖ్యానించింది.

జర్మనీలో పాలక కూటమిలోని సోషల్ డెమోక్రటిక్ పార్టీ(ఎస్‌పిడి) 13.9శాతం ఓట్లు తెచ్చుకొని మూడవ స్థానంలో ఉంది. పచ్చిమితవాద పార్టీ ఏఎఫ్‌డి 16శాతం తెచ్చుకొని చరిత్ర సృష్టించింది. ప్రతిపక్ష క్రిస్టియన్ డెమోక్రటిక్ యూనియన్-క్రిస్టియన్ సోషల్ యూనియన్ కూటమి 30శాతం తెచ్చుకొని ప్రథమ స్థానంలో ఉంది.తూర్పు జర్మనీ ప్రాంతంలో ఎఎఫ్‌డి అగ్రస్థానంలో ఉంది. సంకీర్ణ కూటమిలోని సోషల్ డెమోక్రాట్స్ (ఎస్‌పిడి), పర్యావరణ గ్రీన్స్,ఫ్రీ డెమోక్రాట్స్ పార్టీలు వరుసగా 13.9 -11.9-5.2శాతాల చొప్పున తెచ్చుకొని చావు దెబ్బతిన్నాయి.దీంతో వెంటనే ఎన్నికలు జరపాలని ప్రతిపక్షం డిమాండ్ చేసింది.నాలుగింట మూడు వంతుల మంది జనం కూటమి పాలన పట్ల అసంతృప్తితో ఉన్నారని ఎన్నికల సర్వేలు వెల్లడించాయి. జర్మన్ ఛాన్సలర్ ఒలాఫ్ షల్జ్ బెర్లిన్‌లో విలేకర్లతో మాట్లాడుతూ ఫలితాలు తమకు ప్రతికూలంగా వచ్చినందున మామూలుగా తమపని తాము చేసే అవకాశాలు ఉండకపోవచ్చని అన్నాడు. వచ్చే జాతీయ ఎన్నికల్లో ఓటర్ల అభిమానాన్ని చూరగొనేందుకు ప్రయత్నిస్తామన్నాడు. నూటముప్పై సంవత్సరాల చరిత్రలో ఇంత తక్కువగా ఎస్‌పిడి ఎన్నడూ ఓట్లు తెచ్చుకోలేదు. ప్రత్యామ్నాయ జర్మనీ (ఎఎఫ్‌డి) ఈ ఎన్నికలలో తెచ్చుకున్న ఓట్లతో సుస్థిరం కావటాన్ని అడ్డుకుంటామని, వెనక్కు కొడతామని అన్నాడు. జర్మనీలో, ఐరోపా అంతటా సంప్రదాయ ప్రజాస్వామిక పార్టీలు ఇప్పటికీ మెజారిటీగా ఉన్నాయని అన్నాడు. ప్రతిపక్షం కోరినట్లుగా మధ్యంతర ఎన్నికలకు వెళ్లే అవకాశం లేదని, గడువు ప్రకారమే జరుగుతాయని షల్జ్ ప్రతినిధి స్టెఫెన్, చెప్పాడు. జాతీయవాదం, విద్వేష ప్రమాదా లను జనం మరచిపోరాదని జర్మనీ అధ్యక్షుడు (మన రాష్ట్రపతి మాదిరి) ఫ్రాంక్ వాల్టర్ స్టెయిమెయిర్ హెచ్చరించాడు. రెండవ ప్రపంచ యుద్ధంలో నాజీల మారణకాండకు బలైనవారి గౌరవార్థం ఫ్రాన్సులో జరిగిన ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ ఐరోపా పార్లమెంటు ఎన్నికల్లో పచ్చిమితవాద పార్టీలు ఎదగటాన్ని ప్రస్తావించి జర్మనీలో నేషనల్ సోషలిస్టులు(హిట్లర్ నాజీ పార్టీ) సాగించిన అత్యాచారాలను గుర్తు చేశాడు.

ఉక్రెయిన్ సంక్షోభం, గాజాలో జరుగుతున్న పరిణామాలు,ఐరోపా అంతటా కొనసాగుతున్న ఆర్థిక సంక్షోభం వంటి అంశాలన్నింటి కారణంగా మరింత భద్రత కావాలని ఓటర్లు కోరుకున్నారని, దాని మీద పచ్చి మితవాదులు వాగ్దానం చేశారని, ఈ ఎన్నికలు జాతీయ నాయకుల మీద జరిగిన ప్రజాభిప్రాయ వెల్లడి అని ఐరోపా సమాఖ్య విదేశీ సంబంధాల డిప్యూటీ డైరెక్టర్ వెసెలా టెక్సర్‌నెవా అన్నారు.ఐరోపాలో ఫాసిస్టు, నాజీ, పచ్చి మితవాద శక్తులు పుంజుకోవటమే కాదు, తమ స్థానాన్ని సుస్థిరం చేసుకుంటున్న ధోరణి కనిపిస్తున్నది. అయితే ఈ ఎన్నికల్లో అనేకమంది ఊహించిన మాదిరి అవి ఎక్కువ బలాన్ని పెంచుకోలేదు. మూడోవంతు సీట్లు తెచ్చు కోవటం రానున్న ముప్పును వెల్లడిస్తున్నది.ఇప్పటివరకు అనేక కారణాలతో వివిధ దేశాల్లోని ఈ శక్తుల మధ్య ఐక్యత లేదు, అసంఘటితంగా కూడా ఉన్నాయి.ఎవరికి వారుగానే పని చేస్తున్నారు. మితవాదులు, పచ్చిమితవాదులకు స్వల్పతేడాలు మాత్రమే ఉన్నాయి. ఆర్థిక సంక్షోభం కొనసాగుతున్న పూర్వ రంగంలో పార్లమెంట్‌లో ఈ శక్తులు కలిస్తే పరిణామాలు ఎలా ఉండేదీ చెప్పలేము. ఒక వేళ అదే జరిగితే వాటిని వ్యతిరేకించే వారందరూ ఒక కూటమిగా ఏర్పడవచ్చు, వారితో వామపక్షాలు కూడా చేతులు కలిపే అవకాశం లేకపోలేదు.పచ్చిమితవాద శక్తులు బలం పుంజుకోవటం వలన పర్యావరణ,వలసలు, ఉక్రెయిన్‌కు సాయంతో సహా విదేశాంగ విధానంలో మార్పుల కోసం పట్టుపట్టవచ్చు, వేగంగా నిర్ణయాలు తీసుకోవటాన్ని అడ్డుకోవచ్చు.

పేదరికమే బాలకార్మికులకు శాపమా?



డా. చిటికెన కిరణ్ కుమార్
9490841284

ఒక దేశం అభివృద్ధి చెందాలంటే అన్ని రకాలుగా సంక్షేమంతో కూడిన కార్యక్రమాలతో పాటుగా ఆర్థిక, రాజకీయ, విద్య, వైద్య విభాగాలలో ఒక సమానమైన కోణం ప్రధానమైనది. ముఖ్యంగా బాల కార్మికుల వ్యవస్థ అనేక అంశాలపై ఆధారపడి ఉంది. ఇది తీవ్రమైన మానవ హక్కుల సమస్య. ఒకవైపు పేదరికం వెంటాడటం, మరోవైపు ఆర్థిక సమస్యలు దీనికి ప్రధాన కారణంగా చెప్పవచ్చు. బాల కార్మికుడు అన్న దానికి సార్వత్రికంగా ఆమోదించిన నిర్వచనం "బాల్యాన్ని నాశనం చేసే రీతిలో బాలుడు లేదా బాలిక పనిచేయడం". బాలల శారీరక, మానసిక అభివృద్ధికి ఆటంకమై వారికి కనీస అక్షరాస్యతను, వినోదాన్ని కూడా పొందే అవకాశాన్ని ఇవ్వని పనిని, స్థితిని బాలకార్మిక వ్యవస్థ అంటారు. పాఠశాలల్లో విద్య అభ్యసించే రోజులతో అక్షర జ్ఞానానికి నోచుకోకుండా భారమైన శ్రమకు బలైపోతున్న బాలల జీవితాలు మనం సాధించిన అభివృద్ధిని ప్రశ్నిస్తున్నాయి. ఇది అత్యంత బాధాకరమైన పరిస్థితి. ఒకరకంగా నాగరికతకే తలవంపుగా పరిణమించాయి. బాలకార్మిక వ్యవస్థ ఒక్క భారతదేశానికే పరిమితం కాలేదు. అభివృద్ధి చెందిన దేశాల్లో సైతం బాలకార్మికులు తారసపడక తప్పదు.

ప్రపంచ వ్యాప్తంగా 2000 నాటికి 24కోట్ల60లక్షల బాలకార్మికులు ఉంటే 2012 ముగిసేనాటికి 16కోట్ల 80లక్షల మంది ఉన్నారు. మొత్తం బాలబాలికల జనాభాలో 11 శాతం మంది బాలకార్మికులే. పేద దేశాల్లో ఇది ఎక్కువగా నమోదవుతున్నది. అయితే జనాభా పరంగా చూస్తే అత్యధిక శాతం అధిక జనాభా కలిగిన దేశాలలో గమనించవచ్చు. గత 12 ఏళ్లలో 7కోట్ల80లక్షల మంది బాల కార్మికులు తగ్గినట్టు గణాంకాలు చెబుతున్నాయి. అయినా 8కోట్ల 50 లక్షలు అంటే 5.4 శాతం మంది ఇంకా ప్రమాదకర పనుల్లో మగ్గుతున్నారు. వీరిలో అత్యధిక శాతం మంది ఆసియా, పసిఫిక్ ప్రాంతంలోనే ఉన్నారు. అందులో వ్యవసాయ రంగంలోనే అధికంగా 9కోట్ల 80 లక్షల మంది బాల కార్మికులున్నారు. అంటే మొత్తం బాలకార్మికుల్లో 59 శాతం వాటా వ్యవసాయరంగానిదే.

అయితే సేవల రంగం, పారిశ్రామిక రంగాలను విస్మరించరాదు. అసంఘటిత రంగంలోనూ బాల కార్మికులు పనిచేస్తున్నారు.

2001 జనాభా లెక్కల ప్రకారం మన దేశం మొత్తమ్మీద 5 నుంచి 14 ఏండ్ల లోపు వయసులో ఉన్న 1.26 కోట్ల మంది బాల బాలికలు ఆర్థిక కార్యకలాపాల్లో (బాలకార్మికులుగా) ఉన్నారు. వీరిలో 12 లక్షల మంది ప్రమాదకర వృత్తుల్లో పనిచేస్తున్నారు. 2004-05లో జాతీయ నమూనా సర్వే అంచనా ప్రకారం దేశంలో 89 లక్షల మంది బాల కార్మికులున్నారు. 2009-10లో 5-14 ఏళ్ల వయసున్న బాలకార్మికుల సంఖ్య 49.84 లక్షలు. యూనిసెఫ్ ప్రకారం దాదాపు సగం మంది, ప్రణాళికా సంఘం అంచనా ప్రకారం సుమారు 43 శాతం మంది బాలబాలికలు ఎనిమిదో తరగతి లోపే బడిమానేస్తున్నారు. షెడ్యూల్డ్ కులాల్లో ఇది 55 శాతం, షెడ్యూల్డ్ తెగల్లో 63 శాతం దాకా ఉందని సమాచారం. బడి మానేసిన ప్రతి పిల్ల వాడూ అనివార్యంగా బాలకార్మికుడిగానే జీవిస్తు న్నాడని వివిధ అధ్యయనాలు తెలియజేస్తున్నాయి.

కొన్ని సంస్థల సర్వే ప్రకారం దేశంలో ఆరు కోట్ల మంది బాలకార్మికులు ఉన్నారు. అనధికారిక లెక్కలు చూస్తే పది కోట్ల మంది ఉన్నట్లు తెలుస్తోంది. భారతదేశంలో మొత్తం బాలల జనాభాలో 14 శాత మంది వివిధ పను ల్లో చెమటోడ్చుతున్నారు. మొత్తం కార్మికుల్లో 4 శాతం మంది బాలలే. ప్రతీ పదిమంది బాలకార్మికుల్లో తొమ్మిది మంది వ్యవసాయ సంబంధిత పనుల్లో నిమగ్నమవుతున్నారు. ప్రతి ముగ్గురిలో ఇద్దరు శారీరక హింసకు గురవు తున్నారు. దాదాపు యాభై శాతం మంది ఏదో ఒక రూపంలో



భౌతికంగా వేధింపులకు బాధితులవుతున్నారు.50 శాతం మంది వారమంతా ఎలాంటి విశ్రాంతి లేకుండా పనిచేస్తున్నారు. అందులో కొంత మంది ఏదో ఒక రూపంలో లైంగిక వేధింపులకు గురవుతున్నారు.బాలకార్మికులు అసంఘటిత రంగంలో పనిచేస్తారు కాబట్టి వారికి హక్కులు, కనీస వసతులు కూడా మృగ్యమే. తేలిగ్గా మోసానికి గురవడమే కాదు శ్రమదోపిడీకి గురవుతున్నారు. నిర్దిష్ట పని గంటలు లేవు. సెలవులు, బోనస్, పెన్షన్, గ్రాట్యూటీ, ప్రావిడెంట్ ఫండ్ లాంటి ఏ సామాజిక భద్రతా చర్యలు వర్తించవు. వేతనాలు అతితక్కువ. పని పరిస్థితులు భయంకరంగా ఉన్నాయి.

సూరత్‌లోని వజ్రాలు చెక్కుడు పరిశ్రమల్లో, శివకాశీలోని అగ్గిపెట్టెలు, బాణాసంచా తయారీ పరిశ్రమల్లోనూ, జైపూర్‌లోని రాళ్ల చెక్కుడు పనిలోనూ, ఫిరోజాబాద్ అద్దాల పరిశ్రమల్లోనూ, మురా దాబాద్‌లోని లోహ పరిశ్రమ ల్లోనూ, అలీఘర్‌లోని తాళాల పరిశ్రమల్లోనూ, మీర్జాపూర్ తివాచీల తయారీ శ్రమల్లోనూ, మార్కాపూర్‌లోని పలకల తయారీ పరిశ్రమలోనూ హీనమైన, హేయమైన వాతావరణంలో బాలకార్మికులు పనిచేస్తున్నారు. పరిశీలించి చూస్తే ఈ పరిశ్రమలన్నీ ప్రమాద భరిత పనులకు సంబంధించినవే. ఎంతోమంది పిల్లలు హోటళ్లలోనూ, దుకాణాలలోనూ, గృహాల్లోనూ సేవకులుగా పనిచేస్తున్నారు. వారి శక్తికి మించి అధిక గంటలు పని చేస్తూ అనేక అనారోగ్యాల భారిన పడుతున్నారు. ఇటుక బట్టీల్లో పనిచేసే పిల్లలు పెద్ద పెద్ద బరువులు మోస్తుంటారు. తరచుగా గాయపడు తుంటారు. కొంత కాలానికి పూర్తిగా శక్తిని కోల్పోతారు. తివాచీ పరిశ్రమలో పనిచేసే బాలలు కంటి చూపును కోల్పోతున్నారు. శ్వాసకోశ వ్యాధులతో ఇబ్బందులు పడేవారు అనేకం. కాశ్మీరులోని తివాచీల పరిశ్రమలో పనిచేస్తున్న వారిలో 60 శాతం మంది క్షయ, ఆస్తమా వ్యాధులతో బాధపడుతున్నట్లు సర్వేలు చెబుతున్నాయి. ఫిరోజాబాద్‌లోని గ్లాస్, గాజుల పరిశ్రమలో పనిచేసే పిల్లలు ఆస్తమా, బ్రాంకైటిస్, కంటి సంబంధించిన రోగాలకు సతమతమవుతున్నారు. శివకాశీలో టపాకాయల పరిశ్రమలో పనిచేసే బాలలు రోగాలతో పాటు పేలుడులాంటి ప్రమాదాలకు బలైపోతున్నారు. భవన నిర్మాణ రంగంలో పనిచేసే బాలలు ప్రమాదాలకు గురవుతున్నారు. భారీ యంత్రాలతో పనిచేసే వారు సరైన శిక్షణ, సరైన భద్రత లోపించడంతో ప్రమాదాల బారిన పడుతున్నారు.

బాల కార్మికులుగా చిన్నారులు మారడానికి కారణాలను పరిశీలించినట్లయితే తల్లిదండ్రుల పేదరికమే ప్రధాన కారణం. పిల్లలు తమ మనుగడ కోసమే కాకుండా కుటుంబ అవసరాల కోసం పనిచేయాల్సిన దుస్థితి. పిల్లల్ని అదనపు ఆదాయం తెచ్చేవారిగా పేద కుటుంబాలు భావిస్తున్నాయి. ఎక్కువమంది తల్లితండ్రులు నిరక్ష్య రాస్యులు కావడం పిల్లల భవిష్యత్తు ప్రశార్థకంగా మారుతోంది. ఆర్థిక పరిస్థితి, అవగాహనాలోపం వల్ల ప్రాథమిక విద్యను కూడా అందించలేకపోతున్నారు. సాంఘిక ఆర్థిక స్థితిగతులు (కుటుంబ పరిమాణం, నిరుద్యోగిత మొదలైనవి) బాలకార్మిక వ్యవస్థ వల్ల కలిగే దుష్ఫలితాలపై ప్రధాన లోపంగా చెప్పవచ్చు.భారీ పారిశ్రామికీకరణ, పట్టణీకరణ వల్ల పల్లెల నుంచి పట్టణాలకు వలసెళ్లడం. గ్రామాల్లో ప్రత్యామ్నాయ ఉపాధి లేక పొట్టకూటి కోసం వలసెళ్లిన చోట పిల్లలను చదివించే పరిస్థితి ఉండదు. వారు కూడా బాలకార్మికులుగా మారడం అనివార్యమవుతున్నది. దీనికి తోడు ప్రస్తుత విద్యావిధానంపై అవగాహన కల్పించకపోవడం, పేద కుటుంబాలకు ఉపాధి కల్పించకపోవడం ప్రభు త్వాల ఘోర వైఫల్యం. అదే విధంగా పిల్లలను పనిలో పెట్టుకోవడం నేరంగా చూడకపోవడం, ఇది సాధారణ విషయంగా ప్రస్తుత సమాజం భావించడం ఈ వ్యవస్థ బలోపేతం కావడానికి మరో కారణం. పలక, బలపం పట్టాల్సిన చేతులు పలుగు, పార పట్టడం అత్యంత శోచనీయం. దీనికి అడ్డుకట్ట వేసేలా చర్యలు తీసుకోవడం, వారిని చక్కదిద్ది బడికి పంపడం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి బాధ్యత. అంతేకాదు బాల కార్మికులు పనిచేసే ప్రతిచోటా పౌర సమాజం కూడా దీన్ని వ్యతిరేకించడం, అవసరమైన దగ్గర ఉద్యమించడం చేయాలి. అప్పుడే ఈ పరిస్థితి నుంచి కొంతైనా బయటపడగలం.భావి భారత పౌరుల ముఖాల్లో వెలుగుల్ని చూడగలం.

(నేడు ప్రపంచ బాలకార్మిక వ్యవస్థ వ్యతిరేక దినోత్సవం)

మనస్తాపంతో యువతి ఆత్మహత్య

- ప్రేమించిన వ్యక్తి పెండ్లి చేసుకోలేదని..

నవతెలంగాణ- ఎర్రుపాలెం





మండల పరిధిలోని మొలుగుమాడు గ్రామానికి చెందిన షేక్ రహీన (23) ప్రేమించిన వ్యక్తి పెళ్లి చేసుకోలేదని, అతని చేతిలో మోసపోయాననే మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం చోటు చేసుకుంది. స్థానిక ఎస్సై వెంకటేష్ తెలిపిన వివరాల మేరకు రెహీన హైదరాబాద్‌లోని ఓ బ్యూటీ పార్లల్‌లో పనిచేస్తున్నది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్టీఆర్ జిల్లా వీరులపాడు మండలం, రంగాపురం గ్రామానికి చెందిన ఇస్లావత్ క్రాంతి కుమార్‌తో 2020లో ఇనిస్టాగ్రామ్ ద్వారా పరిచయం ఏర్పడింది. పరిచయం కాస్తా ప్రేమగా మారడంతో ఫోనులో తరచూ మాట్లాడుకోవడం, తరుచూ కలుసుకోవడం జరిగాయి. అనంతరం క్రాంతి కు మార్ కు వేరొక అమ్మాయితో వివాహం జరిగింది. ఇది తెలుకున్న రహీన తాను మోసపోయానని మధిర టౌన్ పోలీస్ స్టేషన్ లో క్రాంతిపై ఫిర్యాదు చేసింది. విచారణ చేసిన పోలీసులు క్రాంతి కుమార్‌ను సత్తుపల్లి సబ్ జైలుకు రిమాండ్‌కు పంపించారు. ఈ నెల 10న బెయిల్ పై క్రాంతి విడుదల అవ్వడంతో విషయం తెలిసిన రెహీన తనకు న్యాయం జరగలేదని మనస్థాపంతో మంగళ వారం ఉదయం ఇంట్లో ఎవరు లేని సమయంలో తన చున్నీతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. రహీన తండ్రి మాబు సాహెబ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటేష్ తెలిపారు.

ఖమ్మం నుండి శ్రీకాకుళానికి లగ్జరీ బస్సు ఏర్పాటు

- డిపో మేనేజర్ యూ.రాజ్యలక్ష్మి

నవతెలంగాణ-సత్తుపల్లి రూరల్



ఖమ్మం నుండి శ్రీకాకుళానికి సూపర్ లగ్జరీ బస్సు ఏర్పాటు చేసినట్లు సత్తుపల్లి డిపో మేనేజర్ యు.రాజ్యలక్ష్మి తెలిపారు. మంగళవారం సత్తుపల్లి డిపో కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ ప్రతిరోజు ఖమ్మంలో ఐదున్నర గంటలకు 9937 సర్వీస్ నెంబర్‌తో సూపర్ లగ్జరీ బస్సు ప్రారంభమై శ్రీకాకుళం చేరుకుంటుందని ఆమె తెలిపారు. శ్రీకాకుళం నుండి ఖమ్మంనకు ప్రతిరోజు సాయంత్రం నాలుగు గంటలకు 9938 సర్వీసు నెంబర్‌తో బస్సు బయలుదేరుతుందని తెలిపారు. ఖమ్మం నుండి శ్రీకాకుళానికి వెయ్యి రూపాయల ఛార్జీ ఉంటుందని ఆమె తెలిపారు. సత్తుపల్లి నుండి శ్రీకాకుళం రాత్రి 8 గంటలకు బస్సు ప్రారంభమవుతుందని అన్నారు. సత్తుపల్లి నుండి విజయవాడకు ఆరు డీలక్స్ బస్సులు నడుపుతున్నట్లు ఆమె వివరించారు. అదేవిధంగా సిద్దారం, సదాశివపేట, భీమవరం, మర్లపాడు మీదుగా ప్రతిరోజు బీహెచ్ఇఎల్‌కు సూపర్ లగ్జరీ సర్వీస్ నూతనంగా ప్రారంభమవుతుందని ఆమె వివరించారు. త్వరలోనే అశ్వరావుపేట మందలపల్లి, దమ్మపేట మీదుగా నుండి విజయవాడకు ఉదయం ఆరు గంటలకు ఒక బస్సు ప్రారంభమవుతుందని ఆమె తెలిపారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యల స్వాగతం

- ఈ విద్యా సంవత్సరంలో విద్యార్థుల సంఖ్య 2,341
- కావలసిన పాఠ్యపుస్తకాల సంఖ్య 19,737
- నేటికీ వచ్చిన పుస్తకాలు 9 వేలు

నేటి నుంచి పునః ప్రారంభం

నవతెలంగాణ-బోనకల్

వేసవి సెలవుల అనంతరం ప్రభుత్వ పాఠశాలలో బుధవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా పునః ప్రారంభం కానున్నాయి. సుమారు నెల 15 రోజుల అనంతరం ప్రారంభం కానున్నాయి. బోనకల్ మండలంలో 43 ప్రభుత్వ పాఠశాలలో ఉన్నాయి. ఇందులో 10 ఉన్నత పాఠశాలలు, ఒకటి ప్రాథమికోన్నత పాఠశాల, 32 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. ప్రాథమిక పాఠశాలలో 17 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉండగా ఉన్నత పాఠశాలలో 41 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ విద్యా సంవత్సరంలో 2,341 మంది విద్యార్థులు చదవబోతున్నారు. ఇందులో 1,059 మంది బాలురు 1,282 మంది బాలికలు ఉన్నారు. ఈ విద్యా సంవత్సరంలో 19737 పాఠ్యపుస్తకాలు విద్యార్థులకు అందజేయవలసి ఉంది. కేవలం నేటికీ 9 వేల పాఠ్యపుస్తకాలు మాత్రమే మండల కేంద్రానికి చేరాయి. అంటే కనీసం సగం పాఠ్యపుస్తకాలు కూడా రాలేదు. వచ్చిన పాఠ్యపుస్తకాలను మంగళవారం వివిధ పాఠశాలలకు మండల వనరుల కేంద్రం నుంచి పంపిణీ చేశారు. అదేవిధంగా ఏకరూపు దుస్తులు (యూనిఫామ్) కూడా పాఠశాలకు ఇంకా అందలేదు. ఈసారి రాష్ట్ర ప్రభుత్వం వినూత్నంగా మండల సమాఖ్య గ్రూపులకు యూనిఫామ్ కుట్టే బాధ్యతలను అప్పగించారు. గత కొన్ని రోజులుగా నాలుగు కేంద్రాల ద్వారా యూనిఫామ్ ను మహిళ మండల సమాఖ్య సభ్యులు కుడుతున్నారు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం బదిలీలు, పదోన్నతులు ప్రారంభించడంతో మండలంలో ఖాళీగా ఉన్న 58 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ అవుతాయో లేదో కూడా తెలియని అయోమయ పరిస్థితి ఉంది. ఒకవేళ భర్తీ కాకపోతే రాష్ట్ర ప్రభుత్వం విద్యా వాలంటీర్ల నియామకం జరుపుతుందా కూడా తెలియని అయోమయ పరిస్థితి నెలకొని ఉంది. ఆనాటి బీఆర్ఎస్ ప్రభుత్వం స్కావెంజర్ల స్థానంలో నెలకు రెండు వేల నుంచి 2500 రూపాయలు ఇచ్చి కొంతమందిని నియమించింది. కానీ రెండేండ్ల క్రితం బీఆర్ఎస్ ప్రభుత్వం వారిని కూడా రద్దు చేసింది. పాఠశాలలో స్కావెంజర్ల లేకపోవడంతో టాయిలెట్స్ మురికిగా తయారయ్యాయి. ప్రభుత్వ పాఠశాలలో పరిశుభ్రత అధిక ప్రాధాన్యం ఇవ్వవలసిన ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను మురికి కూపాలుగా తయారుచేస్తుంది. మండలంలో ఉన్న 43 ప్రభుత్వ పాఠశాలలోనూ స్కావెంజర్లు లేరు. పాఠశాలలను శుభ్రం చేసేవారు కూడా లేరు. అదేవిధంగా అటెండర్లు లేరు. మండల వ్యాప్తంగా కొన్ని పాఠశాలలకు మాత్రమే అటెండర్ లో ఉన్నారు. ఎక్కువ పాఠశాలలో అటెండర్లు లేకపోవడంతో విద్యార్థులే పాఠశాలల గంట కొడుతున్నారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలో విద్యుత్ సౌకర్యం ఉంది కానీ ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో విద్యుత్ బకాయిలు పేరుకుపోయాయి. మండలంలో గల పది ఉన్నత పాఠశాలలో కంప్యూటర్ రూమ్‌లు ఉన్నాయి. కానీ కంప్యూటర్లు వాడకంలో మాత్రం లేవు. మిగిలిన 33 పాఠశాలలకు కంప్యూటర్ల రూములు అసలు లేవు. ఈ విధంగా ప్రభుత్వ పాఠశాలలో వివిధ రకాల సమస్యలతో పునః ప్రారంభం కానున్నాయి. నెల 15 రోజులు అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థులు బడిబాట పట్టనున్నారు. అదేవిధంగా విద్యార్థుల ఉపాధ్యాయులతో ప్రభుత్వ పాఠశాలలో కలకలలాడబోతున్నాయి.



చిరు నోముల ఉన్నత పాఠశాల

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు యూనిఫామ్ సిద్ధం

నవతెలంగాణ-బోనకల్

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల (యూనిఫామ్) ఏకరూప దుస్తులను ఏపీఎం యద్దనపూడి పద్మలత మంగళవారం ఇన్‌చార్జీ ఎంఈఓ కొత్తపల్లి వెంకటేశ్వర్లకు అప్పగించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల యూనిఫామ్ కుట్టే బాధ్యతలను మహిళా సమాఖ్యలకు అప్పగించారు. మండల ఐకెపి ఆధ్వర్యంలో స్నేహాంజలి మండల సమాఖ్య ఆధ్వర్యంలో మహిళా సంఘాల సభ్యులతో నాలుగు కేంద్రాలను ఏర్పాటు చేసి మండల విద్యార్థులకు సంబంధించిన యూనిఫామ్ ను గత నెల రోజులుగా కుట్టారు. తమకు అప్పగించిన బాధ్యతలను పూర్తి చేసి కుట్టిన యూనిఫాములను మండల విద్యాశాఖ అధికారికి అప్పగించినట్లు ఏపీఎం యద్దనపూడి పద్మలత తెలిపారు. 2,341 మంది విద్యార్థులకు సంబంధించి యూనిఫామును కుట్టినట్లు ఆమె తెలిపారు.



నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

నవతెలంగాణ-కల్లూరు

రైతులకు నాణ్యమైన విత్తనాలు అమ్మాలని, నకిలీ విత్తనాలు అమ్మితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని వ్యవసాయ అధికారి ఎం.రూప అన్నారు. పట్టణంలోని శ్రీనివాస ఫెర్టిలైజర్స్, కప్పల బంధంలోని శ్రీనివాస ట్రేడర్స్, పుల్లయ్య బంజర్ లోని లక్ష్మీ రాఘవ ఫెర్టిలైజర్స్ ను షాపులను మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా షాపుల్లో ఉన్న స్టాక్ రిజిస్టర్, ఉన్న స్టాకు నిల్వకు సరిపోతుందా లేదా అని తనిఖీ చేశారు. విత్తనాలమ్మితే ఇచ్చే రశీద్ పైన లాట్ నెంబర్, కంపెనీ పేరు, తప్పనిసరిగా నమోదు చేయాలని అన్నారు. రైతులు కూడా పంట కాలం పూర్తయ్యేంతవరకు రసీదు, విత్తనం సంచి బ్యాగు తప్పనిసరిగా దాచి ఉంచుకోవాలని రైతుల కోరారు.

ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ ఖమ్మం

ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వి.పి. గౌతమ్ అన్నారు. మంగళవారం కలెక్టర్, స్థానిక రమణగుట్ట రజక వీధి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. అద్దె ఇంట్లో వసతుల లేమితో నిర్వహిస్తున్న పాఠశాలకు వెంటనే స్థల గుర్తింపు చేసి, భవన నిర్మాణానికి చర్యలు చేపట్టాలని ఆయన అన్నారు. ఈ సందర్భంగా అక్కడే ఉన్న ప్రభుత్వ స్థలాన్ని కలెక్టర్ పరిశీలించారు. రెవెన్యూ అధికారులతో సర్వే చేపట్టి తదుపరి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి సోమశేఖరశర్మ, ఖమ్మం అర్బన్ మండల విద్యాధికారి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ విద్యార్థికి లాప్‌టాప్ అందజేసిన కలెక్టర్

నవతెలంగాణ-ఖమ్మం



హెల్పింగ్ హాండ్స్, ఖమ్మం సభ్యులు మద్దినేని ప్రసాదరావు, కమల ఆర్థిక సౌజన్యంతో డిగ్రీ చదువుతున్న యేగినాటి హారికకు 40 వేల రూపాయల విలువగల లాప్టాప్‌ను మంగళవారం కలెక్టర్ వి.పి. గౌతమ్ చేతుల మీదుగా కలెక్టరేట్ లోని కలెక్టర్ ఛాంబర్‌లో అందజేశారు. మద్దినేని ప్రసాదరావు 80 సంవత్సరాలు పూర్తి చేసుకుని 81వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా హారిక అవసరాన్ని గుర్తించి లాప్టాప్ ను అందజేయడం శుభ పరిణామం అని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రసాదరావు, కమల దంపతులను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో హెల్పింగ్ హాండ్స్ బాధ్యులు కొంగర పురుషోత్తమరావు, రాయల నరసింహారావు, యలమద్ది వెంకటేశ్వర్లు (వైవి), మద్దినేని రవి, సీనియర్ జర్నలిస్టు మాధవరావు యెగినాటి తదితరులు పాల్గొన్నారు.



భరత్ పూర్వ విద్యార్థులను ఘనంగా సత్కరించిన యాజమాన్యం

నవతెలంగాణ-మధిర

పట్టణంలోని భరత్ విద్యా సంస్థలకు చెందిన పూర్వ విద్యార్థులు జల్లా.పూజిత, రేగళ్ల.సాయి కౌశిక్ రెడ్డి, సిహెచ్ .సాయి కుష్మిత ఇటీవల విడుదలైన జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్ పరీక్షలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి దేశంలో ప్రతిష్టాత్మకమైనటువంటి క్యాంపస్లలో సీట్లు సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ భరత్ విద్యా సంస్థల అధినేతలు శీలం విద్యాలత, వెంకటరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్ముందు కూడా జీవితాల్లో అత్యున్నత శిఖరాలకు చేరుకోవాలని తమ ఆశీస్సులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పీఆర్టియు జిల్లా నాయకులు బ్రహ్మారెడ్డి, విశ్వనాథం, సంగారావు, ప్రిన్సిపల్ కోటేశ్వరరావు, డీన్ రవీందర్ రెడ్డి, శశికళ, నాగరాజు, అజీమ్, భవాని, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

ఆక్రమణలు సహించం... బహిర్గతం చేస్తాం

- వేశ్యకాంతల చెరువు తూములను బాగుచేయండి
- చెరువుకట్ట, ఎన్టీఆర్ కెనాల్‌పై మొక్కలు నాటాలి
- సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ రాగమయి దయానంద్
- చెరువులు, కాలువలను పరిశీలించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-సత్తుపల్లి

ప్రభుత్వ భూములు, చెరువు శిఖాలు ఆక్రమణలను సహించమని, ఆయా ఆక్రమణలను గుర్తించి బహిర్గతం చేస్తామని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ హెచ్చరించారు. మంగళవారం సత్తుపల్లి పట్టణ పరిధిలో ఉన్న వేశ్యకాంతల చెరువు, తామరచెరువు, ఎన్టీఆర్ కెనాల్, గాడిదల వాగు పరివాహక ప్రాంతాలతో పాటు బేతుపల్లి చెరువు, కాలువలను ఎమ్మెల్యే రాగమయి దయానంద్ ఐబీ అధికారులను వెంట తీసుకొని పరిశీలించారు. వేశ్యకాంతల చెరువు మెరక తూమును బాగు చేయాలని ఐబీ అధికారులను ఆదేశించారు. చెరువును ఆసాంతం పరిశీలించిన ఎమ్మెల్యే చెరువులో ఇంకను మిగిలి పోయిన పూడికను తీయాలన్నారు. వేశ్యకాంతల చెరువుకట్ట, ఎన్టీఆర్ కెనాల్‌పై సింగరేణి సౌజన్యంతో మొక్కలు నాటించి వాటి సంరక్షణను కూడా వారితోనే నిర్వహించేలా చేద్దామన్నారు. ఎన్టీఆర్ కెనాల్ మీదుగా బేతుపల్లి చెరువు వరకు పరిశీలించిన ఎమ్మెల్యే కాలువ, కట్టపై ఉన్న ముళ్ల కంపలను తొలగించి శుభ్రం చేయాల్సిందిగా ఐబీ అధికారులను కోరారు. అనంతరం గాడిదల వాగును పరిశీలించిన ఆమె వాగు ఆక్రమణలో ఉండటం వల్ల వరదలు వచ్చిన సందర్భాల్లో చాలా ఇబ్బందులు పడుతున్నారని, ఆక్రమణలను తొలగించి ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. అనంతరం తామరచెరువును ఎమ్మెల్యే పరిశీలించారు. చెరువు తూములు పాడవటం మూలంగా రైతులకు ఇబ్బందులు కలుగుతున్నాయని, ఇందుకు చెరువు కాంట్రాక్టర్ నాసిరకంగా పనులు చేయడమే కారణమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. చెరువు భూములను సర్వే జరిపించి ఆక్రమణలు జరక్కుండా రాళ్లతో హద్దులు ఏర్పాటు చేయించి ప్రభుత్వ భూములను కాపాడాలని ఐబీ అధికారులను ఎమ్మెల్యే రాగమయి దయానంద్ కోరారు. ఏ పార్టీ వారైనా, ఎంతటి వారైనా సరే ప్రభుత్వ భూములను కబ్జా చేసుంటే ఉపేక్షించమని ఎమ్మెల్యే తేల్చి చెప్పారు. ఎమ్మెల్యే వెంట ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్, ఐబీ ఈఈ సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, డీఈ సంపతి వెంకటేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ మంద రవిబాబు, కాంగ్రెస్ నాయకులు చల్లగుళ్ల నరసింహారావు, మొహమ్మద్ కమల్ పాషా, గాదె చెన్నకేశవరావు, దోమ ఆనంద్. పింగిలి సామేలు, మానుకోట ప్రసాద్, రైతులు పాల్గొన్నారు.



తామరచెరువు అభివృద్ధి అంతా డొల్ల...

సత్తుపల్లి పట్టణ శివారు గుడిపాడు సమీపంలో ఉన్న తామరచెరువు అభివృద్ధి అంతా డొల్ల అని, ఇక్కడి జరిగిన నిర్మాణాలన్నీ నాసిరకమని, ప్రజాధనం రూ. 3కోట్ల అవినీతి జరిగిందని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ ఆరోపించారు. మంగళవారం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఐబీ అధికారులు, కాంగ్రెస్ నాయకులు తామరచెరువును పరిశీలించారు. పనిలో పనిగా గతంలో ఇక్కడ నిర్మాణం జరిగిన ఫ్రీడం పార్కును పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణ ప్రజలకు ఆహ్లాదం పంచేందుకు గత ప్రభుత్వ హయాంలో కోట్లాది రూపాయలతో నిర్మాణం జరిగిన ఫ్రీడం పార్కు పనులన్నీ నాసిరకంగా చేపట్టారని, పెద్ద మొత్తంలో అవినీతి జరిగిందన్నారు. నాణ్యత లోపాలను స్వయంగా పరిశీలించారు. సందర్శకులు నడిచేందుకు ఏర్పాటు చేసిన పాత్‌కు సిమెంట్ లేకుండానే టైల్స్‌ను అంటిచారని, వాటిని తీసిమరీ చూపించారు. మట్టిపైనే టైల్స్ ఉండటాన్ని ఎమ్మెల్యేతో పాటు ఐబీ అధికారులు చూసి నివ్వెర పోయారు. కేవలం డబ్బుల కోసమే సదరు కాంట్రాక్టరు నాసిరకంగా నిర్మాణం చేపట్టి ప్రజాధనాన్ని దోచుకున్నారని మండిపడ్డారు. పార్కు నిర్మాణం తూతూ మంత్రంగా చేపట్టడంతో పట్టణ ప్రజలు కూడా పార్కుకు వచ్చి ఆహ్లాదం పొందిన సందర్భాలు కూడా లేవని స్పష్టం చేశారు. అప్పటి అధికార పార్టీ అండదండలతో కాంట్రాక్టర్ నలుగురు నవ్విపోదురు గాక నాకేంటి అనే రీతిలో ఇంత నాసిరకంగా పనులు ఏ కాంట్రాక్టర్ చేసుండరన్నారు. ఫ్రీడం పార్కులో జరిగిన భారీ అవినీతిపై విచారణ జరిపించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మొత్తంగా తామరచెరువు ఒక్క దానిపైనే రూ. 3కోట్ల కుంభకోణం జరిగిందని ఎమ్మెల్యే అన్నారు. కేవలం డబ్బుకోసమే పార్కు నిర్మాణం చేపట్టి బిల్లులు కూడా విడుదల చేయించుకున్నారన్నారు. ఇంత దారుణంగా పార్కు నిర్మాణం నాసిరకం, అవినీతి భారీగా జరిగిందనడానికి క్షేత్రస్థాయి పరిశీలనను బట్టి అర్థమవుతోందన్నారు. పార్కులో కనీసం మొక్కలు కూడా నాటకపోవడం మరీ దారుణమన్నారు. పార్కు నిర్మాణంలో జరిగిన అవినీతిని బట్టబయలు చేస్తామని, అవినీతి పరులను కాంగ్రెస్ ప్రభుత్వం ఉపేక్షించదని ఎమ్మెల్యే రాగమయి దయానంద్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు దయానంద్ విజయకుమార్ హెచ్చరించారు.



నిదానపురం ముత్యాలమ్మ దేవాలయంలో చోరీ

నవతెలంగాణ-మధిర

మండల పరిధిలోని నిధానపురం గ్రామంలో ముత్యాలమ్మ అమ్మవారి దేవాలయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఆలయం తలుపులకు వేసిన తాళం పగలగొట్టి దొంగతనానికి పాల్పడ్డారు. మంగళవారం ఉదయం స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఈ చోరీలో అమ్మవారి వెండి వడ్డానం, వెండి నేత్రాలు, రెండు ఇత్తడిగంటలు, హుండీలోని సొమ్మును చోరీ చేశారని పోలీసులకు గ్రామస్తులు తెలిపారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నామని పోలీసులు తెలిపారు.

బాలుడి వైద్యానికి సీఎంఆర్ఎఫ్ మంజూరు

నవతెలంగాణ-కారేపల్లి

మండలంలోని పేరుపల్లికి చెందిన ఎడ్ల సతీష్ కుమారుడు చైత్రన్(7) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. వైద్య ఖర్చులకు ఇబ్బంది పడుతుండటంతో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు మల్లెల నాగేశ్వరరావు స్పందించి ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ ద్వారా వైద్య ఖర్చులకు సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసాడు. ఎమ్మెల్యే రాందాస్ నాయక్ సిఫార్సుతో వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి ఎల్వోసీ ద్వారా బాధితునికి రూ.65వేలు మంజూరు చేశారు. ఎల్వోసీ పత్రాన్ని ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్, మల్లెల నాగేశ్వరరావులు అందజేశారు. ఎమ్మెల్యేకు బాధిత కుటుంబం కృతజ్ఞతలు తెలిపింది.

తులశమ్మ మృతి

- నివాళులర్పించిన నాయకులు

నవతెలంగాణ-కారేపల్లి

ఆత్మ కమిటీ మాజీ చైర్మెన్ ముత్యాల సత్యనారాయణ అత్తగారైన వడ్డే తులశమ్మ (92) మంగళవారం మృతి చెందారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె పరిస్థితి విషమించి ఇంటి వద్దనే మృతి చెందారు. వివిధ పార్టీల నాయకులు సందర్శించి నివాళులర్పించారు. ఎమ్మెల్సీ తాత మధు, ఇన్కమ్ టాక్స్ కమిషనర్ జీవన్ లాల్, మాజీ ఎమ్మెల్యే రాములునాయక్ బాధిత కుటుంబాన్ని ఫోన్లో పరామర్శించారు. తులశమ్మకు నివాళులర్పించిన వారిలో ఆత్మ కమిటీ మాజీ చైర్మెన్ ముత్యాల సత్యనారాయణ, వైస్ ఎంపీపీ రావూరి శ్రీనివాసరావు మాజీ జెడ్పీటీసీ వున్నం వీరేందర్, కారేపల్లి సంత ఆలయ చైర్మెన్ అడ్డగోడ ఐలయ్య, మాజీ సర్పంచ్ మాలోత్ కిషోర్, నాయకులు అజ్మీర వీరన్న, సీపీఐ జిల్లా నాయకులు తాతా వెంకటేశ్వర్లు, సీపీఐ(ఎం) నాయకులు వల్లభనేని మురళి, వల్లభి నేని ప్రభాకర్, పాటి రంగయ్య, ఆర్టీఏ కమిటీ మాజీ సభ్యులు వల్లభనేని రామారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాన్ని తొలగించిన రెవెన్యూ అధికారులు

నవతెలంగాణ-కూసుమంచి



మండలంలోని నాయకన్ గూడెం గ్రామంలో ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుని నిర్మాణాలు చేపట్టగా రెవెన్యూ అధికారులు మంగళవారం కూల్చేశారు. రెవెన్యూ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం నాయకన్ గూడెం గ్రామంలో ఓ వ్యక్తి ప్రభుత్వానికి చెందిన 15 కుంటల భూమిని ఆక్రమించుకొని, దౌర్జన్యంగా కట్టడాలను నిర్మించారని, మా దృష్టికి వచ్చిందని వెంటనే సంబంధిత వ్యక్తికి పలుమార్లు నోటీసులను పంపినా స్పందించలేదని తర్వాత కూల్చివేయటం జరిగిందని తెలిపారు.

ఎస్‌బీఐ ఆధ్వర్యంలో ఉచిత స్వయం ఉపాధి శిక్షణ

నవతెలంగాణ - బోనకల్

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో గ్రామీణ స్వయం ఉపాధి ఉచిత శిక్షణ తరగతులను 6 జూన్ నుంచి ప్రారంభమైనట్లు గ్రామీణ స్వయం ఉపాధి ఉచిత శిక్షణ నిర్వాహకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణా తరగతులకు 18 నుంచి 45 సంవత్సరాల వయసులోపు కలిగిన గ్రామీణ నిరుద్యోగ యువకులు మా మాత్రమే అర్హులని వారు తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో సెల్ ఫోన్ రిపేర్ 30 రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. టు వీలర్ మెకానిక్ ఈనెల 10వ తేదీ నుంచి 30 రోజులపాటు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. పుట్టగొడుగుల పెంపకం 10 రోజులపాటు ఉంటుందని తెలిపారు. అగరబత్తుల శిక్షణ ఈనెల పది నుంచి పది రోజులు పాటు సీసీ టీవీ రిపేర్లు ఈనెల 15 నుంచి 13 రోజులు పాటు జూట్ బ్యాగులు తయారీ ఈనెల 15 నుంచి 13 రోజులపాటు సాఫ్ట్ టాయ్స్ మేకింగ్ ఈనెల 15 నుంచి 13 రోజులపాటు, కారు డ్రైవింగ్ 24 నుంచి ఈనెల 24 నుంచి 30 రోజులపాటు శిక్షణ ఇవ్వనున్నట్లు వారు తెలిపారు. ఉచిత శిక్షణ సమయంలో అభ్యర్థులకు శిక్షణ మెటీరియల్, యూనిఫామ్, టూల్ కిట్స్, పుస్తకాలు, భోజనం, వసతులను కల్పించనున్నట్లు వారు తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ఆధార్, రేషన్ కార్డు, ఉపాధి జాబ్ కార్డు మూడు పాస్ ఫొటోలు తీసుకొని ఎస్బిఐ ఆర్ఎస్ఈటిఐ తరుణ్ హార్ట్ వరంగల్ క్రాస్ రోడ్డు నందు గల ఫోన్ నెంబర్ 7842295972 సంప్రదించాలని వారు కోరారు.

మసక బారుతున్న ప్రభుత్వ విద్య

- మౌలిక సదుపాయాలపై ప్రభుత్వం దృష్టి సారించాలి
- విద్యార్థులు బడిబాట పట్టాలంటే సమస్యలే పరిష్కారమే మార్గం
- ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఇటికల రామకృష్ణ

నవతెలంగాణ-ఖమ్మం

ప్రభుత్వ విద్య మసకబారుతోందని, ఒకప్పుడు వందలాది మంది విద్యార్థులతో ఒక వెలుగు వెలిగిన ప్రభుత్వ పాఠశాలలు నేడు వెలవెలబోతున్నాయని, విద్యార్థులు బడిబాట పట్టాలంటే సమస్యల పరిష్కారమే మార్గమని అఖిల భారత విద్యార్థి సమాఖ్య(ఏఐఎస్ఎఫ్) జిల్లా కార్యదర్శి ఇటికల రామకృష్ణ అన్నారు. మంగళవారం ఏఐఎస్ఎఫ్ ప్రతినిధి బృందం నగరంలోని పలు ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పన లేకపోవడం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ విద్య నిర్వీర్యం అయితే ప్రజలు తీవ్ర ఇబ్బందులుకు గురికావాల్సి వస్తుందని, ప్రభుత్వ విద్యపై తల్లిదండ్రులలో నమ్మకం కల్పించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ఆర్భాటంగా ఫ్లెక్సీ పెట్టి, ఫొటో దిగి, బడిబాట ప్రచారాన్ని నిర్వహిస్తే విద్యార్థుల ప్రభుత్వ పాఠశాలలకు రారని పేర్కొన్నారు. గత పదేళ్లగా ఉపాధ్యాయుల నియామకాలు లేకపోవడం, ప్రయివేట్ విద్యాసంస్థలను నియంత్రించకపోవడంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు కల్పించి, ఉపాధ్యాయ నియామకాలు చేపట్టాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం, ప్రభుత్వ విద్య రంగంపై సారించి ప్రభుత్వ పాఠశాలను ఆధునికరించాలని ప్రభుత్వాన్ని కోరారు. లేనియెడల ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు .ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి శివ, వంశీ, హరికృష్ణ. బాలాజీ, మనోజ్, అయ్యప్ప, ప్రసాద్, నవీన్ ,సాయి, నరేష్, గోపి ,ప్రతాప్, వెంకటేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



దివ్యాంగునికి వీల్ చైర్ అందజేత

నవతెలంగాణ-పెనుబల్లి

జోనబోయిన ట్రస్ట్ ద్వారా సీపీఐ(ఎం), సీఐటీయూ హమాలీ యూనియన్ ఆధ్వర్యంలో పెనుబల్లి గ్రామంలో మామిడి తోటలో నివసిస్తున్న గోపి అనే యువకుడు పుట్టుకతో పోలియోతో 24 సంవత్సరాలుగా అంగవైకల్యంతో ఇబ్బందిపడుతున్నారు. ఇబ్బందిని చూసి సీపీఐ(ఎం), సీఐటీయూ హమాలీ వర్కర్స్ యూనియన్ వారు జోనబోయిన ట్రస్ట్ వారితో సంప్రదించి మంగళ వారం 7000 రూపాయలు విలువచేసే వీల్ చైర్‌ని అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా నాయకులు చలమాల విట్టల్ రావు మాట్లాడుతూ ఇలాంటి అంగవైకల్యంతో బాధపడుతున్నటువంటి వారిని ఆదుకోవడంలో జోనబోయిన ట్రస్ట్ వారు ముందుంటున్నారని, వారికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఇలాంటి వారిని ప్రభుత్వం కూడా ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి గాయం తిరుపతిరావు, కలకోట అప్పారావు, హమాలి వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు మిద్దె స్వామి, నాగయ్య, రాములు, మల్లెల వెంకటేశ్వరరావు, మోదుగుమ్మడి ప్రసాదు తదితరహమాలి వర్కర్స్ పాల్గొన్నారు.





ఆళ్లపాడులో పలువురికి వాంతులు, విరోచనాలు

- పెరుగుతున్న బాధితుల సంఖ్య
- మధిర, ఖమ్మం ఆస్పత్రులకు వెళుతున్న రోగులు

నవతెలంగాణ-బోనకల్

మండల పరిధిలోని పలు గ్రామాలలో గత వారం రోజుల నుంచి వాంతులు విరోచనాల బాధితుల సంఖ్య రోజురోజుకు పెరిగిపోతోంది. దీనికి కలుషిత నీరు కారణమా లేక మరొకటి కారణమా అనేది తెలియటం లేదు. మండల కేంద్రమైన బోనకల్ గ్రామంలో చిన్నారుల నుంచి పెద్దవారు వరకు ప్రతిరోజు వాంతులు, విరోచనాల బాధితులు పెరిగిపోతున్నారు. ఆళ్లపాడు గ్రామానికి చెందిన మంద లక్ష్మి తిరుపతమ్మకు వాంతులు, విరోచనాలు అవుతుండటంతో మధిర తీసుకెళ్లగా అక్కడ తగ్గకపోవడంతో ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. షేక్ ఇమ్రాన్ ఖాసిం అనే యువకుడికి వాంతులు, విరోచనాలు అవుతుండటంతో మధిరలోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మల్లాది శ్రీను కుటుంబంలో ఇద్దరు పిల్లలు వాంతులు, విరోచనాలు బారిన పడ్డారు. అదే విధంగా బెజవాడ పుల్లయ్య ఇంట్లో కూడా ఇద్దరు పిల్లలకు వాంతులు విరోచనాలు అవుతున్నట్లు సమాచారం. గ్రామంలో అనేక మందికి ఇలా ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయంపై గ్రామ పంచాయతీ కార్యదర్శి జొన్నలగడ్డ పరశురామును వివరణ కోరగా వాంతులు, విరోచనాలతో గ్రామస్తులు బాధపడుతున్నట్లు తన దృష్టికి రాలేదని తెలిపారు. తాను గ్రామంలో మిషన్ భగీరథ పనులలో ఉన్నట్లు తెలిపాడు. ఈ విధంగా అన్ని గ్రామాలలో ఈ బాధితులు పెద్ద సంఖ్యలో ఉన్నట్లు సమాచారం.

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

నవతెలంగాణ-వైరాటౌన్

మండల పరిధిలోని పులిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవాలయం వద్ద మంగళవారం పాలడుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు ఘనంగా ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పదవ తరగతి పూర్తి చేసుకుని 23 వసంతాలు పూర్తవడంతో ఒక్కసారిగా కలుసుకున్న వారు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను, చిలిపి చేష్టలను గుర్తు చేసుకుని ఎంతో సరదాగా గడిపారు. పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంతో పులిగుట్ట దేవాలయ పరిసరాలు సందడిగా మారాయి. అనంతరం ఒకరికొకరు గిఫ్ట్ ప్యాకెట్స్ అందించుకొని, విందులో పాల్గొన్నారు. గద్దల లక్ష్మాద్రి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

నీట్ యూజీ 2024 ను రద్దు చేయాలి

- పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు ఆర్.క్రాంతి, కార్యదర్శి జి.మస్తాన్

నవతెలంగాణ ఖమ్మం



నీట్ యూజీ 2024 ఫలితాల్లో అవకతవకలు, పేపర్ లీకేజీకి పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో డాక్టర్ అకాడమీ నుండి గట్టయ్య సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్ క్రాంతి, జి మస్తాన్ లు మాట్లాడుతూ నీట్ యూజీ 2024 ఫలితాల్లో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ అవకతవకలకు పాల్పడి ఉజ్వల భవిష్యత్తు ఉన్న విద్యార్థుల జీవితాలతో చెలగాటం మాడిందన్నారు. జాతీయ స్థాయిలో నెంబర్ వన్ ర్యాంక్ 68 మందికి రావడం, దానిలో ఒకటే సెంటర్లో పరీక్ష రాసిన 8 మంది ఉండడం అనేక అనుమానాలకు తావిస్తుందన్నారు. దీని ద్వారా విద్యార్థులు తీవ్రమైన ఆందోళనలు గురవుతున్నారని మరికొందరు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులకు న్యాయం చేయని యెడల పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో బీజేపీ ఎంపీ అభ్యర్థుల ఇండ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఉదయ్ రామకృష్ణ, శ్రీకాంత్, పాల్గొన్నారు.

ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి

- రైతు బంధు ఇవ్వాలి : సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా

నవతెలంగాణ-కామేపల్లి



ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, రైతు బంధు వెంటనే రైతులకు ఇవ్వాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. సీపీఐ(ఎం) మండల కమిటీ సమావేశం పింజరమడుగు గ్రామంలో వింజం నాగభూషణం అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో నున్నా నాగేశ్వరరావు హాజరై మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన 6 గ్యారంటీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సొంత ఇంటి స్థలాలపై ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని, రేషన్ కార్డులు ఇవ్వాలని, రైతులకు రుణమాఫీ తక్షణమే చేయాలని ఉపాధి హామీ కార్మికులకు రోజుకి 600 ఇవ్వాలని సంవత్సరానికి 200 రోజులు పని దినాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు దుగ్గి కృష్ణ, మండల కార్యదర్శి అంబటి శ్రీనివాస్ రెడ్డి, బాదావత్ శ్రీనివాస్, ఏర్పుల శాంతయ్య, కాటినేని కృష్ణమూర్తి, ఆడప ఉపేందర్, కిన్నెర రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రయివేటుకు దీటుగా ప్రభుత్వ విద్య

- బడిబాట కార్యక్రమాన్ని పకడ్బంధీగా నిర్వహించాలి
- కలెక్టర్ వి.పి. గౌతమ్

నవతెలంగాణ-ఖమ్మం

ప్రయివేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో పెద్ద ఎత్తున విద్యార్థులను చేర్పించాలని, బడిబాట కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ వి.పి. గౌతమ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో బడి బాట, అమ్మ ఆదర్శ పాఠశాలల పనుల పూర్తిపై విద్యాశాఖ, ఇంజనీరింగ్, మండల సమాఖ్యలతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ గ్రామాన బడిబాట కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహించాలని తెలిపారు. ప్రతి ఇంటికి వెళ్లి, బడీడు పిల్లలను గుర్తించి వారి వివరాలు సేకరించాలని అన్నారు. గుర్తించిన పిల్లలందరూ ప్రభుత్వ పాఠశాలల్లో చేరేలా కృషి చేయాలని తెలిపారు. ప్రయివేట్ పాఠశాలల్లో 1 నుంచి ఐదో తరగతి చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడాలని, ప్రభుత్వ పాఠశాలల్లో సదుపాయాల కల్పన, ఇంగ్లీష్ మీడియం బోధనపై అవగాహన కల్పించి, వారిలో చైతన్యం తేవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులతోనూ సమావేశం నిర్వహించాలని అన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో చదువుకొని అప్ గ్రేడ్ అవుతున్న ఐదు నుంచి ఆరు సంవత్సరాల వయసున్న చిన్నారు లందరూ ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీనితో ప్రభుత్వ పాఠశాలలు మరింత బలోపేతం అవుతాయని ఆయన అన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ప్రతిభ, విద్యా బోధన, పై విద్యాశాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. తద్వారా ప్రభుత్వ పాఠశాలలకు మంచి గుర్తింపు వచ్చే అవకాశం ఉంటుందని వివరించారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో కిచెన్ షెడ్లు, టాయిలెట్స్ మిగిలిన నిర్మాణ పనులు వేగవంతం చేయాలని అన్నారు. వారంలోగా పనులన్నీ పూర్తి అయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. మహిళా సంఘాలే పనులు చేపట్టాలని, నిధుల మంజూరు విషయంలో ఎలాంటి జాప్యం జరగకూడదని ఆయన తెలిపారు. ఈ నెల 12వ తేదీ వరకు పాఠ్యపుస్తకాలు అందించడంతోపాటు యూనిఫామ్స్ విద్యాశాఖ అధికారులు సిద్ధం చేసి ఉంచాలని సూచించారు. పాఠశాలల్లో శానిటేషన్ సంబంధించిన పనులు చేపట్టాలని తెలిపారు. పాఠశాలల అభివృద్ధికి సంబంధించి అన్ని వివరాలను సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు. విద్యార్థుల హాజరు



శాతం తక్కువ ఉన్నచోట పెంచేలా ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. ఈ వీడియో సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్, జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖర శర్మ, జెడ్పీ సీఈఓ ఎస్.వినోద్, డీఆర్డీఓ ఆర్.సన్యాసయ్య, డీఐఈఓ రవిబాబు, జిల్లా సంక్షేమ అధికారి రాంగోపాల్ రెడ్డి, బి.సి. వెల్ఫేర్ అధికారి జ్యోతి, ట్రైబల్ వెల్ఫేర్ డి.డి. విజయలక్ష్మి, పంచాయతీరాజ్, మునిసిపల్, ఆర్ అండ్ బి ఈఈలు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ స్థలాల ఆక్రమణలపై కలెక్టర్‌కు ఫిర్యాదు

నవతెలంగాణ-వైరాటౌన్

వైరా మున్సిపాలిటీ పరిధిలోని గండగలపాడు గ్రామంలో జరిగిన బావి స్థలం, మట్టి రోడ్డు ఆక్రమణలపై గ్రామస్తులు గ్రీవెన్స్‌లో ఖమ్మం కలెక్టరేట్ కు ఫిర్యాదు చేశారు. గండగలపాడు గ్రామంలోని బీసీ కాలనీలో 177 చదరపు గజాల బావి స్థలాన్ని పోతగాని కేశవులు, తండ్రి: రత్తయ్య (లేటు) ఆక్రమించుకొని ప్రహరి గోడ నిర్మించుకున్నాడని, పడమర దిక్కున ఉన్న మున్సిపాలిటీకి సంబంధించిన మట్టి రోడ్డును పోతగని చెన్నయ్య తండ్రి కోటయ్య (లేటు) ఆక్రమించుకొని ఇంటి నిర్మాణం చేసినాడని, ఆక్రమణల గురించి మున్సిపాలిటి అధికార్లు దృష్టికి తీసుకెళ్లినా ఎటువంటి చర్యలు తీసుకోలేదని, కావున విచారణ చేసి ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలాలను స్వాధీనం చేసుకొవాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు వాసిరెడ్డి విద్యాసాగర్ రావు, ఇమ్మడి రామారావు, ఇమ్మడి వెంకటకృష్ణ, విశ్వనాథం, గొడ్ల లక్ష్మయ్య, వెంకట కృష్ణ, డీవైఎఫ్ఐ నాయకులు నాగూల్ పాషా, చిత్తారు మురళీ, మల్లెల మహేష్, దొంతేబోయిన నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

సత్తుపల్లి ఆర్టీసీ సేవలు అభినందనీయం

- మజ్జిగ ముగింపు సభలో రూరల్ సీఐ వెంకటేష్
- దాతలకు కృతజ్ఞతలు తెలిపిన మేనేజర్ రాజ్యలక్ష్మి

నవతెలంగాణ-కల్లూరు

ప్రయాణికులకు సత్తుపల్లి డిపో మేనేజర్ యు.రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో సిబ్బంది అందిస్తున్న సేవలు అభినందనీయమని సత్తుపల్లి రూరల్ సీఐ వెంకటేష్ అన్నారు. సత్తుపల్లి డిపో పరిధిలో కల్లూరు బస్టాండ్ నందు వేసవిలో ప్రయాణికులకు 70 రోజులపాటు దాతల సహకారంతో అందించిన ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమం ముగింపు సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రయాణికుల ఆరోగ్యమే ముఖ్యమని భావించి వేసవిలో 70 రోజులపాటు కల్లూరు బస్టాండ్‌లో ప్రయాణికులకు ఉచిత మజ్జిగ పంపిణీ, ఓఆర్ఎస్ పాకెట్ల పంపిణీ, కూలింగ్ మినరల్ వాటర్ అందించడం చాలా గొప్ప విషయమని డిపో మేనేజర్ యు.రాజలక్ష్మి సేవలు మరువలేనివి అని అన్నారు. ఈ కార్యక్రమాన్ని కల్లూరులో ఆర్టీసీ ఆధ్వర్యంలో చేపట్టిన దాతలు ముందుకు వచ్చి విజయవంతం చేయడం చాలా ఆనందకరంగా ఉందని డిపో మేనేజర్ యు రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. దాతలు అందిస్తున్న సహకారం సత్తుపల్లి డిపో మరువలేనిది అని ఆమె పేర్కొన్నారు. మూడు నెలలపాటు కూలింగ్ మినరల్ వాటర్ అందించిన ఆళ్లకుంట నరసింహారావును సత్కరించారు. అనంతరం విలేజ్ బస్ ఆఫీసర్ కిన్నెర ఆనందరావును లయన్స్ క్లబ్ సభ్యులు ఘనంగా సన్మానించారు. 70 రోజులు పాటు నిర్విరామంగా ప్రయాణికులకు ఉచితంగా మజ్జిగ పంపిణీ చేసిన దాతల సేవలను ఈ సందర్భంగా వారు



కొనియాడారు. గత మూడేళ్లగా రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా కల్లూరు బస్టాండులో ప్రతి వేసవిలో ప్రయాణికుల సౌకర్యార్థం ఉచితంగా మజ్జిగ పంపిణీ, కూలింగ్ మినరల్ వాటర్, ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ వంటి కార్యక్రమాలు చేపడుతున్న సత్తుపల్లి డిపో అధికారులను, జిల్లా కాంగ్రెస్ నాయకులు పసుమర్తి. చంద్రరావు, మాజీ జెడ్పీటీసీ లక్కినేని రఘులు ఈ సందర్భంగా అభినందించారు. చివరి రోజు కల్లూరు గ్రామపంచాయతీ వారు ప్రయాణికులందరికీ ఉచితంగా మజ్జిగ పంపిణీ చేయడం అభినందనీయమని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ ఈవో కృష్ణారావు, పంచాయతీ అధికారి, ఎల్‌డీసీ శామ్యూల్, నాయకులు ఆళ్లకుంట నరసింహారావు, ధారారంగా, ఉస్మాన్, త్రినాధ్, రాము యాదవ్, రుక్మిణి, దామాల సురేష్, బైర్ల కాంతారావు, దార్ల నరసింహారావు, ఆర్ఎంపీ వైద్యులు రాజు, కిషోర్, లయన్స్ క్లబ్ చలువాది. నగేష్, నాగేంద్రబాబు. పాల్గొన్నారు.



పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం

- డాక్టర్ రత్న మనోహర్

నవతెలంగాణ-తల్లాడ

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులను దూరం చేసుకోవచ్చని, పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ రత్న మనోహర్ తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాలలో మంగళవారం డి వాటరింగ్, శానిటేషన్ కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించారు. వైద్య సిబ్బంది ప్రజలకు అవగాహన కలిగిస్తూ వర్షాకాలం ప్రారంభమైనందున వర్షపు నీరు నిల్వ ఉండి, దోమలు అభివృద్ధి చెందుతాయన్నారు. పరిసరాలలో నీరు నిలవకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. కొబ్బరి బోండాలు, టైర్లు, వాడని నీటి తొట్లు, కూలర్లలో నీరు నిలిచే ప్రమాదం ఉందని, గృహ పరిసరాలను పరిశుభ్రం చేసుకోవాలన్నారు. దోమలు కుట్టకుండ దోమతెరలు వినియోగించాలని వేడి ఆహార పదార్థాలను తీసుకోవాలని, నిల్వ ఉన్న మాంసం తదితర పదార్థాలను తీసుకోవద్దన్నారు. ఆహార పదార్థాలపై తప్పనిసరిగా మూతలు ఉంచాలని, ప్రజలకు అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్స్ మోహన్, పెద్ద పుల్లయ్య, భద్రమ్మ, వసంతకుమారి, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లల ఆత్మ రక్షణ కోసం కరాటే

- సీనియర్ నడక సాధకులు డాక్టర్ సీతయ్య

నవతెలంగాణ-ఖమ్మం



ఆడపిల్లల ఆత్మ రక్షణ కోసం, శారీరక, మానసిక మనోధైర్యం కోసం కరాటే ప్రాక్టీస్ ఎంతో దోహదపడుతుందని సీనియర్ నడక సాధకులు డాక్టర్ సీతయ్య, వాకర్స్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ రాకం శ్యామ్ బాబు అన్నారు. మంగళవారం ఖమ్మంలోని పెవిలియన్ గ్రౌండ్‌లో కరాటే శిక్షణ పొందుతున్న చిన్నారులను పెవిలియన్ గ్రౌండ్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చిన్నారులను ట్రైనింగ్ ఇచ్చిన వారికి ప్రోత్సాహకరంగా పండ్లు, గుడ్లు, బిస్కెట్స్, చాకోలెట్స్ ఇచ్చి వారిపై పూలు జల్లి కురిపించి శుభాకాంక్షలు, ఆశీస్సులు అందజేశారు. నేటి పిల్లలు కరాటే విద్యను అభ్యశించడం వల్ల చక్కని క్రమశిక్షణ కలిగి ఉత్తమ పౌరులు కలుగుతారని కోరారు. ఇలాంటి కార్యక్రమాలు పౌర సమాజం అన్ని విధాలా సహాయ సహకారాలు అందించి ప్రోత్సహించాలని అప్పుడే ఆడపిల్లలకు రక్షణ ఆడవారి పట్ల అసభ్యంగా ప్రవర్తించే వారినుంచి రక్షణ కలుగుతుందని కోరారు. అనంతరం కరాటే మాస్టర్స్ యం.సాయిరేఖ, పాషా, షకీరాలను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస రెడ్డి, షఫీ, వాకర్స్ అసోసియేషన్ కార్యదర్శి కొండమీద వెంకట్, కార్మిక నేత మంద వెంకటేశ్వర్లు, వెంకట్, సుదర్శన్, మూర్తి, నిరంజన్, శ్రీనివాస్, లింగయ్య, వీరయ్య, కృష్ణారెడ్డి సుదర్శన్ రెడ్డి, ప్రసాద్, దామోదర్ రెడ్డి, తార, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భూక్య వీరభద్రం
- 25, 26న జరుగు రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయండి
- తాళ్ళపల్లి కృష్ణ

నవతెలంగాణ-కొణిజర్ల

రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు ఎదుర్కొంటున్న ముఖ్యమైన సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వం పరిష్కరించి, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు భూక్య వీరభద్రం ప్రభుత్వాన్ని కోరారు. సీపీఐ(ఎం) మండల కమిటీ సమావేశం స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం దారాగాని రాములు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రేషన్ కార్డుల కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారని ప్రభుత్వం ప్రకటించిన అనేక హామీలు పొందాలంటే రేషన్ కార్డుతో ముడిపడి ఉన్నదని వెంటనే ప్రభుత్వం కార్డులు అర్హులైన వాళ్ళందరికీ అందించి ఇచ్చిన హామీలను అమలు చేసి అభివృద్ధి పరచాలని కోరారు.
వ్యవసాయ కార్మికులకు కనీస వేతనం అమలుకు ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. రైతులకు వ్యవసాయ రుణాలు బ్యాంకులు అందించే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆశా వర్కర్ గ్రామపంచాయతీ కార్మికులు తదితర కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే విడుదల చేసి కార్మికుల సమస్యలను పరిష్కరించాలన్నారు. అనంతరం సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు తాళ్లపల్లి కృష్ణ మాట్లాడుతూ పార్టీ సభ్యులందరికీ రాజకీయ విద్య కల్పించడానికి ఈనెల 25, 26న చిన్నగోపతిలో జరుగు మండల స్థాయి రాజకీయ



శిక్షణ తరగతులకు సభ్యులు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి చెరుకుమల్లి కుటుంబరావు, మండల నాయకులు మోత్కూరి వెంకటేశ్వరరావు, డా.బోయినపల్లి శ్రీనివాసరావు, చింతపల్లి ప్రసాద్, రోషన్ బేగ్, లింగాల చిన్న దానయ్య, జొన్న బోయిన అంజయ్య, తాళ్లపల్లి విజయ, యరమల మాధవరెడ్డి, తాత వెంకయ్య బొమ్మగాని భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

పరుచూరి మురళి తల్లి మృతికి మంత్రి పొంగులేటి నివాళి

నవతెలంగాణ-ఖమ్మం

సీనియర్ కాంగ్రెస్ నాయకులు పరుచూరి మురళి తల్లి మృతి చెందడం పట్ల తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి విచారం వ్యక్తం చేశారు. నగరంలోని బైపాస్ రోడ్డులో గల వారి నివాసంలో ఆమె మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆత్మకు శాంతి కలగాలని దేవుణ్ణి ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, రాష్ట్ర విద్యాసంక్షేమ, మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ చైర్మెన్ మువ్వా విజయబాబు, కార్పొరేటర్ దొడ్డా నగేష్, మిక్కిలినేని నరేంద్ర, కొప్పెర ఉపేందర్, బాణాల లక్ష్మణ్, బోడా శ్రావణ్, షేక్ ఇమామ్, ఉమ్మినేని కృష్ణ, కాంపాటి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను అమలు చేయాలి

- కౌలు రైతులకు రైతు భరోసా ఇవ్వాలి
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బొంతు రాంబాబు
- పార్టీ వైరా పట్టణ సభ్యుల రాజకీయ క్లాసులు ప్రారంభం

నవతెలంగాణ-వైరాటౌన్

సీపీఐ(ఎం) పట్టణ పార్టీ సభ్యులకు రాజకీయ శిక్షణా తరగతులు స్థానిక మధు విద్యాలయంలో జరుగుతున్నవి. మంగళవారం జరిగిన రాజకీయ క్లాసులకు పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు చింతనిప్పు చలపతిరావు ప్రిన్సిపాల్‌గా వ్యవహరించారు. ఉదయం పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బొంతు రాంబాబు వర్తమాన రాజకీయాలు బోధించారు. నేడు అధికారం దక్కించుకొనే విధంగా దేశ రాజకీయాలు ఉన్నాయని, అధికారం కోసం ప్రజాసమస్యలు గాలికి వదిలేశారని, ఎన్నికలో గెలుపు కోసం ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. భారత వ్యవసాయ రంగం సంక్షోభంలోకి నెట్టివేయ బడుతుందని, వాతావరణంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా పెరుగుతున్న వేడి వల్ల వ్యవసాయ పంటల దిగుబడులు తగ్గిపోతున్నాయని, పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు చట్టబద్ధత కల్పించాలని అన్నారు. అధికారంలోకి వచ్చిన



ప్రభుత్వాలు వెంటనే ఎన్నికలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. మధ్యాహ్నం మతం-మతోన్మాదం క్లాసు వైరా స్టడీ సర్కిల్ కన్వీనర్ బోడపట్ల రవీందర్ బోధించారు. బీజేపీ ప్రభుత్వం ప్రజల మధ్య మత విద్వేషాలను పెంచుతుందని, లౌకిక రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీస్తుందని అన్నారు. ఈ క్లాసుల్లో పార్టీ వైరా పట్టణ కార్యదర్శి సుంకర సుధాకర్, మల్లెంపాటి రామారావు, బొంతు సమత, హరి వేంకటయ్య, అనుమోలు రామారావు, రాచబంటి బత్తిరన్న, సంక్రాంతి నరసయ్య, గుడిమెట్ల మోహన్ రావు, గుమ్మా నరసింహారావు, శాఖా కార్యదర్శులు, పార్టీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

కూసుమంచి : ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని కూసుమంచి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాయల వీరాస్వామి అన్నారు. మంగళవారం మండలంలోని కూసుమంచి,నాయకన్ గూడెం, భగత్ వీడు తండా, రాజుపేట గ్రామాలలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఎస్‌డి నూర్జహాన్, అనిత, అనురాధ, సీఆర్పి వడ్లమూడి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.





జిల్లా పరిషత్ ఇన్‌చార్జీ సీఈఓగా కె.చంద్రశేఖర్

నవతెలంగాణ-కొత్తగూడెం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిషత్ ఇన్‌చార్జి సీఈఓగా నూతనంగా బాధ్యతలు తీసుకున్న కె.చంద్రశేఖర్‌ని జడ్పీ చైర్మెన్ కంచర్ల చంద్రశేఖర్ రావు అభినందనలు తెలిపారు. జిల్లా పరిషత్ సీఈఓ ప్రసూన రాణి బదిలీపై వెళ్లిన కారణంగా డిప్యూటీ సీఈఓ కె.చంద్రశేఖర్‌కి ఇన్‌చార్జ్ సీఈఓగా బాధ్యతలు అప్పగిస్తూ కలెక్టర్ ప్రియాంక అలా మంగళవారం ఉత్తర్వులు జారీ చేసినందున, కే.చంద్రశేఖర్ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా జడ్పీ చైర్మెన్‌ని వారి చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఈఓకు జెడ్పీ చైర్మెన్ కంచర్ల చంద్రశేఖర రావు అభినందనలు తెలిపారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే ఆరోగ్యం మన వెంటే

- స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ కార్యక్రమంలో డీవీ

నవతెలంగాణ-ఇల్లందు



మన పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే ఆరోగ్యం మన వెంటేనని మున్సిపల్ చైర్మెన్ దమ్మాలపాటి వెంకటేశ్వర రావు అన్నారు. మంగళవారం తెల్లవారు జామునే స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. పారిశుద్ధ్య కార్మికులతో పట్టణ ప్రధాన రహదారి ఇరువైపుల చెత్తను దగ్గరుండి తొలగింప చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మన పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని తెలిపారు. మన పరిసరాలు అంత పరిశుభ్రంగా ఉంచేలా చూసుకోవాలని సూచించారు. రానున్నది వర్షాకాల నేపథ్యంలో పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే మనం అనారోగ్యాల భారిన పడకుండా ఉంటామని తెలిపారు. చెత్తను ఎవరు కూడా బయట వేయొద్దని మున్సిపల్ వాహనాల్లోనే చెత్తను వెయ్యాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఇన్స్పెక్టర్ సిహెచ్ శ్రీను, జవాన్లు అంజద్, తదితరులు పాల్గొన్నారు.





పిచ్చికుక్క దాడిలో బాలికకు తీవ్రగాయాలు

నవతెలంగాణ-ఆళ్ళపల్లి

పిచ్చికుక్క దాడిలో బాలికకు తీవ్రగాయాలైన ఘటన ఆళ్ళపల్లి మండలంలో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం..మండల పరిధిలోని చింతోళ్లగుంపు గ్రామానికి చెందిన తోలెం సారయ్య-కళావతి దంపతుల కూతురు మనోజ్ఞ (11) తన తల్లిదండ్రులతో కలిసి మంగళవారం మధ్యాహ్నం ఇంట్లో టీవీ చూస్తూ అందరూ నిద్రపోయారు. అదేసమయంలో ఓ పిచ్చికుక్క ఇంట్లోకి వచ్చి మనోజ్ఞపై దాడి చేసింది. నిద్రనుండి లేచి మనోజ్ఞ బిగ్గరగా అరవడంతో తన తల్లిదండ్రులకు మెళుకువ వచ్చి చూసే లోపే పిచ్చికుక్క మనోజ్ఞ కుడి కాలుపై రెండు సార్లు దాడి చేయడంతో కాలుకి కుక్క పంటి గాట్లు పది చోట్ల లోతుగా పడ్డాయి. దాంతో తల్లిదండ్రులు బాలికను ఆళ్ళపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. తదనంతరం వైద్య సిబ్బంది సూచనల మేరకు మెరుగైన వైద్యం కోసం కొత్తగూడెం తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు మనోజ్ఞకు వైద్యం అందించి, తగిన మందులు ఇచ్చి తిరిగి ఇంటికి పంపారని, కూతురి ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగా ఉందని తండ్రి సారయ్య తెలిపారు. పిచ్చికుక్కల దాడిని అరికట్టేందుకు స్థానిక సంబంధిత అధికారులు, సిబ్బంది తగిన చర్యలు తీసుకోవాలని మనోజ్ఞ తల్లిదండ్రులు, చింతోళ్లగుంపు గ్రామస్తులు కోరుతున్నారు.

ఇంటి నిర్మాణాలకు రూ.5లక్షలు ఇచ్చే విధంగా కౌన్సిల్‌లో తీర్మానాన్ని ప్రవేశపెట్టండి

నవతెలంగాణ-కొత్తగూడెం

కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని పాత కొత్తగూడెంలో ప్రభుత్వం 807 మంది పేద లబ్దిదారులకు స్థలాలు ఇచ్చింది. లబ్దిదారులు ఇంటి నిర్మాణాలకు వారికి మొదటి విడతలోనే ఎలాంటి డ్రా లేకుండా అందరికీ ఒకేసారి ఇంటి నిర్మాణం కోసం రూ.5 లక్షలు ఇచ్చేందుకు, మున్సిపల్ బడ్జెట్ నుంచి నూతన కాలనీ అయిన వెన్నెల నగర్ అభివృద్ధి, తాగు నీటి, రోడ్లు, డ్రయినేజీలు ఇతర మౌళిక సదుపాయాల కోసం నిధులు మంజూరుకు పాలకవర్గంలో తీర్మానం చేయాలని చేసేందుకు సేవ్ కొత్తగూడెం...సేవ్ మున్సిపాలిటీ నాయకులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఆ తీర్మానానికి ప్రవేశ పెట్టి మున్సిపల్ వార్డుల్లో స్థలాలు పొందిన లబ్దిదారుల మీద ప్రేమను చాటుకోవాలన్నారు.

యల్లంకి అనసూర్యమ్మ మృతి పట్ల సంతాపం

నవతెలంగాణ-జూలూరుపాడు



జూలూరుపాడు గ్రామపంచాయతీ చెందిన కాంగ్రెస్ పార్టీ మండల సీనియర్ నాయకులు యల్లంకి పుల్లయ్య తల్లి యల్లంకి అనసూర్యమ్మ మృతి చెందగా విషయం తెలుసుకున్న ఉమ్మడి ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సొసైటీ చైర్మెన్ లేళ్ల వెంకటరెడ్డి మంగళవారం వారి ఇంటికి వెళ్లి వారి కుటుంబాన్ని పరామర్శించి, వారి పార్థివ దేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మాలోత్ మంగీలాల్ నాయక్, వెంగన్నపాలెం ఎంపీటీసీ దుద్దుకూరి మధుసూదరావు, నున్న రంగారావు, సాయిల కృష్ణయ్య, నున్న కృష్ణయ్య యల్లంకి చిన్న నాగేశ్వరావు, మాసినేని సత్యం, సోషల్ మీడియా అధ్యక్షుడు నవీన్ రాథోడ్, రామిశెట్టి నాగేశ్వరావు, మోదుగు రామకృష్ణ, ఎస్కే మైబు, మాదుగుల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

4వ మహాసభను జయప్రదం చేయండి

నవతెలంగాణ-టేకులపల్లి



ఈ నెల 14న భారత కార్మిక సంఘాల సమాఖ్య ఇఫ్టూ ఏరియా మహాసభ టేకులపల్లిలో నిర్వహించనున్నట్టు, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆ సంఘం నాయకులు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆటో మోటార్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పాయం వెంకన్న, జిల్లా నాయకులు జరుపుల సుందర్‌లు మాట్లాడారు. తమ సంఘం సంఘటిత, అసంఘటిత రంగ కార్మికుల హక్కుల కోసం నిరంతరంగా పోరాడుతుందని, వారి తరపున నిజాయితీగా పనిచేస్తుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలపై జరిగిన పోరాటంలో ముందు భాగాన నిలిచిందన్నారు. సింగరేణి హమాలి, ఆటో మోటార్స్ వర్కర్ల, గ్రామపంచాయతీ, మధ్యాహ్న భోజనం, ఆశ వర్కర్ల, అంగన్వాడీ తదితర రంగాల కార్మికుల తరపున నిరంతరం పోరాడుతున్నామన్నారు. ఈ మహాసభలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ వెంకటేశ్వర్లు, ధనసరి భద్రం, కల్తీ వీరస్వామి, సైదులు, అన్వేష్, ప్రశాంత్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

బోర్ పనులు ఆపొద్దని కౌన్సిలర్ నిరసన

నవతెలంగాణ-కొత్తగూడెం టౌన్



కొత్తగూడెం మున్సిపాలిటీ 13 వార్డులో బోర్ పనులు ఆపివేయడంపై ఆ వార్డు కౌన్సిలర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానికులు కౌన్సిలర్ వనచర్ల విమలతో కలసి బోర్ వెల్ వాహనం ముందు నిరసన తెలిపారు. బోర్ 20 అడుగులు వేసిన తర్వాత మున్సిపల్ డీఈ పనులు ఆపేయమన్నారంటూ కాంట్రాక్టర్ బోర్ పనులు నిలిపివేయడం పట్ల స్థానికులు ఆగ్రహం తెలిపారు. మున్సిపాలిటీలో ప్రతి వార్డులో మంచినీటి కొరత తీర్చేందుకు బోర్‌లు వేస్తుంటే తమ వార్డులో ఇలా అడ్డుకోవడం ఏమిటని ఎమ్మెల్యే, మంత్రి, కలెక్టర్ కలుగుచేసుకుని తమ వార్డులో పనులు ఆగకుండా చూడాలని వారు కోరారు.

6 గ్యారెంటీలు వెంటనే అమలు చేయాలి

- రైతు భరోసా పథకం కింద సంవత్సరానికి రూ.15 వేలు ఇవ్వాలి
- తక్షణమే పోడు హక్కుపత్రాలు ఇవ్వాలి
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి కనకయ్య

నవతెలంగాణ-ములకలపల్లి



ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గారంటీల పథకాలను వెంటనే అమలు చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండల పరిధిలోని మాదారం గ్రామంలో పార్టీ మండల స్థాయి శిక్షణ తరగతులలో ఆయన పాల్గొని మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ ముగిసిన నేపథ్యంలో ప్రభుత్వం తక్షణమే ఆరు గ్యారంటీల పథకాలపై దృష్టి పెట్టి ఆరు గారంటీల పథకాలు పేదలందరికీ అందేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రజలు గ్రామసభలలో దరఖాస్తులు చేసుకున్నప్పటికీ అధికారుల నిర్లక్ష్యం వల్ల దరఖాస్తులు తిరస్కరణకు గురికావడంతో ప్రస్తుత ఇస్తున్న పథకాలు లబ్దిదారులు అందక ప్రజలు ప్రభుత్వ ఆఫీసుల వద్ద పడి కాపులు కాస్తున్నారని అన్నారు. రెండు లక్షల రుణమాఫీ తక్షణమే మాఫీ చేసి రైతులకు కొత్త రుణాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతు భరోసా పథకం కింద రైతులకు ఎకరానికి సంవత్సరానికి రూ.15 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత పాలకులు స్థానిక సంస్థలను నిర్వీర్యం చేశారని అభివృద్ధిలో ఆమడ దూరంలో వుంచారని స్థానిక సంస్థలకు నిధులు కేటాయించి గ్రామ సీమలను అభివృద్ధి చేయాలని అన్నారు. ధరణిలో పెండింగ్లో ఉన్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించి కొత్త పట్టాదారు పాసు పుస్తకాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సర్వే చేసి పోడు భూములకు పట్టాలు రాని పోడు భూములకు వెంటనే హక్కు పత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో క్లాసులకు టీచర్‌గా పార్టీ జిల్లా కమిటీ సభ్యులు అన్నవరపు సత్యనారాయణ వ్యవహరించారు. రేపాకుల శ్రీనివాస్, కొండబోయిన వెంకటేశ్వర్లు, పార్టీ మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు, వూకంటి రవికుమార్, గౌరీ నాగేశ్వరరావు, పోడియం వెంకటేశ్వర్లు, మాలోతు రావూజా, నిమ్మల మధు, ఆదినారాయణ, పద్దం తిరుపతమ్మ, బుగ్గ వెంకట నరసమ్మ, వర్సా శ్రీరాములు, మంచాల సారయ్య, కీసర వెంకట్రావు, గోపగాని లక్ష్మీ నరసయ్య, భైరు ప్రసాద్, బేతి అమల, తదితరులు పాల్గొన్నారు.

నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలి

- డాక్టర్ ప్రియాంక

నవతెలంగాణ-అన్నపురెడ్డిపల్లి



వర్షాకాలం సీజన్ ప్రారంభం కావడంతో మండల ప్రజలు ఆరోగ్యం దృష్ట్యా వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని డాక్టర్ ప్రియాంక అన్నారు. మంగళవారం మండల పరిధిలోని పలు గ్రామాల్లో యర్రగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ ప్రియాంక ఆధ్వర్యంలో డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించారు. పలు ఇళ్ళలో నీటి నిల్వ వున్న తోట్టిలును పరిశీలించి నీళ్ళు లేకుండా చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాకాలం ఇంటి ఆవరణంలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, నీరు నిల్వ ఉండటం వలన దోమలు పెరిగి డెంగ్యూ, మలేరియా వంటి విష జ్వరాలు వచ్చే అవకాశం ఉంటుంది అని మండల ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలని అన్నారు. వర్షాకాలం కాచి చల్లార్చిన నీళ్ళు తాగలని ఆహార పదార్థాలు కూడా వేడిగా వున్నప్పుడే తినాలని అన్నారు. ఏదైనా ఆరోగ్య సమస్యలు ఉంటే వెంటనే ఆరోగ్య కేంద్రానికి వచ్చి తగిన పరీక్షలు చేయించుకోవాని అన్నారు. ఈ కార్యక్రమంలో పూలమ్మ, హెచ్ఈఓ కృష్ణయ్య, హెచ్‌వి శారారాణి, రామదాసు, జ్యోతి ఆశావర్కర్ల పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి

- ఎంపీడీవో కార్యాలయం ఎదుట సీపీఐ(ఎం) ధర్నా

నవతెలంగాణ-ఇల్లందు



పట్టణానికి కూతవేటు దూరంలో ఉన్న సీఎస్పీ బస్తీలోని దేవులపల్లి యాకయ్య, సున్నం రాజయ్య నగర్లలో తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నారని సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఎదుట గుడిసె వాసులతో ధర్నా నిర్వహించారు. మండల పరిషత్ సూపరిండెంట్ శ్రీకాంత్‌కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం మన్యం మోహన్ రావు అధ్యక్షతన జరిగిన సమావేశాల్లో పార్టీ మండల కార్యదర్శి అబ్దుల్ నబి పాల్గొని మాట్లాడారు. గత ఐదు సంవత్సరాలుగా సీఎస్పీ బస్తీలోని దేవులపల్లి యాకయ్య సున్నం రాజయ్య నగర్‌లలో గుడిసెలు వేసుకొని నివసిస్తున్న పేదలకు తాగునీరు అందించడంలో మండల అధికారులు విఫలం చెందారన్నారు. గత ఐదు సంవత్సరాలుగా మండల పరిషత్ సమావేశాలలో సైతం విజ్ఞప్తులు చేసుకున్నా ఫలితం దక్కలేదని అన్నారు. గుడిసె వాసులకు తాగు నీరు కరెంటు, మౌలిక సదుపాయాలు లేవని ఇప్పటికైనా మండల అధికారులు ఈ సమస్యను పరిష్కరించకపోతే భవిష్యత్తులో ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. మండల పార్టీ నాయకులు ఆలేటి కిరణ్ కుమార్, తాళ్లూరి కృష్ణలు మాట్లాడుతూ తిలక్ నగర్ పంచాయతీ లాల్ మహ్మద్ నగర్‌లో సైతం తాగునీటి ఎద్దడి ఉన్నదని అన్నారు. ఈ ధర్నాలో దారావత్ రాందాస్, హుస్సేన్, వెంకన్న, వీరస్వామి, సుజాత, కౌసల్య, కోటమ్మ, నీలారాణి, భవాని, హాబీబున్నిస, మలేఖా, రేష్మా జ్యోతి, నాగమణి, లక్ష్మీ, మంగ, కల్తి మహేశ్వరి, ఆనంద్, ప్రసాద్, సరిత, సుగుణ, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

రెడ్ క్రాస్ సొసైటీ సేవలు సద్వినియోగపరచుకోండి

- మారుమూల గిరిజన గ్రామాలలో 92 ఆరోగ్య వైద్య శిబిరాలు
- జిల్లా కో ఆర్డినేటర్ డా.ఎస్.ఎల్.కాంతారావు

నవతెలంగాణ-చర్ల



ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సేవలు సద్వినియోగపరుచుకోవాలని జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.ఎల్.కాంతారావు తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని భూరుగుపాడు గిరిజన గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించి 62 మందికి మందులు పంపిణీ చేసినట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మారుమూల గిరిజన గ్రామాల ఆదివాసీలకు ఇంటి వద్దనే వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ప్రధానంగా వయోవృద్ధులు, వికలాంగులకు సహాయం కోసం కలెక్టర్ ప్రియాంక ఆలా, జిల్లా వైద్య శాఖ అధికారి జె.వి.యల్ శిరీష, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర కార్యదర్శి కె.మదన్ మోహన్, రాష్ట్ర ప్రోగ్రాం ఇన్‌చార్జి స్వర్ణలత వారి నిర్దేశంతో మొబైల్ మెడికల్ కేర్ యూనిట్ ద్వారా ఈ వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అదేగ్రామంలో 22 కుటుంబాలకు టార్పలిన్స్‌ను, వారి గుడేశాల పైకప్పు కప్పుట కోసం అందజేశామన్నారు. ఆది నుండి ఇప్పటి వరకు నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాలలో 5870 మందికి వైద్య సహాయం అందించి మందులు పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. గర్భిణీలకు తలసీమియా, సికెల్ సెల్ అనీమియా వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించినట్లు, డయాబెటిక్స్, హైపర్ టెన్షన్ వ్యాధుల సర్వే నిర్వహించగా, 260 మందికి షుగర్, 280 మందికి హైపర్ టెన్షన్‌తో బాధపడుతున్నట్లుగా ఆయన పర్యవేక్షణలో తేలిసిందన్నారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ భద్రాచలం ఆధ్వర్యంలో మారుమూల గిరిజన గ్రామాలైన చర్ల, పర్ణశాల, నర్సాపురం, దుమ్ముగూడెం, దమ్మపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో నేటివరకు 92 ఆరోగ్య వైద్య శిబిరాలు నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వి.కామేశ్వరావు, వై.సూర్యనారాయణ, జి.రాజారెడ్డి, డాక్టర్ సందీప్, డాక్టర్ చంద్ర ప్రసాద్, డాక్టర్ భాను ప్రసాద్, డాక్టర్ పుల్ల రెడ్డి, డాక్టర్ రేణుక రెడ్డి, డాక్టర్ సుభాష్, బోధనెల్లి సర్పంచ్ మాడవి సంధ్య ,హెల్త్ అసిస్టెంట్ వరప్రసాద్, రవి, ఆది, మారుతీ నర్సింగ్ కాలేజీ, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

సింగరేణిలో డిపెండెంట్ల గరిష్ట వయో పరిమితి 35 నుంచి 40 ఏండ్లకు పెంపు

- 2018 మార్చి నుండి వర్తింపు
- సింగరేణి సంస్థ చైర్మెన్ అండ్ ఎండీ ఎన్.బలరామ్

నవతెలంగాణ-కొత్తగూడెం



సింగరేణిలో కారుణ్య ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల వయో పరిమితి 35 సంవత్సరాలు దాటి ఉద్యోగ అవకాశాన్ని కోల్పోతున్న వారికి యాజమాన్యం తీపి కబురు అందించింది. కారుణ్య నియామకాల్లో గరిష్ఠ వయో పరిమితిని 35 ఏళ్ల నుంచి 40 ఏళ్లకు పెంచుతూ సింగరేణి యాజమాన్యం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు సోమవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేసినట్టు సంస్థ చైర్మెన్ అండ్ ఎండీ ఎన్.బలరామ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దాదాపు దశాబ్దాలుగా వయో పరిమితి నిబంధన వల్ల వందలాది మంది అభ్యర్థులు ఉద్యోగ అవకాశాలను అందుకోలేకపోయారని, సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ అంశంపై సానుకూల నిర్ణయం తీసుకోవాలని ఇటీవల బదిలీ వర్కర్లకు అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఇస్తున్న సమయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సూచించారని తెలిపారు. ఈ విషయంపై కూలంకశంగా చర్చించి సింగరేణి బోర్డు ఆఫ్ డైరెక్టర్ల సమావేశంలో ఒప్పించి సానుకూల నిర్ణయం తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. 2018 మార్చి 9వ తేదీ నుండి ఈ గరిష్ఠ వయోపరిమితి సడలింపు స్కీంను వర్తింపజేస్తున్నామని తెలియజేశారు. దీనివల్ల 2018 నుంచి ఉద్యోగం కోసం ఎదురు చూస్తున్న దాదాపు 300 మందికి తక్షణమే ప్రయోజనం చేకూరనుందన్నారు. అలాగే రానున్న రోజుల్లోనూ మరింత మందికి లబ్ధి చేకూరుతుందని తెలిపారు. గరిష్ఠ వయో పరిమితి దాటిన వాళ్ళు సింగరేణిలో ఉద్యోగం పొందడం కోసం దొంగ ధృవీకరణ పత్రాలతో తప్పుడు మార్గాలను ఆశ్రయించడం జరుగుతోందని, దాని వల్ల విజిలెన్స్ కేసులను ఎదుర్కోవడంతోపాటు వారికి వచ్చే అన్ని బెనిఫిట్స్‌ను కోల్పోతున్నారని తెలిపారు. ఈ వయో పరిమితి పెంపు వల్ల తప్పుడు మార్గాలను ఆశ్రయించబోరని, కార్మిక కుటుంబాలకు మేలు జరుగుతుందని పేర్కొన్నారు.

అర్హులకు వెంటనే ఉద్యోగాలు : చైర్మెన్ బలరామ్

40 ఏళ్లకు సవరించబడిన ఉత్తర్వుల ప్రకారం అర్హులైన వారికి వెంటనే ఉద్యోగాలు కల్పించడం జరుగుతుందని సంస్థ చైర్మెన్ ఎన్.బలరామ్ తెలిపారు. 2018 మార్చి 9వ తేదీ నుండి ఈ స్కీం అమల్లోకి వస్తుందన్నారు. దీనికోసం సంబంధిత ఏరియాలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అయితే ఇప్పటికే ఉద్యోగానికి బదులు ఏక మొత్తం సొమ్ము తీసుకున్న వారికి కానీ, అర్హులైన వేరే వారసునికి ఉద్యోగం పొందినవారు కానీ ఈ కొత్త సవరణ ప్రకారం తిరిగి ఉద్యోగం పొందే అవకాశం లేదని స్పష్టం చేశారు. ఇప్పటి వరకు పాత గరిష్ఠ వయోపరిమితి నిబంధన ప్రకారం ఉద్యోగం పొందలేని, ఎటువంటి సెటిల్మెంట్ జరగని కేసులకు మాత్రమే ఈ కొత్త స్కీం అమలవుతుందని పేర్కొన్నారు.

టేకులపల్లి : సింగరేణి డిపెండెంట్ వయస్సు 35 నుంచి 40 సంవత్సరాలకు పెంచినట్టు సింగరేణి యాజమాన్యం సర్క్యులర్ జారీ చేయడం పట్ల ఏఐటీయూసీ నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నట్టు మంగళవారం తెలిపారు. మండలంలోని కోయగూడెం ఓపెన్ కాస్ట్‌లో ఉదయం షిఫ్ట్‌లో ఫిట్ మీటింగ్ ఆ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించినట్టు తెలిపారు. ఈ సమావేశంలో బ్రాంచ్ సహాయ కార్యదర్శి కొంగర వెంకటేశ్వర్లు మాట్లాడారు. వయస్సు పెంపుదల విషయంలో వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఏఐటీయూసీ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, జనరల్ సెక్రెటరీ కొరిమి రాజ్ కుమార్‌లకు సమావేశంలో కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర గిరిజన సమాఖ్య జిల్లా ఉపాధ్యక్షులు గుగులోత్ కృష్ణ, ఫిట్ సహాయ కార్యదర్శులు బానోత్ బాలాజీ, షేక్ సర్వర్, వర్క్మెన్ ఇన్స్పెక్టర్ జీఎ శ్రీనివాస్, సామల శ్రీనివాస్, వేంకపనరస్య, రవి, కాలేపుల్లయ్య, సీతారాములు, రామకృష్ణ చారి తదితరులు పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీ నాయకుల హర్షం

మణుగూరు: సింగరేణి వారసత్వ ఉద్యోగుల వయోపరిమితి పెంపు సర్క్యులర్ విడుదలపై ఐఎన్‌టీయూసీ ఏరియా ప్రాతినిధ్య సంఘం నాయకుల సంతోషం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, సింగరేణి సీఎండీ బలరాంకి, ఐఎన్‌టీయూసీ నాయకులు జనక్ ప్రసాద్‌కి కృతజ్ఞతలు తెలిపారు. ఆదేశాలు విడుదలపై మణుగూరు ఏరియా బ్రాంచ్ కమిటీ ఉపాధ్యక్షులు వత్సవాయి కృష్ణంరాజు, ప్రధాన కార్యదర్శి సిల్వేరు గట్టయ్య యాదవ్‌లు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వత్సవాయి కృష్ణంరాజు, సిల్వేరు గట్టయ్య యాదవ్, సూరపాక రాములు, షేక్ మస్తాన్, మిద్దెపాక శ్రీనివాస్, జయరాజు తదితరులు పాల్గొన్నారు.



భావితరాలకు భరోసా ప్రభుత్వ బడులు

- కాంప్లెక్సు హెచ్‌ఎం హరిత

నవతెలంగాణ-అశ్వారావుపేట

భావితరాలకు విద్యాపరంగా భరోసా కల్పించేది ప్రభుత్వ బడులేనని అశ్వారావుపేట కాంప్లెక్స్ హెచ్‌ఎం పి.హరిత అన్నారు. అశ్వారావుపేట కాంప్లెక్సు పరిధిలోని వివిధ పాఠశాలల్లో నిర్వహిస్తున్న బడిబాట పి.హరిత మంగళవారం పరిశీలించారు. నెహ్రూనగర్, బీసీ కాలనీలలో నిర్వహించ బడుతున్న బడిబాట సమీక్షా సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ బడులలో ఎన్నో అవకాశాలు కల్పించ బడుతున్నాయి అని, ప్రయివేటు పాఠశాలల్లో కూడా లేని విధంగా ప్రభుత్వ బడులలో డిజిటల్ తరగతులు నిర్వహించబడుతున్నాయి అన్నారు. నైపుణ్య తరగతులు నిర్వహిస్తున్నారని, సైన్స్ ల్యాబ్, గ్రంథాలయాలను ఉన్నతంగా ఆధునీకరించి విద్యార్థులకు అందుబాటులోకి తెచ్చారని, వీటిని వినియోగించుకొని పిల్లల భవిష్యత్తుకు భరోసా ఇవ్వాలని తల్లిదండ్రులను కోరారు. అనంతరం విద్యార్థులు ఇళ్లకు వెళ్లి పాఠశాల కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బేబి పద్మ, శ్రీనివాసరావు, కట్టా శ్రీను, హరిబాబు, వెంకటేశ్వర్లు, సీఆర్‌పీ ప్రభాకరాచార్యులు, తదితరులు పాల్గొన్నారు.



రోటరీ క్లబ్ ఆఫ్ ఆధ్వర్యంలో టాయిలెట్ బ్లాక్ శంకుస్థాపన

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

భద్రాచలం స్థానిక గర్ల్స్ హై స్కూలు భద్రాచలం నందు రోటరీ క్లబ్ అధ్యక్షురాలు మహాలక్ష్మి ఆధ్వర్యంలో రోటరీ క్లబ్ భద్రాచలం, లేక్ డిస్ట్రిక్ట్ మొయినాబాద్ వారి సంయుక్తంగ నిర్మిస్తున్న టాయిలెట్ బ్లాక్ శంకుస్థాపన మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ మల్లాది వాసుదేవ్ హాజరయ్యారు. వాసుదేవ్ మాట్లాడుతూ.. భద్రాచలం క్లబ్ ఏజెన్సీ ప్రాంతంలో అనేక మంచి కార్యక్రమాలు చేస్తోంది దానిలో భాగంగానే రూ.8 లక్షలతో ఈ టాయిలెట్ బ్లాక్ నిర్మించటం జరుగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గర్ల్స్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు రమ, ప్రోగ్రాం చైర్మెన్ మునికేశవ్, కార్యదర్శి రాజశేఖర్, కోశాధికారి విద్యాసాగర్, పాస్ట్ ప్రెసిడెంట్స్ యశోద రాంబాబు, బ్రహ్మారెడ్డి, జకరయ్య, నాగేశ్వరరావు, వసంతరావు, ప్రెసిడెంట్ ఎలెక్ట్ బాలాజీ, అజీమ్, భద్రం, వంద వాసు, వరలక్ష్మి, విక్టోరియా, సీతారామరాజు, చలపతి, హర్షద్, బిల్డర్ ఆంజనేయులు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



గిరిజన కార్మికుల ఆకలి బాధలు తీర్చండి

- 17 నెలల బకాయి జీతాలు చెల్లించండి
- సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కే.బ్రహ్మాచారి
- మంత్రి పొంగిలేటికి సీఐటీయూ వినతి

నవతెలంగాణ-పాల్వంచ

గిరిజన సంక్షేమ శాఖ పోస్ట్ మెట్రిక్ హాస్టల్స్‌లో పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ కార్మికుల ఆకలి బాధలు తీర్చాలని సీఐటీయూ డిమాండ్ చేసింది. 17 నెలల బకాయి వేతనాలు చెల్లించాలని కోరుతూ కలెక్టరేట్‌కి వచ్చిన రెవెన్యూ శాఖ మంత్రి పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డికి సీఐటీయూ గిరిజన సంక్షేమ శాఖ పోస్ట్ మెట్రిక్ హాస్టల్ ఔట్సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కే.బ్రహ్మాచారి మాట్లాడారు. 17 నెలలుగా వేతనాలు లేక కార్మికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని, వేతనాలకు కావలసిన బడ్జెట్ వెంటనే విడుదల చేయించాలని మంత్రిని కోరారు. జీవో నెంబర్ 60 ప్రకారం రూ.15600 వేతనం చెల్లించాలని కోరారు. క్యాటరింగ్ విధానాన్ని రద్దు చేయించి, రాష్ట్ర ప్రభుత్వ ఔట్సోర్సింగ్ జీవో ప్రకారం నేరుగా కార్మికుల ఎకౌంట్లో జీతాలు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. సమస్యలపై స్పందించిన మంత్రి సాధ్యమైనంత తొందరగా బడ్జెట్ విడుదల చేయిస్తానని, సమస్యలు పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చినట్టు వారు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో సీఐటీయూ జిల్లా నాయకులు జి.పద్మ, రవి, కె.సత్య, హాస్టల్ ఔట్సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు జయ, రామ, తిరుపతమ్మ అనిత, దుర్గ, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి : సీఐటీయూ

- మధ్యాహ్న భోజన కార్మికుల మండల నూతన కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-దమ్మపేట



మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్ బిల్లులు, వేతనాలు, గుడ్ల బిల్లులు వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్ డిమాండ్ చేశారు. మంగళవారం మండలపల్లి సుందరయ్య భవన్‌లో మధ్యాహ్న భోజన కార్మిక సంఘం మండల మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా అర్జున్ మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులకు వంట నిర్వహణకు కట్టెలకు గాని, గ్యాస్‌కు గాని ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని, ఈ పరిస్థితుల్లో వంట కార్మికులకు గ్యాస్ బిల్లులు, కట్టెల బిల్లులు తడిసి మోపెడవుతున్నాయని అన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభం అవుతున్నప్పటికీ గత సంవత్సరం పెండింగ్ బిల్లులు నేటికీ విడుదల చేయకపోవడం దుర్మార్గమని ఇలాంటి పరిస్థితుల్లో మరల వంట నిర్వహణ ఎలా చేస్తారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం హామీ మేరకు మధ్యాహ్నం భోజన కార్మికులకు రూ.10 వేల వేతనం ఇవ్వాలని, ప్రస్తుతం పనిచేసే కార్మికులను తొలగించకుండా గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని, రెండు జతల కాటన్ చీరలు ఇవ్వాలని, గ్యాస్‌కు, కోడిగ్రుడ్లకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించి అందచేయాలని డిమాండ్ చేశారు.

మండల నూతన కమిటీ ఎన్నిక

మధ్యాహ్న భోజన కార్మిక సంఘం మండల అధ్యక్షురాలిగా సున్నం ఈశ్వరమ్మ, చాప అరుణ కోశాధికారిగా కుంటా జ్యోతితో పాటు కార్యదర్శి వర్గ సభ్యులుగా మంగ, పోతిని ఈశ్వరమ్మ, వెంకటమ్మ, జయమ్మ కృష్ణవేణి, సత్యవతిలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీలత, సుజాత, చాంద్‌బి, జ్యోతి, మంగ, రైతు సంఘం నాయకులు దొడ్డ లక్ష్మీనారాయణ, మోరంపూడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.




15న ఆయిల్ ఫాం సాగు దారుల రాష్ట్ర సదస్సు

నవతెలంగాణ-అశ్వారావుపేట

ఈ నెల 15వ తేదీ శనివారం ఏఐకేఎస్ అనుబంధ తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో అశ్వారావుపేటలో నిర్వహించే ఆయిల్ ఫాం సాగు దారుల రాష్ట్ర స్థాయి సదస్సును జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర నాయకులు అన్నవరపు సత్యనారాయణ సంఘం శ్రేణులకు, ఆయిల్ ఫాం సాగు దారులకు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సదస్సుకు ఏఐకేఎస్ కేంద్రకమిటీ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్ రావులు హాజరు అవుతారని తెలిపారు. సాగు దారుల సదస్సు అనంతరం ఆయిల్ ఫాం సాగు, యాజమాన్య పద్ధతులుపై ఉద్యాన శాస్త్రవేత్తలు, శాఖ నిపుణులతో అవగాహన శిబిరం ఉంటుందని అన్నారు. ఈ సదస్సులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు టన్ను గెలలుకు కనీస మద్దతు ధర రూ.20 వేలు ఇచ్చే విధంగా, ఆయిల్ ఫాం సాగు కోసం ఆయిల్ ఫెడ్ సాగు దారులకు అందించే రాయితీలు, ఋణం సదుపాయాలు, సాగుపై శాస్త్రీయ అవగాహన, ఉద్యాన శాఖ నిపుణులచే నిశిత పర్యవేక్షణ, ఆయిల్ ఫాం పరిశోధన కేంద్రం ఏర్పాటు దిశగా తీర్మానాలు ఉంటాయని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సాగు దారులు అధిక సంఖ్యలో హాజరై ఈ సదస్సును విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర నాయకులు కొక్కెరపాటి పుల్లయ్య, స్థానిక నాయకులు కొండ బోయిన వెంకటేశ్వరరావు, దొడ్డా లక్ష్మినారాయణ, మోరంపుడి శ్రీనివాసరావు, తగరం జగన్నాథం, కలపాల భద్రంలు పాల్గొన్నారు.

ఆదివాసీ గ్రామాలకు మౌలిక వసతులు ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-మణుగూరు



ఆదివాసీ గిరిజన గ్రామాల మౌలిక సదుపాయాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో మంగళవారం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకి వినతి పత్రం అందజేశారు. ఎస్‌డీ నాసర్ పాషా మాట్లాడారు. పినపాక నియోజకవర్గ పరిధిలోని మణుగూరు, అశ్వాపురం, పినపాక మండలాల్లోని ఆదివాసీ గిరిజన గ్రామాలైన బుగ్గ, ఖమ్మం తోగు, బుడుగుల, రేగుల గండి, రాయన్నపేట, సర్వాయి గుంపు, పెద్దిపల్లి, విప్పల గుంపు, కుమ్మరి గుంపు, మనుబోతుల గూడెం, మామిళ్ళ వాయి, గుండ్ల సాగర్, బండ్ల గుంపు వెంకటాపురం, పిట్టతోగు, రేగళ్ల, సుందరయ్య నగర్, ఉమేష్ చంద్ర నగర్, ఎస్టీ కాలనీ గుంపు, వేగులూరు, సీతా నగర్ తదితర ఆదివాసీ గిరిజన గ్రామాలలో ఈ కింద తెలిపిన అన్ని సమస్యలు ఉన్న గ్రామాలు కొన్నయితే కొన్ని సమస్యలు ఉన్న గ్రామాలు మరికొన్ని ఉన్నాయి, రహదారి సౌకర్యం, విద్యుత్ సౌకర్యం, తాగునీటి సౌకర్యం లేక గిరిజనులు ఆదివాసీలు ఎంతగానో ఇబ్బంది ఇబ్బంది పడుతున్నారని అన్నారు. రహదారి లేక ఈ వర్షాకాలంలో చాలా ఇబ్బంది పడే పరిస్థితి ఉన్నదన్నారు. కొన్ని గ్రామాలలో ప్రాథమిక పాఠశాలలు కూడా లేవు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే తమ గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఆదివాసీలు గిరిజనులు ఎంతో ఆశతో ఎదురుచూస్తున్నారన్నారు. ఎన్నికల కోడ్ కూడా ముగిసింది కనుక పైన తెలిపిన ఆదివాసీ గిరిజన గ్రామాలలో మౌలిక సదుపాయాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం తగు చర్యలు చేపట్టాలని కోరుతున్నాం అన్నారు. అదేవిధంగా వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని గిరిజన గూడేలలో ముందస్తు ఆరోగ్య అవగాహన కార్యక్రమాల నిర్వహణతో పాటు ప్రభుత్వం ఉచిత దోమతెరల పంపిణీకి తగు ఏర్పాట్లు చేయాలని, మణుగూరు ప్రభుత్వ వంద పడకల ఆసుపత్రిలో మెరుగైన వైద్యానికి ఏర్పాట్లు చేయాలని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ ఏరియా అధ్యక్షులు ఏ.మంగీలాల్ పలువురు ఆదివాసీలు పాల్గొన్నారు.

ఏపీ ఈఏపీసీఈటీలో బోటనీ బాలాజీ స్కూల్ విద్యార్థికి స్టేట్ ర్యాంక్

నవతెలంగాణ-దమ్మపేట



తాజాగా వెలువడి ఏపీ ఈఏపీసీఈటీ 2024 ఫలితాల్లో దమ్మపేట బోటనీ బాలాజీ స్కూల్‌లో చదివిన విద్యార్థికి స్టేట్ 91వ ర్యాంక్ సాధించాడు. పాఠశాల పూర్వ విద్యార్థి అయిన నల్లబోతుల భరత్‌తేజకు 91వ ర్యాంకు సాధించి అగ్రగామిగా నిలిచాడు. దీంతో బోటనీ స్కూల్ కీర్తి కిరీటంగా నిలిచింది. ఈ క్రమంలో భరత్ మాట్లాడుతూ 10వ తరగతి వరకూ బోటనీ బాలాజీ స్కూల్ అందించిన ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రం తనకు ఎంతగానో ఉపకరించిందని అన్నారు. ఈ సందర్భంగా భరత్‌ను కరస్పాండెంట్ నర్సన్, పాఠశాల అధ్యాపక బృందం అభినందించింది.

తగ్గిన గెలల దిగుబడి

- ఆందోళనలో రైతులు
- అననుకూల వాతావరణం కారణం
- డాక్టర్ ఎం.వి ప్రసాద్, ప్రధాన శాస్త్రవేత్త, ఐసీఏఆర్, ఐఐఓపీఆర్, పెదవేగి

నవతెలంగాణ-అశ్వారావుపేట

గెలలు ధర తగ్గుముఖం పట్టడంతో పాటు గెలలు దిగుబడులు సైతం తగ్గటంతో ఆయిల్ ఫాం రైతులు ఆందోళన చెందుతున్నారు. ఏటా ఏప్రిల్ నుంచి అక్టోబర్ వరకు ఆయిల్ ఫాం గెలలు దిగుబడులు వస్తుంటాయి. ఈ ఏడాది జూన్ నెల ప్రవేశించినా ఆశించిన మేర గెలలు దిగుబడులు లేవు. పలు క్షేత్రాల్లో చెట్లకు పూత గెలలు సైతం బయట పడకపోవటం గమనించాల్సిన విషయం
వాతావరణంలో మార్పులే కారణమా..?, ఈ ఏడాది రైతులు యాజమాన్య పద్ధతులు సక్రమంగా పాటించ లేదా?, నీటి తడులు విషయంలో తేడాలు ఉన్నాయా? , తెగుళ్ల సోకాయా? అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

ఈ ఏడాది ఏప్రిల్, మే నెలల్లో గెలలు పెద్దగా దిగుబ డులు రావటం లేదని తెలియటంతో రైతుల్లో ఆందోళన రెట్టింపయ్యింది. దీనికితోడు కొంతకాలంగా పట్టిపీడిస్తున్న తెల్లదోమతో దిగుబడి తగ్గిందా అని సందేహిస్తున్నారు. తెల్ల దోమ అధికంగా సోకటం, వేసవిలో అధిక ఎండలు, ఏప్రిల్, మే నెలల్లో వర్షాలు కురవక పోవటం వంటివి కారణాలు అని నిపుణులు అంచనా వేస్తున్నారు. అశ్వారావుపేట పామాంయిల్ పరిశ్రమలో గెలలు క్రషింగ్ ఇంకా మొదలు కాలేదు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో సుమారు 80 వేల ఎకరాల్లో ఆయిల్ ఫాం సాగవుతుండగా..వీటిలో 50 వేల ఎకరాల్లో మాత్రమే దిగుబడులు వస్తున్నాయి. గతేడాది ఏడు నెలలతో పోల్చితే ఈసారి 20,187 టన్నుల గెలలు దిగుబడి తగ్గింది. అయితే గెలలు దిగుబడి తగ్గినప్పటికీ టన్ను గెలలు సరాసరి ధరలో మాత్రం ఏమంత వ్యత్యాసం కనిపించడం లేదు అనేది వాస్తవం.



ఆయిల్ ఫెడ్ ప్రతీ నవంబర్ నుండి అక్టోబర్ వరకు ఆయిల్ ఇయర్‌గా పరిగణిస్తారు. గతేడాది నవంబర్ నుండి ఈ ఏడాది మే వరకు గెలలు దిగుబడి, సరాసరి ధరలు ఈ విధంగా ఉన్నాయి.

సంవత్సరం	గెలలు
22-23	87427
23 - 24	67240
వ్యత్యాసం	20,187
సంవత్సరం	**సరాసరి ధర**
22 - 23	13,837
23 - 24	13,245
వ్యత్యాసం	592

సాధారణ సమయాల్లో ఎకరానికి 8 నుండి 9 టన్నుల గెలలు దిగుబడి వస్తుంది. ఈ ఏడాది అంతకంటే తక్కువగా గెలలు దిగుబడి వస్తుంది.

అధైర్య పడొద్దు : బాలక్రిష్ణ, డివిజనల్ ఆఫీసర్ బాలక్రిష్ణ

అననుకూల వాతావరణంతో గెలలు దిగుబడి తగ్గు ముఖం పట్టింది. అయితే ఈ సీజన్ బదులుగా జూన్, జులై, ఆగస్టు నెలల్లో గెలలు దిగుబడి పెరిగే అవకాశం ఉంది. అందువల్ల రైతులు అధైర్య పడవద్దు.

SNO	MONTH	FFB ARRIVALS (2022-23)	FFB ARRIVALS (2023-24)	Difference (111-Iv)	Price 2022-23	Price 2023-24
1	11	111	1v	v	vi	vii
1	November	19601	17829	1772	13741	12525
2	December	8835	8215	620	13881	12534
3	January	6197	5354	843	13781	12681
4	February	4540	3500	1040	13961	13135
5	March	7275	5290	1985	13943	14174
6	April	13840	9017	4823	14205	14229
7	May	27139	18035	9104	13346	13438
TOTAL		87427	67240	20187	13837	13245

మార్చి, ఏప్రియల్, మే నెలల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ చెలుపు తీయకూడదు



రైతు : జగన్నాథం

గతేడాది కంటే రెండు మూడు టన్నులు తక్కువగా దిగుబడి అవుతున్నాయి. దీనికి తోడు ఏ నెలకు ఆ నెల గెలలు ధర తగ్గుతుంది. వ్యయం పెరిగి గెలలు దిగుబడి, గెలలు ధర తగ్గడంతో సాగు నిర్వహణ భారం అవుతుంది.

: రైతు జగన్నాథం

వాతావరణంలో మార్పులే కారణం :



2021,2022 మార్చి, ఏప్రిల్, మే, జూన్ సంభవించిన వాతావరణ అసమతుల్యత ఏడాది గెలలు దిగుబడి తగ్గుదలకు కారణం అనిపిస్తుంది. ఆ సంవత్సరాల్లో అత్యధిక ఉష్ణోగ్రతలు, గాలిలో తేమ లేక పోవడం కారణంగా నాటి పూత 24 నెలలు నుండి 36 నెలలు తర్వాత గెలలుగా రూపొందుతాయి. ఈ అననుకూల వాతావరణమే ప్రస్తుతం గెలలు గెలలు దిగుబడికి కారణం. అయితే ఈ జూన్, జులై, ఆగస్ట్‌లో గెలలు దిగుబడి పెరిగే అవకాశం ఉంది. గెలలు దిగుబడికి క్రమపద్ధతిలో నాలుగు, అయిదు గంటలు నీటి తడులు ఇవ్వాలి. గాలిలో తేమ పెంపుదలకు ఎండ్ కేప్స్ తీసి విస్తారంగా నీళ్ళు వదలాలి. మార్చి, ఏప్రిల్‌లో క్రమ పద్ధతిలో తగు మోతాదులో యూరియా, సూపర్, పొటాషియం, మెగ్నీషియం, బోర్‌లు వేయాలి.

- డాక్టర్ ఎం.వి ప్రసాద్, ప్రధాన శాస్త్రవేత్త, ఐసీఏఆర్, ఐఐఓపీఆర్, పెదవేగి

ఈపీ టెక్నీషియన్‌లకు కౌన్సిలింగ్ నిర్వహించి ట్రాన్స్ఫర్ చేయాలి

- సీఐటీయూ

నవతెలంగాణ-మణుగూరు



ఈపీ టెక్నీషియన్స్‌కు ఆన్‌లైన్ కౌన్సిలింగ్ నిర్వహించి ట్రాన్స్ఫర్ చేయాలని సీఐటీయూ బ్రాంచ్ కార్యదర్శి వెంకటరత్నం డిమాండ్ చేశారు. మంగళవారం సీఐటీయూ కార్యలయంలో టీవీ ఎం.వి ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏపీ టెక్నీషియన్ ట్రెనింగ్ పూర్తి చేసుకొని పోస్టింగ్‌ల కోసం ఎదురుచూస్తున్న టెక్నీషియన్స్‌కు ఆన్లైన్ ద్వారా కౌన్సిలింగ్ నిర్వహించి ట్రాన్స్ఫర్ చేయాలని అన్నారు. అలాగే సీనియర్ టెక్నీషియన్ కూడా అవకాశం కల్పించాలని అన్నారు. తద్వారా వారు కోరుకున్న ఏరియాలకు పారదర్శకంగా బదిలీ జరుగుతుందని అన్నారు. ఎంతోకాలంగా ట్రాన్స్ఫర్ కోసం ఎదురుచూస్తున్న వారి ఏరియాలకు వెళ్ళుటకై ఎదురుచూస్తున్న కార్మికులకు న్యాయం జరుగుతుందని, ఎలక్షన్ కోడ్‌తో ఇన్ని రోజులు ఇబ్బంది పడ్డారని, ఇప్పటికైనా యాజమాన్యం స్పందించి వారి న్యాయమైన కోర్కెను తీర్చి వారి కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో లక్ష్మణరావు, రామ్మూర్తి, ఈశ్వర్ రావు, ప్రభాకర్ రావు, బుచ్చిరెడ్డి, సుమన్, శ్రీకాంత్, బిక్షపతి, బొల్లం రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీ నెరవేర్చాలి

- మధ్యాహ్న భోజన కార్మికుల జిల్లా అధ్యక్షురాలు జి.పద్మ

నవతెలంగాణ-పాల్వంచ

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మధ్యాహ్న భోజన కార్మికులకు పదివేల వేతనం నెరవేర్చాలని మధ్యాహ్నం భోజన కార్మికుల జిల్లా అధ్యక్షురాలు జి.పద్మ కోరారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్‌లో మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస్ రావు, డీఈఓకి తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ సీఐటీయూ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే మా బాధలు తీరుతాయని ఆశించామని, కానీ ఎక్కడ ఏసిన గొంగడి అక్కడే అనే చందనంగా ఉందన్నారు. అనేక పోరాటాల అనంతరం సీఐటీయూ ఆధ్వర్యంలో వేతనాలు పెంచుకున్నామని, పెంచుకున్నటువంటి వేతనాలు ఎప్పుడు ఇస్తారో తెలవదని, బిల్లులు ఎప్పుడు వస్తాయో తెలవదన్నారు. నెలల తరబడి



బిల్లులు, జీతాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. జీతాలు రాక అధిక వడ్డీలకు అప్పులు చేసి పిల్లలకు వండి పెడుతూ మధ్యాహ్న భోజన కార్మికులు అప్పుల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బిల్లులు, జీతాలు రాక అనేక ఇబ్బందులు పడుతున్న కార్మికులను మెనూ ప్రకారం వండండి, మెనూ ప్రకారం వండకపోతే ఇష్టముంటే చేయండి లేకపోతే లేదని అధికారులు బెదిరింపులకు గురి చేయటం సరికాదని అన్నారు. ఇప్పటికైనా ఈ ప్రభుత్వం స్పందించి ఎన్నికల సందర్భంగా ఇచ్చినటువంటి హామీ ప్రకారం పదివేల రూపాయల వేతనం ఇవ్వాలన్నారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు నెలల బిల్లులు, నాలుగు నెలల జీతాలు, ఆరు నెలల టిఫిన్ బిల్లులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కోడిగుడ్లు, గ్యాస్ సిలిండర్లు ప్రభుత్వమే సరపరచేయాలని, కాటన్ బట్టల యూనిఫామ్‌గా ఇవ్వాలని, కనీస వేతన రూ.26,000 ఇవ్వాలని, ఈఎస్ఐ, పీఎఫ్ రిటైర్మెంట్ సౌకర్యం కల్పించాలని ఎటువంటి షరతులు లేకుండా బ్యాంకు రుణాలు ఇవ్వాలన్నారు. ఈ డిమాండ్ల పరిష్కారం చేయకపోతే రానున్న కాలంలో పెద్ద ఎత్తున మధ్యాహ్న భోజన కార్మికులకు పోరాటాలకు సిద్ధమవుతానని అన్నారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులు శివమ్మ, పాపమ్మ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ భూ వివాదాలను పరిష్కరించాలి

- మంత్రికి కొత్వాల వినతి

నవతెలంగాణ-పాల్వంచ

పారిశ్రామిక ప్రాంతమైన పాల్వంచలోని రెవెన్యూ భూ వివాదల వలన పాల్వంచ వాసులు అనేక ఇబ్బందులకు గురి అవుతున్నారాని, వాటిని తక్షణమే పరిష్కరించాలని జిల్లా కోపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ ఛైర్మెన్, జిల్లా కాంగ్రెస్ నాయకులు కొత్వాల శ్రీనివాసరావు మంత్రి పొంగులేటిని కోరారు. మంగళవారం పాల్వంచలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్ జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షకు మంత్రి పొంగులేటి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొత్వాలతో పాటు పాల్వంచ కాంగ్రెస్ నాయకులు మంత్రికి వినతి పత్రం సమర్పించారు. కొత్వాల మాట్లాడుతూ పాల్వంచలోని 444, 817, 999, 727 సర్వే



నెంబర్‌లలో రిజిస్ట్రేషన్ లేక 2016 సంవత్సరం నుండి క్రయ, విక్రయాలు నిలిచిపోయాయి, దీని వలన అనేక లావాదేవీలు నిలిచిపోయి పాల్వంచ వాసులు బెంబేలేత్తుతున్నారని కొత్వాల అన్నారు. స్పందించిన పొంగులేటి కొత్వాల వినతి పత్రం ఇచ్చిన వెంటనే తక్షణమే ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, కలెక్టర్ ప్రియంక అలాతో చర్చించారు. త్వరలోనే ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి పాల్వంచ వాసులకు ఇబ్బంది లేకుండా చేస్తామని పొంగులేటి కొత్వాలకు హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో పాల్వంచ మాజీ జడ్పీటీసీ యర్రంశెట్టి ముత్తయ్య, పాల్వంచ మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు కొండం వెంకన్న, నూకల రంగారావు, నాయకులు బాలినేని నాగేశ్వరరావు, మేదరిమెట్ల వెంకటేశ్వరరావు, వెంకటేశ్వర్లు, పాబోలు నాగేశ్వరరావు, కందుకూరి రాము, పులి సత్యనారాయణ, పైడిపల్లి మహేష్, ఉండేటి శాంతివర్ధన్, బండి అంబేద్కర్, తుమ్మల శివారెడ్డి, కాపర్తి వెంకటాచారి, శిరసాని రమణ, వజ్జల రాము, వాసుమల్ల సుందర్ రావులి తదితరులు పాల్గొన్నారు.

నామమాత్రానికే పరిమితమైన బస్సు డిపో

- బస్సులు పెంచాలని ఆర్టీసీ డీఎంకు వినతి

నవతెలంగాణ-ఇల్లందు

బస్సులు సరిపడా లేక ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారని, వెంటనే బస్సుల సంఖ్య పెంచాలని ప్రగతిశీల మహిళా సంఘం డిమాండ్ చేసింది. ఆ సంఘం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా మాస్ లైన్ అనుబంధ సంఘం ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు, ఎదలపల్లి సావిత్రి కేచ్చల కల్పన కొత్తగూడెం ఆర్టీసీ డిపో మేనేజర్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కొత్తగూడెం, మణుగూరు, ఇల్లందు, డిపోల నుండి



పెరుగుతున్న ప్రయాణికుల రీత్యా బస్సులు పెంచాలని వారు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం 6 గ్యారంటీలతో తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిందన్నారు. అన్ని డిపోలలో ప్రయాణికుల రద్దీ పెరిగిన రీత్యా బస్సుల సంఖ్య తగ్గింది కానీ పెరగలేదు అన్నారు. కొత్తగా ఇల్లందు డిపోలో బస్సులు లేవని కేవలం నామమాత్రానికే డిపో పరిమితమైందన్నారు. ఉన్న నాలుగు బస్సులు ఎక్కడ ఆగిపోతాయో అర్థం కాని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇల్లందు మండలంలోని రొంపేడు, మిట్టపల్లి, ధర్మారం, ముత్తారపు కట్ట ఒంపు గూడెం మసివాగు కలుపుకొని అటునుండి కొమరారం బస్సులు నడపాలి, సుదిమల్ల, హనుమంతులపాడు ధర్మారం, టేకులపల్లి మండలంలో మార్యుల ఏజెన్సీ అన్ని ప్రాంతాలకు బస్సుల సంఖ్య పెంచి ఈరూట్లో బస్సులు నడపాలని కోరారు. ఖమ్మం కూడా పరిస్థితి అలాగనే ఉందని బస్సుల సంఖ్య పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కొమరారం మాజీ సర్పంచ్ ముత్తక్క, ఇల్లందు మాజీ కౌన్సిలర్ రేసు సరిత, పట్టణ నాయకురాలు బండి వెంకటమ్మ, గద్దల కుమారి, సరోజినీ భూలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

డయాలసిస్ యూనిట్లు మంజూరు చేయడం సంతోషం

- జిల్లా సోషల్ మీడియా మాజీ ఛైర్మన్ కనుబుద్ది దేవా

నవతెలంగాణ-దుమ్ముగూడెం



భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని చర్ల, పాల్వంచ, ఇల్లందు ఆస్పత్రులకు డయాలసిస్ యూనిట్లు మంజూరు చేయడం చాలా సంతోషకరమని యువజన కాంగ్రెస్ నాయకులు కనుబుద్ది దేవా అన్నారు. ఒక్కో వైద్యశాలలకు 15 డయాలసిస్ మిషన్లను ఏర్పాటు చేస్తూ ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర వైద్య విధాన పరిషత్ తెలంగాణ రాష్ట్ర హెల్త్ అండ్ మెడికల్ ఫ్యామిలీ వెల్ఫేర్ శాఖ ఉత్తర్వులు విడుదల చేసింది అన్నారు. గత ప్రభుత్వంలో ఉమ్మడి జిల్లా అభివృద్ధి నోచుకోలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రత్యేక దృష్టి పెట్టి జిల్లాని అభివృద్ధిలో ముందుకు దూసుకుపోతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే జిల్లాలో ఒక్కొక్క ఆసుపత్రికి 5 యూనిట్లో చొప్పున మూడు ఆసుపత్రులకు 15 యూనిట్లు ఏర్పాటు చేయడం శుభ పరిణామం అని అన్నారు. ప్రభుత్వ పెద్దలను కలిసి దుమ్ముగూడెం మండలానికి కూడా డయాలసిస్ కేంద్రం వచ్చేలా కృషి చేస్తామని అన్నారు. జిల్లా అభివృద్ధికి సహకరిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఉమ్మడి ఖమ్మం మంత్రులు తుమ్మల నాగేశ్వరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పొదెం వీరయ్య, జిల్లాలోని ఉన్న నియోజవర్గ ఎమ్మెల్యేలు అందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలిపారు.

రైతు భరోసా నిధులు రైతుల ఖాతాలో జమ చెయ్యాలి

నవతెలంగాణ-ములకలపల్లి

రైతుల పంట పెట్టుబడి సాయం ఎకరాకు రూ.7,500లు (ఏటా రూ.15,000) రైతుల ఖాతాలో జమచేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని జడ్పీటీసీ సున్నం నాగమణి డిమాండు చేశారు. మంగళవారం మండలంలోని మాదారం గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. రైతులకు పచ్చిరొట్ట, జీలుగు, జనుము విత్తనాలు సరఫరా చేయాలని, అలాగే రైతులు కావాల్సిన అన్ని విత్తనాలు, ఎరువులు సిద్ధంగా ఉంచాలని ఆమె అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అన్నిరకాల పంటలకు రూ.500లు బోనస్ ఇవ్వాలని రైతుల తరుపున సున్నం డిమాండ్ చేశారు.

నేడు పాలేరు, ఖమ్మం నియోజకవర్గాల్లో మంత్రి పొంగులేటి పర్యటన

నవతెలంగాణ-ఖమ్మం

తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పాలేరు, ఖమ్మం నియోజకవర్గాల్లో బుధవారం పర్యటించనున్నారని మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పర్యటనలో భాగంగా ఉదయం 6.30గంటలకు 59వ డివిజన్ దానవాయిగూడెంలో మున్నేరు ప్రొటెక్షన్ వాల్స్ పనులను సందర్శిస్తారని తెలిపారు. 10గంటలకు 60వ డివిజన్ రామన్నపేటలోని జెడ్పీహెచ్ఎస్ లో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్ లను పంపిణీ చేస్తారని పేర్కొన్నారు. 11గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు రఘునాథపాలెం మండలం వి.వెంకటాయపాలెంలోని ఐడీవోసీ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో అభివృద్ధి పథకాలపై మంత్రులు మల్లు భట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి సమీక్షిస్తారని తెలిపారు. అనంతరం మధ్యాహ్నం మూడు గంటల నుంచి ఖమ్మం రూరల్ మండలంలోని దానవాయిగూడెం, రామన్నపేట, కామంచికల్, పాటివారిగూడెం, జాన్ బాద్ తండా , పడమటి తండా, దారేడు తదితర గ్రామాల్లో పర్యటిస్తారని తెలిపారు. ఆయా గ్రామాల్లో ప్రజల నుంచి వినతులను స్వీకరిస్తారని తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో హాజరై మంత్రి పొంగులేటి పర్యటనను విజయవంతం చేయాలని మకోరారు.



గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు అరెస్టు

నవతెలంగాణ-ఖమ్మం

నగరంలోని యువత, విద్యార్థులే లక్ష్యంగా గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించినట్లు ఖమ్మం ఎక్సైజ్ టూ టౌన్ సిఐ బి.చంద్రమోహన్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. కామేపల్లి మండలం మర్రిగూడెం గ్రామానికి చెందిన పోతనబోయిన శ్రీనివాస్, రాయల ఉదయ్ భద్రాచలం ప్రాంతం నుండి గుర్తుతెలియని వ్యక్తుల వద్ద గంజాయి కొనుగోలు చేసి ఖమ్మంలో ఖాళీ ప్రదేశాల్లో విద్యార్థులు, యువకులకు గంజాయి అమ్ముతున్నట్లు సమాచారంతో దాడుల నిర్వహించగా, దాడుల్లో 300 గ్రాముల ఎండు గంజాయి, ఒక సెల్ ఫోను సీజ్ చేసి రిమాండ్‌కి తరలించినట్లు తెలిపారు.



బీఎస్ఎస్ దరఖాస్తుదారులు సమస్యపై మంత్రులకు వినతి

నవతెలంగాణ-ఖమ్మం

నగరంలోని మామిళ్ల గూడెంలోని అఖిలభారత బ్రాహ్మణ (సర్వీస్)నెట్ వర్క్ హెల్ప్ లైన్ కార్యాలయంలో బ్రాహ్మణ సంఘాల ఐక్య వేదిక అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మారం రాజు రాధాకృష్ణ, గెంటాల శ్రీనివాసరావు మాట్లాడుతూ తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ బెస్ట్, విదేశీ విద్య పథకాలతో పాటు..అన్ని పథకాలు విషయంలో, అర్చకుల గౌరవ వేతనం బకాయిలు గురించి జిల్లా మంత్రులు భట్టి, పొంగులేటి, తుమ్మలని, సీఎం రేవంత్ ని మంత్రులు శ్రీధర్ బాబు, కొండ సురేఖలను కలిసి వినతులు ఇవ్వాలని నిర్ణయం చేయడం జరిగిందన్నారు. సంఘాలుగా కాకుండా భవిష్యత్‌లో బ్రాహ్మణులు అందరు కల్సి ఐక్యంగా సంక్షేమ కార్యక్రమాలు చెయ్యాలని నిర్ణయం చేసినట్లు చెప్పారు. ఈ సమావేశంలో నాయకులు సూరావఝ్జల వాసు, రావుల పాటి శ్రీనివాసరావు, శ్రీకాంత్, మాటూరు లక్ష్మి నారాయణ, శివరాజు శ్రీరమ తదితరులు పాల్గొన్నారు.



సస్పెండ్ చేసిన ఏఈఓలను విధుల్లోకి తీసుకోవాలి

- నిరసన వ్యక్తం చేసిన ఏఈఓలు

నవతెలంగాణ-కల్లూరు

మహబూబాబాద్ జిల్లాలో జీలుగు విత్తనాలు అమ్మకాలలో అవకతవకలు జరగాయని ఆ కారణంగా ముగ్గురు ఏఈఓలను సస్పెండ్ చేయటాన్ని నిరసిస్తూ ఏఈఓ సంఘ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. మంగళవారం మండల పరిధిలోని కొర్లగూడెం గ్రామంలోని రైతు నేస్తం కార్యక్రమానికి హాజరైన ఏఈఓలు రైతు వేదిక ముందు సంఘం జిల్లా అధ్యక్షుడు నాగుల మేరా ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేసి ఏడీఏయూ నరసింహారావుకు వినతి పత్రం అందజేశారు. సస్పెండ్ అయిన వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ సంఘం జిల్లా అధ్యక్షుడు షేక్ నాగుల మీరా, నరేష్, దీపక్ రెడ్డి, టీ నరేష్, వెంకటేష్, ఆశాజ్యోతి, రేమా, హర్ష నందిని, నాగేశ్వరరావు, గురుమూర్తి, నాగరాజు, సత్తుపల్లి డివిజన్ వ్యవసాయ విస్తరణ అధికారులందరూ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-మణుగూరు

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు, ఆరోగ్య అవగహన బోర్డులను ఏర్పాటు చేయాలని కోరుతూ మంగళవారం ఏరియా జనరల్ యాక్టింగ్ మేనేజర్ వీర భద్ర రావుకి టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఏరియా నాయకులు నాగేల్లి వెంకట్ మాట్లాడారు. ఈ ఏడాది ముందుగానే వర్షాకాలం ప్రారంభమైన దృష్ట్యా కాలనీ కార్మిక నివాసాల్లో విష జ్వరాలైన డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, చికెన్ గున్యా వ్యాధుల బారిన కార్మికులు వారి కుటుంబ సభ్యులు పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్మిక వారి కుటుంబ ఆరోగ్య శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని ఆరోగ్య చర్యలు చేపట్టడం అభినందనీయమైన అంశమని ఆయన తెలిపారు. ఇప్పటికే జిల్లాలో డెంగ్యూ కేసులు నమోదు అవుతున్న దృష్ట్యా యాజమాన్యం పీవీ టౌన్ షిప్‌తో పాటు అన్ని గనులు డిపార్ట్ మెంట్లలో కూడా ఫాగింగ్ పనులు చేపట్టాలని కోరారు. నీటి నిల్వలు లేకుండా గనులు డిపార్ట్ మెంట్లలో ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. లార్వా వృద్ధి చెందకుండా నిరోధక రసాయనాల పిచికారి, మురికిగుంటలో ఆయిల్ బాల్స్ తాగునీటి సరఫరాలో నాణ్యతా ప్రమాణాలు పాటించడం లాంటి అనేక చర్యలు చేపట్టి దోమల బారి నుంచి ఉద్యోగ వారి కుటుంబ సభ్యులకు రక్షణగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మునిగేల నాగేశ్వరరావు, వినయ్ కుమార్, పవన్ కుమార్, రేవన్, రమేష్, శ్రీనివాస్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

పండ్ల మొక్కల పెంపకం కోసం దరఖాస్తులు చేసుకోండి

- ఎంపీడీవో వరప్రసాద్

నవతెలంగాణ-అశ్వాపురం



మండలంలోని అన్ని గ్రామాలలోని అసక్తి కలిగిన రైతులు మామిడి, జామ, జీడి మామిడి, ఆయిల్ పామ్, తైవాన్ జామ, నిమ్మ బొప్పాసి, నేరేడు తోపాటు ఇంకా ఇతర పండ్ల తోటలు పెంచుకోవాలనుకునే రైతులు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో వరప్రసాద్, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో సీతారామయ్య ఓ ప్రకటనలో కోరారు. దరఖాస్తులు గ్రామపంచాయతీ కార్యాలయాలలోని గ్రామ కార్యదర్శి లేదా ఫీల్డ్ అసిస్టెంట్లకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మొక్కలు ఇవ్వడంతో పాటు నాటడం రెండేళ్ల పాటు సస్యరక్షణ చర్యలను ప్రభుత్వమే చేపడుతుందని, రైతులు కేవలం మొక్కను బతికించుకునేందుకు దోహదపడితే చాలని తెలిపారు.

ప్రభుత్వ విద్యా బోధనతో పిల్లలకు ఉజ్వల భవిష్యత్తు

- కలెక్టర్ వి.పి. గౌతమ్

నవతెలంగాణ-ఖమ్మం

ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న మెరుగైన విద్యా బోధనతో పిల్లలకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని కలెక్టర్ వి.పి. గౌతమ్ తెలిపారు. మంగళవారం కలెక్టర్ స్థానిక రమణ గుట్టలో బడిబాట కార్యక్రమంలో పాల్గొన్నారు. అధికారులు, ఉపాధ్యాయులు, పిల్లలచే ర్యాలీగా, విద్య ప్రాముఖ్యత, ప్రతిఒక్కరూ చదువుకోవాలనే నినాదాలతో ర్యాలీ కొనసాగిందని, కలెక్టర్ ఇంటింటికీ తిరుగుతూ, ఇంట్లో చదువుకొనే పిల్లలు ఉన్నది, ఏ పాఠశాలలో చదువుతున్నది అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యా ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరూ అర్థం చేసుకుని వారి పిల్లలను తప్పనిసరిగా చదివించాలని తెలిపారు. ప్రతి ఒక్క పిల్లవాడు పాఠశాలలో నమోదయ్యే దిశగా బడిబాట కార్యక్రమాన్ని ప్రభుత్వం ఈనెల 6 నుంచి 19 వరకు నిర్వహిస్తుందని ఆయన అన్నారు. జిల్లాలోని ప్రభుత్వ ఉపాధ్యాయులు, సిబ్బంది ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ విద్యాలయాల్లో విద్యార్థుల నమోదు శాతం పెరిగేలా చర్యలు తీసుకోవాలని, అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో కల్పించిన వసతులు, ప్రయివేటు కార్పొరేట్ పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాలలో వస్తున్న మెరుగైన ఫలితాలను తల్లిదండ్రులకు వివరిస్తూ అధిక సంఖ్యలో విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో నమోదు అయ్యేలా చూడాలని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రయివేటు కంటే మెరుగైన నాణ్యత, అనుభవం కలిగిన ఉపాధ్యాయులు విద్యార్థులకు చదువు చెబుతారని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంపూర్ణ అభివృద్ధిపై దృష్టి పెట్టడం జరుగుతుందని, బట్టీపట్టే విధానం కాకుండా పాఠ్యాంశాలు విద్యార్థులకు అర్థమయ్యే దిశగా వారికి వివరిస్తూ కొత్త బోధనా పద్ధతులను ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్నామని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ వహించడం జరుగుతుందని, దీని ఫలితంగా ఇటీవలే వచ్చిన పదవ తరగతి ఫలితాల్లో జిల్లాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు ఉత్తీర్ణత పెరిగిందని, ప్రయివేట్ కంటే మెరుగ్గా ప్రభుత్వ పాఠశాలల్లో ఫలితాలను సాధిస్తున్నామని, ప్రభుత్వ పాఠశాలల్లో ఎటువంటి ఖర్చు లేకుండా నాణ్యమైన విద్య, విద్యార్థులకు అందుతుందని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో రెగ్యులర్ గా ప్రతి నెల పేరెంట్, టీచర్స్ మీటింగ్ నిర్వహిస్తున్నామని, విద్యార్థుల పురోగతే లక్ష్యంగా ఎప్పటికప్పుడు తల్లిదండ్రులను భాగస్వామ్యం చేస్తూ కృషి చేయడం జరుగుతుందని అన్నారు. తొలుత కలెక్టర్ స్థానిక



ఎస్సీ కాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల సందర్శించి అమ్మ ఆదర్శ పాఠశాల పనులను తనిఖీ చేశారు. పాఠశాలకు యూనిఫామ్, పాఠ్య పుస్తకాలు వచ్చినది అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య, కొత్తగా ఎంతమంది నమోదు అయ్యింది అడిగి తెలుసుకున్నారు. బడి బాట కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలుచేయాలని, డ్రాప్ అవుట్ అయిన పిల్లలను గుర్తించి, తిరిగి చదువుకునేలా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి సోమశేఖరశర్మ, ఖమ్మం అర్బన్ మండల విద్యాధికారి శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయులు శంకర్రావు, పద్మజ, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

లైసెన్స్ పొందిన డీలర్ దగ్గరే విత్తనాలను కొనుగోలు చేయండి

ఏడీఏ విజయచంద్ర

నవతెలంగాణ-కూసుమంచి



లైసెన్స్ పొందిన డీలర్ దగ్గరే విత్తనాలను కొనుగోలు చేయాలని కూసుమంచి డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు ఎస్. విజయ్ చంద్ర తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు నకిలీ విత్తనాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ... రైతులందరూ విత్తనాలను తప్పనిసరిగా లైసెన్స్ పొందిన డీలర్ల వద్ద నుండి మాత్రమే తీసుకోవాలని సూచించారు. గ్రామాలలో ఎవరైనా అనుమతి లేకుండా విత్తనాలను విక్రయిస్తున్నట్లయితే అటువంటి సమాచారాన్ని వెంటనే మండల వ్యవసాయ అధికారికి లేదా పోలీసు శాఖ వారికి తెలియజేయాలని సూచించారు. రైతులు విత్తనాలు కొన్న బిల్లును మరియు ఖాళీ ప్యాకెట్లను పంటకాలం పూర్తయ్యే వరకు భద్రపరచుకోవాలని సూచించారు. అదేవిధంగా పత్తి గింజలు విత్తుకోవాలంటే తగిన వర్షపాతం అనగా 60 మిల్లీమీటర్ల వర్షపాతం వచ్చిన తర్వాత మాత్రమే పత్తి విత్తుకోవాలని లేదంటే భూమిలోని వేడికి గింజలు సరిగా మొలకెత్తవని సూచించారు. అనంతరం వరి సాగులో మెళకువలు, ఎరువుల యజమాన్యం మొదలగు అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం కూసుమంచి డివిజన్లో డిజిటల్ గ్రీన్ అనే ఎన్జీవో సంస్థ ద్వారా చేపట్టిన సాగుబాగు కార్యక్రమాన్ని గురించి తెలుసుకోవడానికి నాబార్డ్ తరఫున పనిచేస్తున్న ఇన్ఫ్రెర్ కంపెనీ నుండి వచ్చిన బిజేత్రి రాయ్, దేబేశ్ రాయ్ రైతులతో ముఖాముఖిలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిణి రామడుగు వాణి, ఏఈవోలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా గ్రూపుల సభ్యుల నిధులు మాయం

- గ్రామ సమాఖ్య సభ్యుల ఆందోళన

- వడ్డీతో సహా డబ్బులు జమ చేస్తానని చెప్పడంతో విరమణ

నవతెలంగాణ-ఎర్రుపాలెం

మండల పరిధిలోని వెంకటాపురం స్త్రీ నిధి గ్రామ సమాఖ్య నిధులు గ్రామ దీపిక కాజేసారని గ్రూపు సభ్యులు జమలాపురం యూనియన్ బ్యాంక్ ఎదుట మంగళవారం ఆందోళనకు దిగారు. గతంలో మండలంలోని పలు బ్యాంకులలో కూడా ఈ రీతి గానే గ్రూపు సభ్యులకు తెలియకుండా గ్రామ దీపికలు డబ్బులు డ్రా చేస్తున్నా ఇందిరా క్రాంతి పదం ఏపిఎం వెంకటేశ్వర్లు కేవలం నిర్లక్ష్య ధోరణి వలన ఎన్ని కుంభకోణాలు జరిగినా పట్టించు కోవడం లేదని డ్వాక్రా సభ్యులు విమర్శించారు. వెంకటాపురం గ్రామానికి చెందిన శ్రీ కృష్ణ గ్రామ సమాఖ్య గ్రామ దీపిక వెలుగు సీసీ సంతకాలను ఫోర్జరీ చేసి కుంపటి కన్నయ్య గ్రామంలోని స్వయం సహాయక సంఘాలకు సంబంధించి సుమారు 30 లక్షల నుండి 40 లక్షల రూపాయల నిధులను గ్రామ సమాఖ్య సభ్యులకు తెలియ కుండా డబ్బులు డ్రా చేసి తిరిగి చెల్లింపులు జరపకుండా వాడుకున్నారని ఆందోళన చేపట్టారు. ఈ విషయమై సభ్యులందరు స్త్రీ నిధి అధికారులను నిలదీయగా తాను సదరు నగదును వ్యక్తి గతంగా వినియోగించుకున్నానని ఒప్పుకున్నాడు. నెల రోజుల లో వడ్డీతో సహా సమాఖ్య ఖాతాలో నగదును జమచేస్తానని కన్నయ్య చెప్పడంతో గ్రూపు సభ్యులు ఆందోళన విరమించారు. గ్రామ సమాఖ్య సంఘాల సభ్యులు కన్నయ్య మీద నమ్మకంతో ఖాతాలోని నగదు లావాదేవీలను జరిపాడని, నెల రోజులలో తీసుకున్న



నగదును జమ చేస్తానని చెప్పడంతో గ్రూపు సభ్యులకు వివరణ ఇచ్చారని బ్యాంక్ మేనేజర్ శ్రీనాద్ తెలిపారు. గ్రామ సమాఖ్యలు తరుచూ బ్యాంక్ వద్దకు వచ్చి లోన్ చెల్లింపులను చూసుకోవాల్సిన బాధ్యత స్వయం సహాయక సంఘాలదేనని సూచించారు.

అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-కొత్తగూడెం



కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పట్టణంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను మంగళవారం పరిశీలించారు. పనులు వేగవంతంగా జరగక పోవడానికి కారణాలు తెలుసుకున్నారు. మున్సిపల్ పరిధిలోని రామవరం గోధుమ వాగు బ్రిడ్జి పక్కన సర్వీసు రొడ్డును పునర్ధరించి, ప్రజలకు అందుబాటులోకి తేవాలని సంబంధిత అధికారులకు సూచించారు. గోధుమ వాగు బ్రిడ్జి పైన డివేడర్‌ను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని జాతీయ రహదారుల అధికారులను ఆదేశించారు. చుంచుపల్లి మండలంలోని విద్యానగర్, ప్రయివేటు స్కూల్ ప్రధాన రహదారులపై వర్షపు నీళ్ళు గాని డ్రైనేజీ వాటర్ నిలువకుండా ప్రత్యేకమైన చర్యలను వెంటనే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అనంతరం కొత్తగూడెం ముర్రెడు బిడ్డి నిర్మాణ పనులను పరిశీలించారు. మొర్రేడు రెండవ వంతెన నిర్మాణం వల్ల స్థానిక ప్రజలు పడుతున్న ఇబ్బందులను స్థానికులు ఎమ్మెల్యే సాంబశివరావు దృష్టికి శ్రీనగర్ కాలనీ మాజీ ఉపసర్పంచ్, సీపీఐ నాయకులు లగడపాటి రమేష్ చంద్ వివరించారు. వంతెనకు ఇరుపక్కల సర్వీస్ రోడ్ నిర్మించాలని, డ్రెయిన్స్ నిర్మించాలని, రోడ్డు మధ్యలో ఉన్న కరెంటు పోల్స్‌ని తొలగించాలని, ఈ పనులన్నీ వెంటనే నుండి ప్రారంభించాలని, ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఉండాలని ఎమ్మెల్యే జాతీయ రహదారుల అధికారులను ఆదేశించారు. సర్వీస్ రోడ్లు 7 మీటర్లకు తగ్గకుండా ఉండాలని ఈ పనులు పూర్తయిన తర్వాతనే రెండవ వంతెన మీద వాహనాలు వెళ్లే విధంగా ఉండాలని అప్పటివరకు రెండవ వంతెన మీద వాహనాలు వెళ్లకుండా నిలిపివే యాలని ముర్రెడు రెండవ వంతెన మీద ఫుట్పాతులు నిర్మించాలన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ రహదారుల అధికారులు యుగంధర్, శైలజ, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కె.సాబిర్ పాషా, గోవింద్, కౌన్సిలర్ కంచర్ల జమలయ్య తదితరులు ఉన్నారు.



మిషన్ భగీరథ నల్లా కనెక్షన్ల ఇంటింటి సర్వే

- ఎంపీడీవో రామకృష్ణ

నవతెలంగాణ-పినపాక



మండలంలోని మిషన్ భగీరథ నల్లా కనెక్షన్‌లపై ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ రామకృష్ణ తెలిపారు. మంగళ వారం పాండురంగాపురం, వెంకటరావుపేట గ్రామంలో ఎంపీఓ వెంకటేశ్వరరావుతో కలిసి సర్వే నిర్వహించారు. అనంతరం ఎంపీడీవో మాట్లాడుతూ జల జీవన్ మిషన్ ద్వారా సర్వే నిర్వహించడం జరుగుతుందని, మండలంలో ఏపీఓలు, ఏపీఎంలు, టెక్నికల్ అసిస్టెంట్లు, పంచాయితీ సెక్రటరీలు, ఈజీఎస్, సీసీ ఐకేపీలు కూడా సర్వేలో పాల్గొంటున్నట్లుగా తెలిపారు. ఈ సర్వే ద్వారా మండలంలో మిషన్ భగీరథ నల్లా కనెక్షన్లు ఎన్ని, నీరు వస్తుందా? లేదా అనే వివరాలను క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తున్నామని, సిబ్బంది ప్రతి ఇంటింటికి వెళ్లి నల్లా కనెక్షన్లు చెక్ చేసి కుటుంబ సభ్యుల వివరాలు మొబైల్ యాప్‌లో నమోదు చేస్తున్నారని తెలిపారు. ప్రతీ ఒక్కరం రోజుకు 35 నలబై వరకు అప్లికేషన్లు పూర్తి చేసి 10 రోజుల్లో పూర్తి చేస్తామని తెలిపారు. ఈ సర్వే అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశాలతో ఇంటింటికి స్వయంగా తిరుగుతూ సర్వే నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీలు వెంకటేశ్వర్లు, చంద్ర కుమార్, అనూష, నాగిని, తదితరులు పాల్గొన్నారు.

అశ్వాపురం : మండల కేంద్రంలోని అశ్వాపురం గ్రామపంచాయతీ పరిధిలో మంగళవారం మండల పంచాయతీ అధికారి భూక్య శ్రీనివాస్, కార్యదర్శి సద్గుర్తి కృష్ణ చైతన్య ఆధ్వర్యంలో ఇంటింటికి నల్ల కలెక్షన్ల సర్వేలను నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీలోని ప్రతి ఇంటికి వెళ్లి మిషన్ భగీరథ పైప్లైన్ కలెక్షన్ ఉన్నదా లేదా అని తెలుసుకుంటున్నారు. ఈ సందర్భంగా కనెక్షన్ ఉన్న వారి ఆధార్, ఫోన్ నెంబర్ లను ఆన్లైన్ చేయడంతోపాటు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఓ యాప్‌లో సమాచారాన్ని పొందుపరుస్తున్నారు. నల్ల కనెక్షన్ ఉంటే ఉందని లేకపోతే లేదని ఉన్న నీరు రాకపోతే రావడంలేదని ఆ యాప్‌లో పొందుపరుస్తూ పటిష్టమైన సమాచారాన్ని సేకరిస్తున్నారు. నల్లా లేకపోయినా ఉండి నీళ్ల రాకపోయినా తదుపరి ప్రభుత్వ ఆదేశాలనుసారం కొత్త కనెక్షన్లు ఇచ్చే అవకాశం ఉందని అధికారులు తెలుపుతున్నారు.



కార్మికులపై కక్ష్య సాధింపు చర్యలు విడనాడాలి

నవతెలంగాణ-మణుగూరు

గని అధికారుల తీరు వల్ల కార్మికుల్లో అశాంతి, నైరాశ్యత ఎక్కువ అవుతుందని దాని వల్ల సంస్థ ప్రయోజనాలు దెబ్బతినే ప్రమాదం ఉందని టీబీజీకేఎస్ మణుగూరు ఏరియా ఇన్‌చార్జి నాగేల్లి వెంకట్ అన్నారు. ముఖ్యంగా కేపీయూజీ గని మేనేజర్ కార్మికుల పరంగా ఉన్న చట్టాలు అమలు చేయకుండా అయన వ్యక్తిగతంగా తయారు చేసుకున్న కొత్త చట్టాలు అమలు చేయడగనికి నిర్దేశించిన ఉత్పత్తి, ఉత్పాదకత లక్ష్యాల సాధన కోసం పని చేస్తున్న ప్రతి కార్మికునికి చట్ట బద్దంగా రావలసిన ప్లే డే, పీహెచ్‌డీలు కొంత మంది కార్మికులకే కల్పిస్తున్నారని అన్నారు. మరికొంత మంది కార్మికులను నిబంధనల పేరుతో దూరం పెట్టడం సరికాదని తెలిపారు. గని అవసరాల రీత్యా కార్మికుడిని షిఫ్ట్ మార్పులు చేస్తే ఆ షిఫ్ట్‌కు వెళ్లిన కార్మికుడికి మూడు నెలల వరకు ప్లే డే, పీహెచ్‌డీలు అందించడం లేదన్నారు. ఈ నిబంధనలు గని మేనేజర్ ప్రోత్సహించడం సరికాదని తెలిపారు. ఇకనైనా సంబంధిత అధికారులు దృష్టి సారించి గని నందు ఆరోగ్యకరమైనటువంటి ఉత్పత్తి ఉత్పాదకత లక్ష్యాలను సాధించే క్రమంలో ఇండస్ట్రియల్ రిలేషన్స్ పెంపొందించే విధంగా తగు చర్యలు చేపట్టాలని, గని పురోభివృద్ధికి కార్మిక శ్రేయస్సుకు తోడ్పాటు అందించాలని ఈ సందర్భంగా తెలియజేశారు.

అనారోగ్యంతో ఉద్యమ నాయకురాలు మృతి

నవతెలంగాణ-టేకులపల్లి

అనారోగ్యంతో ప్రముఖ ప్రతిఘటనోద్యమ, విప్లవోద్యమ నాయకురాలు, కామ్రేడ్ రాధక్క అలియాస్ నిర్మల (86) మంగళవారం 9 గంటలకు హైదరాబాదులో మృతి చెందిందని పలువురు మండల న్యూ డెమోక్రసీ నాయకులు వేర్వేరు ప్రకటనలో విప్లవ జోహార్లు తెలిపారు. ఆమె గత కొంతకాలంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నారని, ఆమె ఆరు దశాబ్దాలకు పైగా విప్లవోద్యమంలో సీపీఐ (ఎంఎల్) చంద్ర పుల్లారెడ్డి నాయకత్వంలో వివిధ బాధ్యతలు నిర్వహిస్తూ పనిచేశారని తెలిపారు. గోదావరి లోయ ప్రతిఘటన పోరాటంలో ఆమె ప్రముఖ పాత్ర వహించారని తెలిపారు. రాధక్క మృతికి సీపీఐ(ఎమ్ఎల్) న్యూడెమొక్రసీ మండల కమిటీ వినమ్రంగా జోహార్లు తెలియజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యూడెమొక్రసి మండల కార్యదర్శి భూక్య హర్ష్య, నోముల భానుచందర్, నర్సింగ్, తోటకూరి సతీష్, లక్ష్మణ్, తదితరులు నివాళి అర్పించి సంతాపం తెలిపారు.



పండుగలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి

- కొత్తగూడెం డీఎస్పీ రెహమాన్

నవతెలంగాణ-కొత్తగూడెం

రానున్న పండుగలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని కొత్తగూడెం డిఎస్పీ రెహమాన్ అన్నారు. మంగళవారం కొత్తగూడెం పట్టణంలోని మతపెద్దలతో శాంతి సమావేశం నిర్వహించారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు రాబోయే బక్రీద్ పండుగ నేపథ్యంలో కొత్తగూడెం పట్టణంలోని మత పెద్దలతో కొత్తగూడెం 1టౌన్ పోలీసులు స్టేషన్‌లో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్పి మాట్లాడుతూ పండుగలను ప్రజలంతా ప్రశాంత వాతావరణంలో, కుటుంబ సభ్యుల మధ్య ఆనందంగా జరుపుకోవాలని సూచించారు. మత విద్వేషాలను రెచ్చగొట్టే విధంగా ఎవరైనా ప్రవర్తిస్తే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కుల, మతాలకతీతంగా ప్రతి ఒక్కరూ సోదర భావంతో పండుగలను జరుపుకోవాలని సూచించారు. మత విద్వేషాలకు సంబంధించి ఎక్కడైనా గొడవలు జరిగితే వెంటనే పోలీసు వారికి సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వన్ టౌన్ సిఐ కరుణాకర్, ఎస్ఐలు రవి, విజయ కుమారి తదితరులు పాల్గొన్నారు.

రామోజీ కుటుంబానికి సీఎం రేవంత్‌రెడ్డి పరామర్శ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఈనాడు గ్రూప్ సంస్థల అధినేత రామోజీరావు ఇటీవల అనారోగ్యంతో మరణించిన నేపథ్యంలో వారి కుటుంబ సభ్యులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరామర్శించారు. మంగళవారం హైదరాబాద్‌లోని రామోజీ ఫిల్మ్ సిటీలో వారిని కలిసి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం రామోజీరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సీఎం వెంట వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్, మల్‌రెడ్డి రాంరెడ్డి, మధుసూధన్ రెడ్డి తదితరులున్నారు.

నా భర్తను నాకు తెచ్చివ్వాలి

- లారీ ఓనర్ ఇంటి ఎదుట

కుటుంబ సభ్యులతో కలిసి మహిళ నిరసన



నవతెలంగాణ-మద్దూరు

పని కోసమని తీసుకువెళ్లి నా భర్తను మాయం చేశారని, నా భర్తను నాకు తెచ్చివ్వాలని ఓ మహిళ లారీ ఓనర్ ఇంటి ముందు నిరసన వ్యక్తం చేసింది. ఈ సంఘటన సిద్దిపేట జిల్లా మద్దూరు మండలంలోని మర్మముల గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. బాధితురాలు యాటెల్లి కవిత తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన యాటెల్లి శ్రీకాంత్‌ను బత్తిని కనకయ్యకు చెందిన లారీపై డ్రైవర్‌గా పనిచేస్తున్న నూకల పూర్ణచందర్ రెడ్డి మే మూడో తేదీన తమిళనాడులోని నాంకల్ జంక్షన్‌లో లోడు దించాల్సి ఉందని తీసుకు వెళ్లాడు. మే 7వ తేదీన పూర్ణచందర్ రెడ్డి ఒక్కడే గ్రామానికి వచ్చాడని శ్రీకాంత్ భార్య యాటెల్లి కవిత తెలిపారు. మే 8వ తేదీన తన భర్త శ్రీకాంత్ ఎక్కడని పూర్ణచందర్ రెడ్డిని నిలదీయడంతో తన దగ్గర రూ.200 తీసుకొని ఎక్కడికో వెళ్ళాడని సమాధానమిచ్చాడని చెప్పారు. దాంతో తాము తమిళనాడులోని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి, పోలీస్ స్టేషన్ పరిధిలో శ్రీకాంత్ ఫొటోలతో మిస్సింగ్ అయినట్టు పోస్టర్లు అంటించినట్టు తెలిపారు. మే 15న మద్దూరు పోలీస్ స్టేషన్‌లో శ్రీకాంత్‌ను కనకయ్య పూర్ణచందర్ రెడ్డి ఏమో చేశారని ఫిర్యాదు చేసేందుకు వెళ్లగా, ఎస్ఐ తీసుకోలేదని తెలిపారు. తన భర్త తనకు కావాలంటూ కనకయ్య. ఇంటి ముందు కుటుంబ సభ్యులతో కవిత నిరసన వ్యక్తం చేశారు. దాంతో మద్దూరు ఏఎస్ఐ జిల్లా జగదీష్ ఘటనా స్థలానికి చేరుకొని బాధిత కుటుంబాన్ని సముదాయించి, ఆందోళన విరమింపజేశారు.

విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు

- బెల్టుషాపుల ఎదుట మహిళల ఆందోళన



నవతెలంగాణ-చేర్యాల

విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు కొనసాగుతుండటంతో బెల్టు షాపుల ఎదుట మహిళలు ఆందోళనకు దిగిన ఘటన సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం చిట్యాల గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ.. గ్రామంలో పదుల సంఖ్యలో బెల్టు షాపులు ఏర్పాటు చేసి యథేచ్ఛగా మద్యం అమ్మకాలు సాగిస్తున్నారని, వాటిని మూసివేయాలని ఎక్సైజ్ అధికారులకు పలుమార్లు మొరపెట్టుకున్నా ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ తాము అధికారంలోకి రాగానే రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లో బెల్టు షాపులను తొలగిస్తామని హామీనిచ్చి నేటికీ ఆరు నెలలు గడుస్తున్నా ఎలాంటి చర్యలు చేపట్టలేదని అన్నారు. ఇంట్లో మగవారు మద్యానికి బానిసలై బెల్టు షాపుల వద్దే గడుపుతున్నారని, మహిళలు కూలీ, నాలి చేసి సంపాదించిన డబ్బులను సైతం లాక్కుని మద్యానికి ఖర్చు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాగుడుకు బానిసైన మగవారు ఇంట్లోని సామగ్రిని బెల్టు షాపుల వద్ద తాకట్టు పెట్టడంతో పాటు మద్యం మత్తులో భార్య పిల్లలను సైతం చితకబాదిన ఘటనలు అనేకం ఉన్నాయని చెప్పారు. గ్రామాల్లోని ప్రతి బెల్టు షాపు నుంచి అధికారులకు నెలవారీ మామూళ్ల అందుతుండటంతోనే విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు జరుపుతున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు స్పందించి బెల్ట్‌షాపులు తొలగించాలని, లేనిపక్షంలో వాటిని తొలగించే వరకూ తమ ఆందోళనలు విరమింపబోమని హెచ్చరించారు.

వ్యవసాయ ప్రణాళిక రెడీ!

అయినా విడుదలకు ఆలస్యమెందుకు?

- గత రెండేండ్లుగా ఇదే తంతు
- అదే దారిలో కొత్త ప్రభుత్వమా?



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

వానాకాలం సాగు లక్ష్యాలను నిర్దేశించిన వ్యవసాయ పంటల ప్రణాళికలను ప్రభుత్వం సిద్ధం చేసింది. ప్రభుత్వ ఆలోచనలకు ప్రణాళిక ప్రతిబింబంగా ఉంటుంది. రైతులకు ఆ ప్రణాళిక కరదీపికగా ఉపయోగపడుతుంది. విత్తనాలు, ఎరువులు, రుణాలు, పంటల సాగు, మార్కెటింగ్, మద్దతు ధర, పండ్లు, కూరగాయాలు, పప్పుధాన్యాలు, నూనె గింజల సాగు తదితరాంశాలతో సమగ్రమైన ప్రణాళిక సిద్ధమైంది. సాధారణంగా ఏప్రిల్, మే నెలల్లో వ్యవసాయ ప్రణాళికను విడుదల చేయాల్సి ఉంటుంది. కానీ సిద్ధమైన ప్రణాళికను కూడా వ్యవసాయ శాఖ విడుదల చేయడం లేదు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా రెండేండ్లుగా విడుదల చేయలేదు. ప్రణాళికలో చెప్పిందొక్కటైతే, అమలు మరొకటిగా ఉండటంతో దాన్ని దాచి పెట్టిందనే విమర్శలొచ్చాయి. వ్యవసాయానికి ఎంతో ప్రాధాన్యత ఇస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం కూడా పంటల ప్రణాళికను విడుదల చేయడం లేదు. ఇప్పటికే వానాకాలం ప్రారంభ మైంది. వర్షాలు కురుస్తున్నాయి. రైతులు విత్తనం విత్తేందుకు సిద్ధమవుతున్నారు. గత ప్రభుత్వం దారిలోనే కొత్త ప్రభుత్వం నడుస్తుందా? అనే అనుమానాలు వెల్లువెత్తుతున్నాయి.

వ్యవసాయ ప్రణాళికలో అసలేముంది?

వ్యవసాయ శాఖ వానాకాలానికి భారీ ప్రణాళికను సిద్ధం చేసింది. ఈసీజన్‌లో 1.34 కోట్ల ఎకరాల్లో పంటల సాగు చేయాలని అంచనా వేసింది. వరి 61లక్షల ఎకరాల్లో, పత్తి 60లక్షల ఎకరాల్లో సాగవుతుందని పేర్కొంది. అందుకు 19,39,520 క్వింటాళ్ల విత్తనాలు అవసరమని తెలిపింది. పంట మార్పిడి చేయాలంటూ రైతులకు విజ్ఞప్తి చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా సాగయ్యే పంటలు, అవసరమైన ఎరువులు, విత్తనాలకు సంబంధించిన అంశాలను పొందుపరిచినట్టు తెలిసింది. నేల స్వభావాన్ని దృష్టిలో ఉంచుకుని ఏయే నేలలో ఏయే పంటలు, ఎంత విస్తీర్ణంలో సాగయ్యే అవకాశం ఉందనే అంచనా వేసింది. జూన్ నెల నుంచి వానాకాలం సీజన్ ప్రారంభం కావడంతో ఆ లోగా పంటల ప్రణాళిక, అవసరమయ్యే ఎరువులు, విత్తనాలను అందుబాటులో ఉంచాలని సైతం అధికారులు సంబంధింత సంస్థలను ఆదేశించారు.

పంటలు, విత్తనాల అంచనా

ఖరీఫ్‌లో జొన్న 38వేల ఎకరాల్లో, మొక్కజొన్న ఆరులక్షల ఎకరాల్లో, కందులు 5.85 లక్షల ఎకరాల్లో, వేరుశనగ 33 వేల ఎకరాల్లో, పెసర్లు 36వేల ఎకరాల్లో, సోయా 4.36 లక్షల ఎకరాల్లో సాగయ్యే అవకాశం ఉందని ప్రణాళికలో పొందుపరిచింది. పంట సాగుకు అనుగుణంగా విత్తనాలను అంచనా వేసింది. అందులో వరి విత్తనాలకు అనుగుణంగా 16,50,000 క్వింటాళ్ల అవసరమని భావించింది. పత్తి విత్తనాలు 54వేల క్వింటాళ్లు, జొన్న పంట కోసం 1520 క్వింటాళ్లు, మొక్కజొన్న విత్తనాలు 48వేల క్వింటాళ్లు, కందులు 16050 క్వింటాళ్లు, సోయా 1,43,059 క్వింటాళ్లు, పెసర్లు 4480 క్వింటాళ్లు అవసరమవుతాయని భావించింది. ఇంతా చేసి ప్రణాళికను విడుదల చేయకపోవడానికి కారణాలేమిటో తెలియటం లేదు. అయితే మొత్తంగా 18,38,520 క్వింటాళ్ల విత్తనాలను ఇప్పటికే సేకరించినట్టు అధికారులు తెలిపారు.

గత ప్రభుత్వం బాధ్యత లేకుండా వ్యవహరించింది

దొంతి నర్సింహ్మారెడ్డి, వ్యవసాయ విధాన విశ్లేషకులు

వ్యవసాయ పంటల ప్రణాళిక విషయంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం బాధ్యత లేకుండా వ్యవహరించింది. ఈ ప్రభుత్వంలో కూడా అదే దోరణి కనిపిస్తున్నది. ఇప్పటికైనా వ్యవసాయ పంటల ప్రణాళికలను బహిర్గతం చేయాలి. రైతు సంఘాలు, మేధావులతో సంప్రదింపులు చేసిన తర్వాత ముసాయిదాను రూపొందించి, అప్పుడు తుది ప్రణాళికను విడుదల చేయాలి.

రైతులకు భరోసా కల్పించాలి

టి సాగర్, ప్రధాన కార్యదర్శి తెలంగాణ రైతుసంఘం

వ్యవసాయ పంటల ప్రణాళికను వెంటనే విడుదల చేసి రైతులకు భరోసా కల్పించాలి. వానాకాలం ప్రణాళికను మే నెలలో విడుదల చేసే సాంప్రదాయం ఉంది. ఇప్పటికే ఆలస్యమైంది. ఈ విషయంలో ముఖ్యమంత్రి, వ్యవసాయ శాఖ మంత్రి జోక్యం చేసుకోవాలి.

సమస్యల్లో విద్యా వైద్యం

అధికారులను నిలదీసిన సభ్యులు

- ప్రభుత్వాస్పత్రుల్లో వైద్యులు కరువు
- ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్లు, తాగునీటి సమస్యలు
- రంగారెడ్డి జడ్పీ సమావేశంలో సభ్యుల ఆవేదన
- పరిష్కారానికి కలెక్టర్ హామీ
- ఐదేండ్లు సహకరించిన సభ్యులకు కృతజ్ఞతలు :జడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి



నవతెలంగాణ-రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి

విద్యా వైద్య రంగాల్లో నెలకొన్న సమస్యలపై రంగారెడ్డి జడ్పీ సమావేశంలో సంబంధిత అధికారుల పనితీరు, ప్రభుత్వ విధానాలను సభ్యులు ప్రశ్నించారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ తీగల అనితా హరినాథ్‌రెడ్డి అధ్యక్షతన జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్ శశాంక, జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ హాజరయ్యారు. ఇదే చివరి సమావేశం కావడంతో సభ్యులు గత ఐదేండ్లలోని అనుభవాలను సభలో పంచుకున్నారు. పదవిలో ఉండి కూడా ప్రజలకు ఏమీ చేయ లేకపోయామనే భావనను చాలా మంది వ్యక్తం చేశారు. బాధ తాప్ప ఏమీ మిగలలేదని భావోద్వేగానికి గురయ్యారు. కొంత మంది సభ్యులు సాధ్యమైనంత మేరకు తమ వంతుగా అభివృద్ధి పనులు చేశామని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. సభ్యులు లేవనెత్తిన సమస్యల పరిష్కారానికి తమవంతు కృషి చేస్తానని కలెక్టర్ శశాంక హామీ ఇచ్చారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో డాక్టర్లు, సంబంధిత సిబ్బంది లేకపోవడంతో ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని సభ్యులు జిల్లా వైద్యాధికారిని ప్రశ్నించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో కనీస వసతులు కూడా లేవని ముఖ్యంగా ఆపరేషన్ థియేటర్లు, ఏసీలు, నీరు లేని పరిస్థితులున్నాయన్నారు. రోగులు డాక్టర్ల కోసం గంటల కొద్దీ ఎదురు చూడాల్సిన దుస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. డిప్యూటేషన్ల పేరుతో గ్రామీణ ప్రాంతాల్లో పీహెచ్‌సీల్లోని డాక్టర్లు హైదరాబాద్ శివారు ప్రాంతాలకు వెళ్తున్నారని, డిప్యూటేషన్లను వెంటనే రద్దు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. విద్యా శాఖపై జరిగిన సమీక్షలో.. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరతతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం లేదని, అందుకు తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాధికారిని కోరారు. ప్రయివేటు పాఠశాలలకు నిబంధనలు పాటించకుండా ఎలా పర్మిషన్లు ఇస్తున్నారని ప్రశ్నించారు.

స్కూళ్లలో ఇప్పటికీ తాగునీరు, టాయిలెట్ల సమస్యలు ఉన్నాయన్నారు. వ్యవసాయ శాఖపై సమీక్షిస్తూ.. రైతులకు నకిలీ విత్తనాలు, ఎరువులతో ఇబ్బందులు కలగకుండా వ్యవసాయ శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించాలని సభ్యులు కోరగా అందుకు జిల్లా వ్యవసాయశాఖ అధికారి స్పందిస్తూ పోలీసు, రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు అందరూ కలిసి తనిఖీలు నిర్వహించి పర్యవేక్షిస్తున్నట్టు వివరించారు. విద్యుత్ శాఖపై సమీక్షలో భాగంగా గాలివానలకు కరెంట్ పోతుందని, సంబంధిత ఏఈలు, లైన్‌మెన్లు స్పందించడం లేదని సభ్యులు వాపోయారు. పాత స్తంభాలు తొలగించాలని, కిందకు వేలాడుతున్న వైర్లను సరి చేయాలని, వర్షాకాలంలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చూడాలని అధికారులను సభ్యులు కోరగా, తప్పకుండా పరిష్కరిస్తామని, ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

ఈ సందర్భంగా జిల్లా పరిషత్ చైర్ పర్సన్ అనితా హరినాథ్ రెడ్డి మాట్లాడుతూ.. ఈ సర్వసభ్య సమావేశం చివరిదని, గడచిన ఐదేండ్లు సమీక్షలు సుదీర్ఘంగా నిర్వహించినట్టు చెప్పారు. ప్రజల సమస్యలపై పోరాడటంతో పాటు తీర్మానాలను చేసినట్టు తెలిపారు. జిల్లాలో ఎంపీడీఓలు, నోడల్ అధికారులతో సమస్యలపై చర్చించి పరిష్కరించినట్టు వివరించారు. ఈ ఐదేండ్లు తనకు సహకరించిన జడ్పీటీసీలు, ఎంపీపీలు, జిల్లా అధికారులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా ప్రజా పరిషత్ సీఈఓ కృష్ణారెడ్డి, డిప్యూటీ సీఈవో రంగారావు, కో-ఆప్షన్ సభ్యులు, జడ్పీటీసీలు ఎంపీపీలు, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

కిలో @ 50

(మొదటిపేజీ తరువాయి)

తగినట్టు ఐసీఎంఆర్ రిపోర్టు ప్రకారం 41.75 లక్షల మెట్రిక్ టన్నులు అవసరమంటోంది. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం (పీజేటీఎస్ఏయూ) ప్రకారం 22.32 లక్షల మెట్రిక్ టన్నులు సరిపోతాయని అంచనా. వికారాబాద్‌లో సుమారు వెయ్యి ఎకరాల్లో ఉల్లి సాగవుతోంది. ఇక్కడ పండించే ఉల్లి సరిపోక పక్క రాష్ట్రాలైన ఏపీ నుంచి కూడా వస్తోంది. దేశంలోనే అత్యధికంగా ఉల్లి పంట పండించే మహారాష్ట్ర నాసిక్ నుంచే అత్యధికంగా సరఫరా అవుతోంది. అమాంతంగా పెరిగిన ఉల్లి ధరలతో పేద,మధ్యతరగతి ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం జోక్యం చేసుకుని మార్కెట్‌లో సబ్సిడీ ధరపై ఉల్లి విక్రయించాలని వినియోగదారులు డిమాండ్ చేస్తున్నారు.

24 నుంచి పార్లమెంట్

నవతెలంగాణ - న్యూఢిల్లీ బ్యూరో



పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు ఈ నెల 24 నుంచి జరగనున్నాయి. ఈ సమావేశాల్లో లోక్‌సభ స్పీకర్ ఎన్నిక, కొత్త ఎంపీల ప్రమాణ స్వీకారం ఉంటుందని ప్రభుత్వ వర్గాలు మంగళవారం తెలిపాయి. జూన్ 24 నుంచి జులై 3 వరకు ఎనిమిది రోజుల పాటు ఈ సమావేశాలు కొనసాగనున్నట్లు వెల్లడించాయి. ఇందులో భాగంగా 26న లోక్‌సభ స్పీకర్ ఎన్నిక జరిగే అవకాశం ఉంది. 24, 25 తేదీల్లో కొత్త పార్లమెంట్ సభ్యులు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ప్రొటెం స్పీకర్‌గా కాంగ్రెస్ ఎంపీ కె.సురేష్, బీజేపీ ఎంపీ రాధా మోహన్‌సింగ్ పేర్లు వినిపిస్తున్నాయి. ఎన్నికైన సభ్యులతో ప్రొటెం స్పీకర్ ప్రమాణ స్వీకారం చేయిస్తారు.

విద్యార్థులు సమాజాన్ని అధ్యయనం చేయాలి

- అసమానతలకు వ్యతిరేకంగా పోరాడాలి : ఎస్ఎఫ్ఐ రాష్ట్రస్థాయి శిక్షణా తరగతుల్లో కె శ్రీనివాస్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

విద్యార్థులు చదువులతోపాటు సమాజాన్ని కూడా అధ్యయనం చేయాలని ఆంధ్రజ్యోతి సంపాదకులు కె శ్రీనివాస్ చెప్పారు. అసమానతలు, ఆర్థిక అంతరాలను రూపుమాపేందుకు అధ్యయనం చేయాలనీ, వాటికి వ్యతిరేకంగా పోరాడాలని కోరారు. భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి అధ్యక్షతన రాష్ట్రస్థాయి విద్యా, వైజ్ఞానిక శిక్షణా తరగతులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కె శ్రీనివాస్ మాట్లాడుతూ సమాజంలో ఆధిపత్య వర్గాల భావజాలం అధికార భావజాలంగా ఉందని చెప్పారు. బలహీన వర్గాలు, పేదలు వారికి అందాల్సిన సౌకర్యాలు దేశంలో అందడం లేదన్నారు. ప్రశ్నించడం అనేది కీలకమనీ, ప్రశ్నతోనే సమాజం ముందుకు వెళ్తుందని అన్నారు. భారతదేశంలో పాలకులు తమ భావజాలాన్ని వ్యాప్తి చేసేందుకు, విద్య, చరిత్ర, అన్ని అంశాలను వాడుకుంటున్నారని చెప్పారు. అందుకే సమసమాజాన్ని నిర్మించడానికి విద్యార్థులు చదువుతోపాటు సమాజంలో జరిగే దోపిడీ, అసమానతలు, ఆధిపత్య ధోరణలకు వ్యతిరేకంగా పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి నాగరాజు మాట్లాడుతూ దేశంలో సమసమాజ స్థాపనకు పోరాడుతున్న విద్యార్థి సంఘం తమదేనని అన్నారు. రానున్న కాలంలో బలమైన పోరాటాల నిర్వహణకు ఈ తరగతుల్లో అవగాహన కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు రజనీకాంత్, శ్రీకాంత్ వర్మ, ప్రశాంత్, శంకర్, రాష్ట్ర సహాయ కార్యదర్శులు మమత, డి కిరణ్, అశోక్ రెడ్డి, డి ప్రశాంత్‌తోపాటు రాష్ట్ర కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఎడ్‌సెట్‌లో అబ్బాయిల హవా

- అమ్మాయిల కన్నా 2.2 శాతం అధికం
- 96.90 శాతం ఉత్తీర్ణత
- ఎడ్‌సెట్ ఫలితాలు విడుదల చేసిన నవీన్ మిట్టల్, లింబాద్రి
- నాగర్ కర్నూల్ జిల్లాకు చెందిన నవీన్‌కుమార్ టాపర్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో బీఎడ్ కోర్సులో 2024-25 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం గతనెల 23న నిర్వహించిన ఎడ్‌సెట్ రాతపరీక్ష ఫలితాలను మంగళవారం హైదరాబాద్‌లోని మాసబ్‌ట్యాంక్‌లో ఉన్న ఉన్నత విద్యామండలి కార్యాలయంలో మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం ఇన్‌చార్జీ వైస్ చాన్సలర్, రెవెన్యూ శాఖ ముఖ్యకార్యదర్శి నవీన్ మిట్టల్, టీజీసీహెచ్ఈ చైర్మెన్ ఆర్ లింబాద్రి విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎడ్‌సెట్‌కు 33,879 మంది దరఖాస్తు చేయగా, 29,463 మంది పరీక్ష రాశారని చెప్పారు. వారిలో 28,549 (96.90 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారని అన్నారు. ఇందులో 5,732 మంది అబ్బాయిలు దరఖాస్తు చేస్తే, 4,830 మంది పరీక్షకు హాజరయ్యారని వివరించారు. వారిలో 4,769 (98.74 శాతం) మంది ఉత్తీర్ణత పొందారని చెప్పారు. 28,147 మంది అమ్మాయిలు దరఖాస్తు చేయగా, 24,633 మంది పరీక్ష రాశారని అన్నారు. వారిలో 23,780 (96.54 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారని వివరించారు. ఎడ్‌సెట్ ఫలితాల్లో అబ్బాయిలు హవా కొనసాగించారని చెప్పారు. అమ్మాయిల కన్నా అబ్బాయిలు 2.2 శాతం అధికంగా ఉత్తీర్ణులయ్యారని అన్నారు. 118 మార్కులతో నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన ఎం నవీన్‌కుమార్ టాపర్ (మొదటి ర్యాంకు)గా నిలిచారు. హైదరాబాద్‌కు చెందిన అషిత నారాయణ్ రెండో ర్యాంకు, సి శ్రీతేజ మూడో ర్యాంకు, మేడ్చల్ మల్కాజిగిరికి చెందిన దూపల్లి సాయి ప్రీతమ్ నాలుగో ర్యాంకు, కె రాజేందర్‌రెడ్డి ఐదో ర్యాంకు సాధించారు. టాప్ టెన్ ర్యాంకుల్లో ఎనిమిది మంది అబ్బాయిలు, ఇద్దరు అమ్మాయిలున్నారు. 208 బీఎడ్ కాలేజీల్లో 20 వేల వరకు సీట్లున్నాయని లింబాద్రి చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉన్నత విద్యామండలి వైస్ చైర్మెన్ ఎస్కే మహమూద్, కార్యదర్శి శ్రీరాం వెంకటేశ్, ఎడ్‌సెట్ కన్వీనర్ టి మృణాళిని తదితరులు పాల్గొన్నారు.

భారత ఆర్థిక పురోభివృద్ధిలో యువతదే కీలకపాత్ర

- కష్టాలు ఎదురైతే విరామమివ్వాలే తప్ప వెనుకడుగు వేయొద్దు
- తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం మూడో స్నాతకోత్సవంలో.. : తెలంగాణ గవర్నర్ సీపీ రాధాకృష్ణన్

విద్యార్థులు విజయమే లక్ష్యంగా ముందుకు సాగాలి



నవతెలంగాణ-ములుగు

2047 నాటికి 30 ట్రిలియన్ డాలర్ల స్థూల జాతీయోత్పత్తిగా ఎదిగేందుకు భారత్‌కు పుష్కల అవకాశాలు ఉన్నాయని, ఇది వికసిత్ భారత్ ద్వారా సాధ్యమవుతుందని, అందులో యువత ప్రముఖ పాత్ర పోషించాలని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ అన్నారు. మంగళవారం సిద్దిపేట జిల్లా ములుగులోని శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం మూడో స్నాతకోత్సవాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. భారత స్థూల జాతీయోత్పత్తికి 18శాతంపైగా వ్యవసాయమే ఆధారమైన నేపథ్యంలో మరింత వృద్ధిరేటుకు ప్రభుత్వం సహజ, సేంద్రీయ వ్యవసాయానికి మరింత మద్దతునిస్తుందని తెలిపారు. వ్యవసాయంతోపాటు ఉద్యాన, అటవీ రంగాలకు ప్రాధాన్యత పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. దేశంలో 70శాతంపైగా గ్రామీణులకు ప్రధాన ఆదాయ వనరు వ్యవసాయమే నని, 82 శాతానికి పైగా చిన్న, సన్నకారు రైతులే ఉన్నారని అన్నారు. విద్యార్థులు విజయమే లక్ష్యంగా ముందుకు సాగాలని, కష్టాలు ఎదురైతే విరామం ఇవ్వొచ్చు కానీ వెనుకడుగు వేయవద్దని సూచించారు.

తమిళనాడు వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ వి.గీతాలక్ష్మి మాట్లాడుతూ.. పర్యావరణ మార్పుల నేపథ్యంలో సుస్థిర ఆహార, పోషక భద్రత సాధించడంతోపాటు సూపర్ ఎకానమిక్ పవర్‌గా భారత్ ఎదిగేందుకు టెక్నాలజీ ఆధారిత వ్యవసాయంపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రెసిషన్ ఫార్మింగ్, బిగ్ డేటా, కృత్రిమ మేథస్సు, రోబోటిక్స్, డ్రోన్స్, రిమోట్ సెన్సింగ్ వంటి ఆధునిక వ్యవసాయ విజ్ఞానాన్ని రైతులకు పరిచయం చేయాలని సూచించారు. పంట కోతనంతరం 20 నుంచి 30 శాతం దిగుబడి నష్టం జరుగుతున్న నేపథ్యంలో పంట ఉత్పత్తుల మేలైన నిల్వలకు కావాల్సిన సదుపాయాల్ని కల్పించుకోవాలన్నారు. ఆధునిక పరిజ్ఞానంతో తక్కువ వ్యవధి ఉండే నూతన రకాల అభివృద్ధి రెండు మూడేండ్లలోనే పూర్తవుతుందని తెలిపారు. జీన్ ఎడిటింగ్, జీన్ పిరమిడ్ పద్ధతుల ద్వారా చలిని, అధిక వేడిని, నీటి ఎద్దడిని తట్టుకునే పంట రకాల రూపకల్పన సుసాధ్యమని తెలిపారు. ఉపాధి కోసం ఎదురుచూసే వ్యక్తిగా కంటే ఉపాధి కల్పించే శక్తిగా విద్యార్థులు ఎదగాలని చెప్పారు. దేశంలో వ్యవసాయ, ఉద్యాన ఆధారిత అంకుర పరిశ్రమలకు పుష్కల భవిష్యత్తు ఉన్న నేపథ్యంలో నైపుణ్యాభివృద్ధిపై విద్యార్థులు దృష్టి సారించాలన్నారు.

ముందుగా శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ శ్రీమతి బి. నీరజ ప్రభాకర్ స్వాగతోపన్యాసం చేశారు. అలాగే అభివృద్ధి నివేదికనూ పెట్టారు. తెలంగాణలో రైతులు సాగు చేస్తున్న బాలానగర్ సీతాఫలం, ఆర్మూరు పసుపుతోపాటు మరికొన్ని స్థానిక పంటలకు భౌగోళిక గుర్తింపు, రైతు వంగడాల రిజిస్ట్రేషన్, పామ్ ఆయిల్‌పై పరిశోధనలు, ప్రధాన ఉద్యాన పంటల్లో సేంద్రీయ సాగు, నూతన రకాల అభివృద్ధి గురించి వివరించారు. రైతులకు శాస్త్రీయతతో కూడిన నూతన ఉద్యాన పరిజ్ఞానాన్ని అందించేందుకు ఉద్యానదర్శినిని అందిస్తున్నట్టు తెలిపారు. అనంతరం విద్యార్థులకు డిగ్రీ పట్టాలు, బంగారు పతకాలను ప్రధానం చేశారు. యూనివర్సిటీలోని 156 మందికి ఉద్యాన డిగ్రీ, 50 మందికి ఫారెస్ట్ డిగ్రీ, 45 మందికి ఉద్యాన పీజీ, 30 మంది ఫారెస్ట్ పీజీ, అలాగే మరో ఆరుగురికి పీహెచ్‌డ్ డాక్టరేట్ పట్టాలు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఏ భగవాన్, డీన్ డాక్టర్ ఎం. రాజశేఖర్, పరిశోధన సంచాలకులు డాక్టర్ కిరణ్, డీఎస్ఏ డాక్టర్ విజయ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ శ్రీనివాసన్, ఉద్యాన శాఖ కమిషనర్ అశోక్ రెడ్డి, బోర్డు మెంబర్ డాక్టర్ ఆర్కే మాథుర్, ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఈ నెల 4న 18వ లోక్‌సభ ఎన్నికల ఫలితాలు ప్రకటించారు. ఈ సార్వత్రిక ఎన్నికల్లో పదేండ్ల తర్వాత బలమైన ప్రతిపక్షం ఏర్పడింది. భారత జాతీయ కాంగ్రెస్ నేతృత్వంలో ఇండియా కూటమిగా ఏర్పడి ఎన్‌డీఏపై పోరాడారు. మొత్తం 232 స్థానాలను గెలుచుకోగలిగారు. ప్రతిపక్షాలు చేసిన ఈ పోరాటంలో మహిళా అభ్యర్థులు సైతం పెద్దఎత్తున విజయం సాధించారు. ఈ ఎన్నికల్లో మొత్తం 797 మంది మహిళా అభ్యర్థులు పోటీ చేయగా 30 మందికి పైగా విజయం సాధించారు. వీరిలో చాలా మంది అట్టడుగు, మైనారిటీ వర్గాలకు చెందినవారు సైతం ఉన్నారు. వారి పరిచయాలు నేటి మానవిలో...



INDIAలో మహిళా గొంతు

కడియం కావ్య



తెలంగాణలో వరంగల్ లోక్‌సభ నియోజకవర్గం నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. ఈమె ప్రముఖ వైద్యురాలు అలాగే సమాజిక కార్యకర్త. కడియం ఫౌండేషన్ ద్వారా వివిధ సామాజిక కార్యక్రమాలను నిర్వహిస్తూ ఈ ఏడాది ప్రత్యక్ష రాజకీయాల్లోకి ప్రవేశించారు. కావ్య మాజీ ఎంపీ కడియం శ్రీహరి కుమార్తె.

వర్షా ఏక్‌నాథ్ గైక్వాడ్

మహారాష్ట్రలోని ముంబై నార్త్ సెంట్రల్ నియోజకవర్గం నుంచి బీజేపీ ఉజ్వల్ నికమ్‌పై గట్టిపోటీనిచ్చిన దళిత మహిళా నాయకురాలు వర్ష ఏక్నాథ్ గైక్వాడ్. 16,514 ఓట్ల తేడాతో గెలుపొందారు. వర్షా తాయి అని ప్రజలు ఆమెను ప్రేమగా పిలుచుకునే. శివసేన మద్దతు పొందిన వర్షా, ముంబై మెట్రోపాలిటన్ ప్రాంతం నుండి గెలిపొందిన ఏకైక కాంగ్రెస్ అభ్యర్థి. చాలా మంది రాజకీయ



పరిశీలకులు వర్షా గెలుపును 'అన్ని అసమానతలకు వ్యతిరేకంగా' అని పేర్కొన్నారు. కాంగ్రెస్ సీనియర్ నేత ఏక్‌నాథ్ గైక్వాడ్ కుమార్తె అయిన వర్ష 2009-2010 మధ్య కాలంలో మహారాష్ట్ర విద్యాశాఖ మంత్రిగా కూడా పనిచేశారు. సామాజిక సేవకురాలిగా కూడా ఆమెకు అక్కడ మంచి గుర్తింపు ఉంది.

ఇక్రా మునవర్ హసన్

ఉత్తరప్రదేశ్ లోక్‌సభ ఎన్నికల్లో గేమ్ ఛేంజర్‌గా నిలిచింది. పశ్చిమ ఉత్తరప్రదేశ్‌లో కైరానా నియోజకవర్గం నుంచి సమాజ్‌వాదీ పార్టీ తరపున పోటీ చేసి బీజేపీకి చెందిన ప్రదీప్ కుమార్, బహుజన్ సమాజ్ పార్టీకి చెందిన శ్రీపాల్‌పై 69,116 ఓట్ల తేడాతో గెలుపొందింది. ఈమె లండన్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ ఓరియంటల్ అండ్ ఆఫ్రికన్ స్టడీస్‌లో, ఇంటర్నేషనల్ లాలో పోస్ట్ గ్రాడ్యుయేట్ పూర్తి చేశారు. ఇక్రా రెండుసార్లు ఎంపీగా, రెండుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన దివంగత మునవ్వర్ హసన్ కుమార్తె. 28 ఏండ్ల ఇక్రా స్త్రీవాది. ఆమె తన కుటుంబం సేవా వారసత్వాన్ని నిలబెట్టడానికి ఈ ఎన్నికల్లో పోరాడింది. మహిళా సమస్యలు పరిష్కరించాలని, మతం పేరుతో ప్రజల మధ్య ఏర్పడిన అంతరాన్ని తగ్గించాలని ఆమె బలంగా కోరుతుంది. యూపీలో తాను ప్రధానంగా రైతులు, మహిళల విద్యపై దృష్టి పెడతా అంటుంది.



డాక్టర్ ప్రభా మల్లికార్జున్, ప్రియాంక జార్కిహోళి

కర్ణాటక రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ మొత్తం ఆరుగురు అభ్యర్థులను నిలబెట్టింది. వీరిలో డాక్టర్ ప్రభా మల్లికార్జున్, ప్రియాంక జార్కిహోళి వరుసగా దావణగెరె, చిక్కోడి నియోజకవర్గాల నుండి విజయం సాధించారు. ప్రియాంక పబ్లిక్ వర్క్స్ శాఖ మంత్రి సతీష్ జార్కిహోళి కుమార్తె కాగా, డాక్టర్ ప్రభ గనులు, భూగర్భ శాస్త్ర శాఖ మంత్రి ఎస్ఎస్ మల్లికార్జున్ భార్య.





మహువా మొయిత్రా

పశ్చిమ బెంగాల్‌లోని కృష్ణానగర్ స్థానం నుండి తృణమూల్ కాంగ్రెస్ అభ్యర్థి మహువా మొయిత్రా 56,705 ఓట్లతో జనతా పార్టీ ప్రత్యర్థి అమృతా రాయ్‌పై విజయం సాధించారు. ఇది ఆమెలోని స్థైర్యానికి, ఆమెపై ప్రజలకున్న



విశ్వాసానికి నిదర్శనం. మహువా జూన్ 26, 2010న పార్లమెంటులో 'ఫాసిజం సంకేతాలు'పై చేసిన తొలి ప్రసంగం సోషల్ మీడియాలో ఆమెకు ప్రశంసలు తెచ్చిపెట్టింది. నరేంద్ర మోడీ, పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీల మధ్య అనుబంధంపై ఆమె అనేక ప్రశ్నలు లేవనెత్తారు. దాంతో బీజేపీ పార్టీ ఆమె గొంతు నొక్కేందుకు 2023లో ఎంపీ పదవి నుండి బహిష్కరణకు గురి చేసింది. అయినా ఆమె ఎక్కడా తగ్గలేదు. ప్రజల మద్దతుతో తిరిగి పార్లమెంటులో అడుగుపెడుతుంది. ఈ విజయం తన వ్యక్తిగత విజయం మాత్రమే కాదని, ప్రశ్నించే గొంతును అణిచివేసే వారికి ప్రజలిచ్చిన సమాధానంగా ఆమె అంటున్నారు.

మిసా భారతి



ఆర్‌జేడీ నాయకుడు లాలూ ప్రసాద్ యాదవ్ కుమార్తె ఈమె. కేంద్ర మంత్రి, బీహార్‌లోని పాటలీపుత్ర నుండి ప్రస్తుత ఎంపీ రామ్ కృపాల్ యాదవ్‌పై 85,174 ఓట్ల తేడాతో గెలుపొందారు. అంతకుముందు రెండుసార్లు స్వల్ప తేడాతో ఓడిపోయారు. పాట్నా జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలతో కలిసి ఉండే పాటలీపుత్ర సీటు కోసం 2009లో పోటీ చేసి లాలూ యాదవ్ గెలిచారు.

జెనిబెన్ నాగాజీ ఠాకూర్



ఈమె బనస్కాంత లోక్‌సభ నుండి 30,000 ఓట్ల తేడాతో బీజేపీకి చెందిన రేఖా చౌదరిని ఓడించి విజయం సాధించారు. గుజరాత్‌లో కాంగ్రెస్‌కు ఒక్క సీటు మాత్రమే లభించినప్పటికీ మొత్తం 26 స్థానాలను వరుసగా మూడోసారి కైవసం చేసుకోవాలనే బీజేపీ ఆశయాన్ని దెబ్బతీసిన ఠాకూర్ విజయం కీలకమైంది. వాస్తవానికి బనస్కాంత బీజేపీకి ఓ బలమైన కోట. రాహుల్ గాంధీని ఎంపీగా సస్పెండ్ చేసినందుకు నిరసనగా గత ఏడాది గుజరాత్ అసెంబ్లీ నుండి సస్పెండ్ చేసిన 16 మంది ఎమ్మెల్యేలలో ఠాకూర్ కూడా ఒకరు. ఫిబ్రవరి 2024లో, రాష్ట్రంలో నకిలీ ప్రభుత్వ కార్యాలయాల గురించి మాట్లాడినందుకు ఠాకూర్‌తో పాటు మరో 10 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలను మళ్లీ సస్పెండ్ చేశారు. ఇటువంటి ఆటంకాల మధ్య ఆమె సాధించిన విజయం నిజంగా గొప్పది.

ప్రియా సరోజ్



లోక్‌సభ ఎన్నికల్లో గెలుపొందిన అతి పిన్న వయస్కురాలు ప్రియా సరోజ్. ఆమె సమాజ్‌వాదీ పార్టీ టిక్కెట్‌పై ఉత్తరప్రదేశ్‌లోని మఛ్లిషహర్ స్థానం కోసం పోరాడారు. సరోజ్ మూడుసార్లు ఎంపీగా ఎన్నికైన తూఫాని సరోజ్ కుమార్తె అలాగే ప్రాక్టీస్‌లో ఉన్న న్యాయవాది. ఆమె 35,850 ఓట్ల తేడాతో బీజేపీ సిట్టింగ్ ఎంపీ భోలానాథ్‌పై విజయం సాధించారు. ఈ స్థానం నుండి 12 మంది పోటీలో ఉన్నారు. వీరిలో బీఎప్పీకి చెందిన కృపా శంకర్ సరోజ్ 157,291 ఓట్లు పొందారు. మిగిలిన తొమ్మిది మంది అభ్యర్థులు నాలుగు అంకెలను దాటలేకపోయారు.

కనిమొళి



తమిళనాడులోని తూత్తుకుడి నియోజకవర్గం నుంచి పోటీ చేసిన ద్రవిడ మున్నేట్ర కజగం (డీఎంకే) అభ్యర్థి కనిమొళి కరుణానిధి 5,40,729 ఓట్లు సాధించి తన స్థానాన్ని నిలబెట్టుకోగలిగారు. ఈమె తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి ఎం కరుణానిధి కుమార్తె. కేంద్రంలోని నియంతృత్వ బీజేపీ ప్రభుత్వాన్ని ఓడించాలని ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ ఈ ఎన్నికల్లో ఆమె విశ్రాంతి లేకుండా పెద్ద ఎత్తున ప్రచారంలో పాల్గొన్నారు.

సుప్రియా సూలే



శరద్ పవార్ కుమార్తె నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ సుప్రియా సూలే ముగిసిన లోక్‌సభ ఎన్నికల్లో విడిపోయిన కుటుంబ సభ్యులపై పోటీ చేయడాన్ని, తన పార్టీ పేరు, గుర్తును లాక్కోవడం నుండి అనేక సవాళ్లను అధిగమించాల్సి వచ్చింది. అయితే చివరికి ఆమె తన బారామతి లోక్‌సభ స్థానం నుండి 1.55 లక్షలకు పైగా ఓట్లతో విజయం సాధించారు. సూలే వరుసగా నాలుగోసారి తన స్థానాన్ని గెలుచుకోగలిగారు. ఈమె పార్లమెంటులో భ్రూణహత్యల వంటి అనేక సమస్యలపై అలాగే LGBTQIA+ హక్కులకు బలమైన మద్దతునిచ్చారు.

25లోపు అఫిడవిట్లు సమర్పించాలి

(మొదటిపేజీ తరువాయి)

విచారణ కమిషన్ ఛైర్మెన్ పీసీ ఘోష్ ఆదేశించారు. తప్పుడు సమాచారంతో అఫిడవిట్లు ఇస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హైదరాబాద్ లోని బూర్గుల రామకృష్ణారావు భవన్‌లో మీడియాతో మంగళవారం ఆయన చిట్‌చాట్ చేశారు. కాళేశ్వరం విచారణలో భాగంగా 20 మంది ఇంజినీర్లతో సమావేశమైనట్టు తెలిపారు. త్వరలో నిర్మాణ సంస్థలనూ విచారణకు పిలుస్తామని ప్రకటించారు. ప్రతి ఒక్కరూ నిబంధనల ప్రకారమే వ్యవహరించా లని సూచించారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల్లో అధికారుల పేర్లుంటే, వారికి కూడా నోటీసులు ఇస్తామని స్పష్టం చేశారు. బ్యారేజీలు సరిగ్గా పనిచేస్తే, ప్రజలకు ఎంతో లాభం జరుగుతుందని అభిప్రాయపడ్డారు. బ్యారేజీలతో లాభమే తప్ప నష్టం లేదని అనిపిస్తున్నదని వ్యాఖ్యానించారు. కమిషన్ చేసే పనులపై బుధవారం జాబితా తయారు చేస్తామని వివరించారు. మూడు బ్యారేజీల బాధ్యతలు చూసిన ఇంజినీర్లను విచారిస్తున్నామనీ, అఫిడవిట్ ద్వారా విషయాలు తెలియజేయాలని వారిని ఆదేశించామని తెలిపారు 'అఫిడవిట్ ద్వారా అన్ని అంశాలు రికార్డు అవుతాయి..బ్యారేజీల విషయంలో లెక్కలు ఎక్కడో తప్పినట్టు కనిపిస్తున్నది. లోపం ఎక్కడుంది ? ఎవరి ప్రమేయమైనా ఉందా ? తదితర విషయాలు తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నాం' అని జస్టిస్ పీసీ ఘోష్ వ్యాఖ్యానించారు.

అది ఫ్యామిలీ క్యాబినెట్

(మొదటిపేజీ తరువాయి)

ఏకనాథ్ ఖడ్సే కోడలు రక్ష ఖడ్సేకు, మాజీ ప్రధాని చరణ్ సింగ్ మనవడు జయంత్ చౌదరికి స్థానం కల్పించడాన్ని రాహుల్‌గాంధీ ప్రస్తావించారు. అలాగే, బీహార్ మాజీ ముఖ్యమంత్రి కర్పూరి ఠాకూర్ కుమారుడు రామ్‌నాథ్ ఠాకూర్, మాజీ కేంద్ర మంత్రి ఎర్రం నాయుడు కుమారుడు రామ్ మోహన్ నాయుడు, మాజీ కేంద్ర మంత్రి వేద్ ప్రకాశ్ గోయల్ కుమారుడు పీయూష్ గోయల్, హర్యానా మాజీ మంత్రి రావు బిరేంద్ర సింగ్ కుమారుడు ఇంద్రజీత్ సింగ్‌కు మంత్రులుగా అవకాశం ఇవ్వడాన్ని ఆయన గుర్తు చేశారు.

ప్రియాంక పోటీ చేసివుంటే..

తాజా లోక్‌సభ ఎన్నికల్లో వారణాసి నియోజకవర్గం నుంచి ప్రియాంకగాంధీ పోటీ చేసి ఉంటే ప్రధానమంత్రి మోడీ అక్కడ కనీసం రెండు లక్షల ఓట్ల తేడాతో ఓడిపోయేవారని కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీ అన్నారు. రాయ్‌బరేలీలో నిర్వహించిన కృతజ్ఞతా సభలో రాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారు. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ బలాన్ని తగ్గించడానికి రాయ్‌బరేలీ, అమేథితో పాటు దేశంలోని ఇతర నియోజకవర్గాల్లో ఇండియా వేదిక పార్టీలు ఐక్యంగా పోరాటం చేశాయని అన్నారు. ఎన్నికల ఫలితాలపై అహంకారానికి లోనుకాకుండా, ప్రజల ప్రయోజనాల కోసం ఇండియా వేదిక ఎంపీలు పనిచేస్తామని రాహుల్ గాంధీ ఈ సందర్భంగా తెలిపారు. అయోధ్యలో రామమందిరం ప్రారంభోత్సవంలో సామాన్య ప్రజలను విస్మరించిన మోడీ పారిశ్రామికవేత్తలు, ఇతర ప్రముఖులకు ప్రాధాన్యత ఇచ్చారని, అయోధ్యలో ఓటమితో బీజేపీకి ప్రజలు తగిన గుణపాఠం చెప్పారని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ కూడా పాల్గొన్నారు. రాయ్‌బరేలీలో కాంగ్రెస్‌ను గెలిపించినందుకు ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపారు.

పరీక్షల పవిత్రత దెబ్బతింది

(మొదటిపేజీ తరువాయి)

కోల్పోవడమేంటో ఇంతవరకు వెల్లడించలేదని వారు పేర్కొన్నారు. ఈ పరీక్ష నిర్వహణలో మోసాలు జరిగే ప్రమాదాలువున్నాయని, శాస్త్ర, సాంకేతిక, వైద్య పరిజ్ఞానానికి సంబంధించి లోతైన అవగాహన కలిగివుండాల్సిన ఇటువంటి పరీక్షల్లో మోసాలు లేదా అక్రమాలు జరిగితే అది అంతిమంగా రోగుల ప్రాణాలకే ముప్పు తీసుకువస్తుందని పిటిషన్ హెచ్చరించింది.

ఫోన్ ట్యాపింగ్ కేసులో ఆరుగురిపై చార్జిషీట్

(మొదటిపేజీ తరువాయి)

నేతలతో పాటు విపక్షాలకు చెందిన పలువురు నాయకులు, వ్యాపారులు, సెలబ్రిటీలు, ప్రముఖులు, ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లపై ఒక వ్యూహం ప్రకారం పై నిందితులు ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడ్డారని తెలిపారు. ముఖ్యంగా ఎస్ఐబీ మాజీ ఐజీ ప్రభాకర్‌రావుతో పాటు మరికొందరు టీమ్‌గా ఏర్పడి ఫోన్ ట్యాపింగ్ చేశారని పేర్కొ న్నారు. ప్రధానంగా ఎన్నికల సమయంలో విపక్షాలకు చెందిన నాయకుల ఫోన్ల ట్యాపింగ్‌కు పాల్పడి భారీ మొత్తంలో వారికి చెందిన కోట్ల రూపాయల డబ్బులను సీజ్ చేశారని చార్జిషీట్‌లో వివరించారు. ఫోన్‌ట్యాపింగ్ కోసం ఎస్ఐబీ కార్యాలయంలోనే ప్రత్యేక గదిని ఏర్పాటు చేసి పదిహేడుకుపైగా కంప్యూటర్లతో వాటికి అత్యంత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ఫోన్ ట్యాపింగ్ పరికరాలను అమర్చి మరీ ఆపరేషన్లకు పాల్పడ్డారని దర్యాప్తు అధికారులు పేర్కొన్నారు. వీరంతా కలిసి దాదాపు 1400 మందికిపైగా ప్రముఖుల ఫోన్లను ట్యాపింగ్ చేసినట్టు తెలిపారు. ముఖ్యంగా ప్రభాకర్‌రావు ఆదేశాలు, సూచనల మేరకే ఫోన్ ట్యాపింగ్ జరిపామనీ, ఐన్యూస్ సీఈఓ శ్రవణ్‌కుమార్ కూడా కీలక పాత్ర పోషించారని పట్టుబడ్డ నిందితులు తమ వాంగ్మూలం ఇచ్చినట్టు కూడా వివరించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో గతేడాది డిసెంబర్ నెలలోనే ప్రభాకర్‌రావు ఆదేశాల మేరకు ఫోన్ ట్యాపింగ్‌లకు సంబంధించిన కంప్యూటర్లు, హార్డ్‌డిస్కులు, సాంకేతిక పరికాలను ధ్వంసం చేసి నిందితుల్లో ఒకరైన ప్రణీత్‌రావు ఆ సామగ్రిని మూసీ నదితో పాటు బేగంపేట కాలువలో పారేసి ఆధారాలను మాయం చేయడానికి కుట్ర పన్నారని చార్జిషీట్‌లో తెలిపారు. గత మార్చి పదో తేదీన ఈ కేసుపై ఎఫ్ఐఆర్ నమోదైన దానికంటే కొద్ది రోజుల ముందు మాజీ ఐజీ ప్రభాకర్‌రావు, శ్రవణ్‌కుమార్ దేశం విడిచి పారిపోయారనీ, వారి కోసం రెడ్ కార్నర్ నోటీసులు కూడా జారీ చేశామని తెలిపారు. వారిని అదుపులోకి తీసుకుని విచారిస్తే ఈ కేసులో మరిన్ని నిజాలతో పాటు ఫోన్ ట్యాపింగ్‌కు ప్రేరేపించిన అప్పటి ప్రభుత్వ ప్రముఖుల వివరాలు బయటపడే అవకాశాలుంటాయని ఈ చార్జిషీట్‌లో సూచనప్రాయంగా తెలిపినట్టు సమాచారం.

బెయిల్‌పై నేడు నిర్ణయం

ఇదిలా ఉంటే ఈ కేసులో నిందితులైన అదనపు ఎస్పీలు భుజంగరావు, తిరుపతన్నకు బెయిల్ ఇచ్చే విషయంపై నాంపల్లి కోర్టు నేడు నిర్ణయం తీసుకోనున్నది. మంగళవారం వీరిద్దరికీ బెయిల్ ఇచ్చే విషయంపై నాంపల్లి కోర్టులో పబ్లిక్ ప్రాసిక్యూటర్‌తో పాటు నిందితుల తరపు న్యాయవాదుల మధ్య వాదప్రతివాదనలు జరిగాయి. కాగా, ఈ కేసులో ఇద్దరు అధికారులను ఉద్దేశపూర్వకంగా నిందితులుగా చేర్చారనీ, వారికి బెయిల్ మంజూరు చేయాలంటూ నిందితుల తరపు న్యాయవాదులు వాదించారు. ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడినట్టు పలు ఆధారాలున్నాయనీ, ఈ నేపథ్యంలో వీరిద్దరికీ బెయిల్ లభిస్తే ఆధారాలను తారుమారు చేసే ప్రమాదముందని పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదించారు. వీరి వాదనలు విన్న న్యాయమూర్తి వారిద్దరి బెయిల్ మంజూరుపై నిర్ణయాన్ని మరుసటి రోజుకు వాయిదా వేశారు.

మోడీ మంత్రి వర్గంలో నేరచరితులు..

28మంది మంత్రులపై క్రిమినల్ కేసులు

- అత్యంత సంపన్నుడిగా పెమ్మసాని

న్యూఢిల్లీ : కేంద్రంలో కొత్తగా కొలువుతీరిన మోడీ మంత్రివర్గంలో 28 మందిపై క్రిమినల్ కేసులున్నాయి. ఇందులో 19 మంది హత్యాయత్నం, మహిళలపై నేరాలు, విద్వేష ప్రసంగాలు.. వంటి తీవ్రమైన అభియోగాలు ఎదుర్కొంటున్నారు. ఈ విషయాలను ఏడీఆర్ నివేదిక వెల్లడించింది. ఇద్దరు మంత్రులు ఐపీసీ సెక్షన్ 307 కింద హత్యాయత్నం ఆరోపణలున్నాయి. నౌకాశ్రయాలు, షిప్పింగ్, జలమార్గాల శాఖ సహాయ మంత్రి శంతను ఠాకూర్, విద్యా శాఖ, ఈశాన్య ప్రాంతాల అభివృద్ధి శాఖ సహాయ మంత్రి సుకంత మజుందర్‌పై ఈ కేసులున్నాయి. హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్, ఠాకూర్, మజుందర్, పెట్రోలియం, సహజవాయువులు, టూరిజం శాఖ సహాయ మంత్రి సురేష్ గోపి, గిరిజన వ్యవహారాల శాఖ సహాయ మంత్రి జౌల్ ఓరంలు మహిళలపై వేధింపుల కేసులు ఎదుర్కొంటున్నారు. ఎనిమిది మంది మంత్రులపై విద్వేష ప్రసంగాల కేసులున్నాయని ఏడీఆర్ తెలిపింది. మొత్తం 71 మంత్రుల్లో 28 మంది (39 శాతం)పై క్రిమినల్ కేసులున్నాయని వెల్లడించింది.

99 శాతం కేంద్ర మంత్రులు కోటీశ్వరులు

ప్రధాని మోడీ కొత్త మంత్రివర్గంలోని 71 మంది మంత్రుల్లో 70 మంది (99 శాతం) కోటీశ్వరులే ఉన్నారు. 71 మంది మంత్రుల సగటు ఆస్తులు రూ.107.94 కోట్లు. ఆరుగురు మంత్రులకు రూ.100 కోట్లకు పైగా ఆస్తులు ఉన్నట్లు నివేదిక వెల్లడించింది. మోడీ నేతృత్వంలోని కొత్త మంత్రివర్గంలో బీజేపీ నుంచి 61 మంది, ఎన్డీఏ మిత్రపక్షాల నుంచి 11 మంది మంత్రులు ఉన్నారు. 72 మంది మంత్రుల్లో 43 మంది మూడు లేదా అంతకంటే ఎక్కువ సార్లు ఎంపీలుగా ఎన్నికయ్యారు. 39 మంది గతంలో కేంద్ర ప్రభుత్వంలో మంత్రులుగా ఉన్నారు.

పెమ్మసానే సంపన్నుడు

మోడీ మంత్రివర్గంలో అత్యంత ధనిక మంత్రిగా టీడీపీ నుంచి లోక్‌సభకు ఎన్నికైన పెమ్మసాని చంద్రశేఖర్ నిలిచారు. ఆయనను గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖకు సహాయ మంత్రిగా నియమించారు. కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా రెండో స్థానం, మూడో స్థానంలో ఉన్న హెచ్ డి కుమారస్వామి కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ మంత్రిగా నియమితులయ్యారు. అశ్విని వైష్ణవ్ రైల్వే, ఐ అండ్ బీ, ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖల మంత్రిగా ఉన్నారు. ఐదో స్థానంలో ఉన్న పీయూష్ గోయల్ కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రిగా ఉన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయడానికి ముందు దాఖలు చేసిన ఎన్నికల అఫిడవిట్ల ఆధారంగా ఈ మంత్రుల ఆస్తులను ఏడీఆర్ లెక్కించింది.

71 మంది కేంద్ర మంత్రుల్లో 47 (66 శాతం) మంది కొత్తవారు కాగా, వారి వయస్సు 51-71 మధ్య ఉంది. 11 మంది ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత సాధించగా, 57 మంది గ్రాడ్యుయేషన్, ఆపై చదివారు.

ఏపీ రాజధానిగా అమరావతి

(మొదటిపేజీ తరువాయి)

కార్యకర్తలు సమష్టిగా పనిచేశారన్నారు. ప్రజల మనోభావాల మేరకు కార్యకర్తలు పనిచేశారని కితాబునిచ్చారు. మూడు పార్టీల నేతలు, కార్యకర్తలకు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలిపారు. ప్రజల తీర్పుతో ఏపీ ప్రతిష్ట, గౌరవం పెరిగాయన్నారు. రాష్ట్ర ప్రయోజనాల దష్ట్యా టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తు పెట్టుకున్నాయని తెలిపారు.

ఏపీ గవర్నర్‌ను కలిసిన కూటమి నేతలు

ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ ఏర్పాటు కోసం కూటమి నేతలు గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌ను కలిశారు. ఎన్డీయే కూటమి శాసనసభా పక్ష సమావేశం ముగిసిన అనంతరం వారు నేరుగా రాజ్‌భవన్‌కు వెళ్లారు. ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యేల తరపున సభానాయకుడిగా టీడీపీ అధినేత, కుప్పం ఎమ్మెల్యే చంద్రబాబు నాయుడును ఎన్నుకున్నట్లు వెల్లడించారు.

ఈ మేరకు గవర్నర్‌కు 164 మంది ఎమ్మెల్యేల సంతకాలతో కూడిన లేఖను అందజేశారు. ప్రభుత్వ ఏర్పాటుకు కావాల్సిన సంఖ్యా బలం తమకు ఉన్నందున అందుకు ఆహ్వానించాలని ఈ సందర్భంగా వారు గవర్నర్‌ను కోరారు. ఆయనను కలిసిన వారిలో టీడీపీ నుంచి అచ్చెన్నాయుడు, జనసేన నుంచి నాదెండ్ల, బీజేపీ నుంచి పురందేశ్వరి ఉన్నారు.

గాజాలో కాల్పులు విరమించాలి

న్యూయార్క్ : గాజాపై గత 8మాసాలుగా ఇజ్రాయిల్ సాగిస్తున్న దాడులకు అంతం పలికే లక్ష్యంతో కాల్పుల విరమణ ప్రతిపాదనను ధ్రువీకరిస్తూ ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి ఒక తీర్మానాన్ని ఆమోదించింది. 14-0 ఓట్ల తేడాతో సోమవారం ఈ తీర్మానం ఆమోదించబడింది. గత నెల్లో ప్రకటించిన మూడంచెల కాల్పుల విరమణ ప్రతిపాదనను తీర్మానం స్వాగతించింది. తొలి దశలో భాగంగా తొలుత ఆరు వారాల పాటు కాల్పుల విరమణ పాటించాలని, గాజాలో కొంతమంది బందీల విడుదలకు ప్రతిగా ఇజ్రాయిల్ జైళ్లలో మగ్గుతున్న పాలస్తీనా ఖైదీలను విడుదల చేయాలని ఆ తీర్మానం కోరుతోంది. ఇక రెండో దశలో శాశ్వత కాల్పుల విరమణ, మిగిలిన బందీల విడుదల అమలు జరగాలి. పూర్తిగా విధ్వంసమైన గాజా పునర్నిర్మాణ ప్రయత్నాలు మూడో దశలో చేపట్టాలి. ఇజ్రాయిల్ ఈ ప్రతిపాదనను ఆమోదించిందని అమెరికా చెబుతోంది. హమస్ ఆమోదించాలని తీర్మానం కోరుతోంది. ఈ ప్రతిపాదనను తాము సానుకూలంగా పరిశీలిస్తున్నట్లు తొలుత వ్యాఖ్యానించింది. ఎలాంటి షరతులు లేకుండా ఈ తీర్మానాన్ని ఇరు పక్షాలు పూర్తిగా అమలు చేయాలని కోరింది. తీర్మానంపై ఓటింగ్ అనంతరం హమాస్ ఒక ప్రకటన చేస్తూ, మధ్యవర్తులతో సహకరించడానికి సిద్ధంగా వున్నామని చెప్పింది. ఒప్పందం అమలుపై పరోక్షంగా చర్చలకు కూడా సిద్ధంగా వున్నామని తెలిపింది. ఎట్టకేలకు ఇది అమల్లోకి వస్తుందా లేదా అనేదే పెద్ద ప్రశ్నగా మిగిలిందని మీడియా వర్గాలు వ్యాఖ్యానించాయి. ఏ ఒప్పందం కుదుర్చుకున్నా అది అంతిమంగా శాశ్వత కాల్పుల విరమణకు దారి తీయాలని, గాజా నుండి పూర్తిగా ఇజ్రాయిల్ బలగాలు వైదొలగాలని, గాజా పునర్నిర్మాణం జరగాలని హమాస్ కోరుతోంది.

సింగరేణిలో 'కారుణ్య' వయోపరిమితి పెంపు

(మొదటిపేజీ తరువాయి)

పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఆ మేరకు గతంలో 35 ఏండ్ల వరకే పరిమితి ఉండగా, తాజాగా 40 ఏండ్ల వరకు వయోపరిమితి సడలిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీనివల్ల సంస్థలో దాదాపు 300 మందికి ప్రయోజనం చేకూరుతుందని సింగరేణి సీఎమ్‌డీ ఎన్ బలరాం నాయక్ తెలిపారు. సింగరేణిలో ఉద్యోగం చేస్తూ అకాల మరణం చెందిన వారి కుటుంబాల్లో ఒకరికి, అనారోగ్యంతో (మెడికల్ అన్‌ఫిట్) ఉద్యోగ విరమణ చేసిన వారి పిల్లలను బదిలీ కార్మికునిగా కారుణ్య నియామకాల కింద ఉద్యోగంలోకి తీసుకుంటారు. గతంలో 18 నుంచి 35 ఏండ్లలోపు వారినే కారుణ్య నియామకాల కింద తీసుకునే వారు. కరోనా కాలంలో రెండేండ్లు వైద్య పరీక్షలు నిర్వహించకపోవడంతో సింగరేణి కార్మికుల నుంచి వచ్చిన విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కారుణ్య నియామకాల వయో పరిమితిని పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. ఈ ఉత్తర్వులను 2018 మార్చి 9వ తేదీ నుంచి అమలు చేస్తామని సీఎమ్‌డీ బలరాం నాయక్ వివరించారు.

జులై 30 వరకు గడువివ్వండి

(మొదటిపేజీ తరువాయి)

నెలలోనే ఇచ్చారు. దీనిపై తాజాగా తనకు వివరణ ఇచ్చేందుకు జులై 30వ తేదీ వరకు గడువు కావాలని కేసీఆర్ కోరారు. ఈ విజ్ఞప్తిని కమిషన్ తిరస్కరించింది. జూన్ 15వ తేదీలోపు వివరణ ఇవ్వాలని ఆదేశించింది. పై అంశాలపై ఏకసభ్య కమిషన్ ఇప్పటికే పౌరసమాజం నుంచి పిటీషన్లు స్వీకరించింది. ఈ అంశాలతో సంబంధం ఉన్న 28 మందికి ఏప్రిల్ నెలలోనే నోటీసులు జారీ చేసింది. దానిలో భాగంగా సోమవారం టీజీఎస్‌జెన్‌కో, ట్రాన్స్‌కో మాజీ సీఎమ్‌డీ దేవులపల్లి ప్రభాకరరావు, ఇంధనశాఖ మాజీ కార్యదర్శి సురేష్‌చందా (రిటైర్డ్) కమిషన్ ఎదుట హాజరై తమ వాదన వినిపించారు. మంగళవారం ఇంధన శాఖ మాజీ కార్యదర్శులు అర్వింద్ కుమార్, ఎస్కే జోషి (రిటైర్డ్)లు కమిషన్ ఎదుట హాజరయ్యారు. వారిని విచారించిన కమిషన్ పలు విషయాలపై వివరణలు కోరింది. ప్రభుత్వ స్థాయిలో తీసుకున్న నిర్ణయాలనే తాము అమలు చేశామని వారు చెప్పినట్టు సమాచారం.

మిత్రులకు మొండిచేయి

(మొదటిపేజీ తరువాయి)

తన తండ్రి రాం విలాస్ పాశ్వాన్ నిర్వహించిన రైల్వే శాఖను తనకు కేటాయించాలని చిరాగ్ కూడా అడిగారు. కానీ నరేంద్ర మోడీ మాత్రం కీలక శాఖలన్నింటినీ బీజేపీ సభ్యులకే కట్టబెట్టారు. మిత్రపక్షాలకు పరిమాణంలోనే (క్వాంటిటీ) కాదు...నాణ్యత (క్వాలిటీ)లోనూ మొండిచేయే చూపారని ఆమ్‌ఆద్మీ పార్టీ ఎంపీ సంజయ్ సింగ్ వ్యంగ్యోక్తి విసిరారు. 'హోం లేదు. రక్షణ లేదు. ఆర్థికం లేదు. విదేశాంగ శాఖా లేదు. వాణిజ్యం లేదు. రైల్వే లేదు. విద్య లేదు. ఆరోగ్యమూ లేదు. వ్యవసాయం లేదు. జల శక్తీ లేదు. పెట్రోలియం లేదు. టెలీకమ్యూనికేషన్లూ లేవు' అని సెటైర్ వేశారు. బీజేపీ మిత్రపక్షాలకు ఇది అవమానకరమని ఆయన చెప్పారు. కాగా మంత్రి పదవిని ఎన్‌సీపీ నేత ప్రఫుల్ పటేల్ తిరస్కరించారని, తనకు ఇవ్వజూపిన పదవి తన స్థాయిని తగ్గిస్తుందని ఆయన భావించారని కాంగ్రెస్ ప్రతినిధి జైరాం రమేష్ తెలిపారు.

విమాన ప్రమాదంలో విషాదం

(మొదటిపేజీ తరువాయి)

తెలిపారు. ఆ సమయంలో విమానంలో ఉపాధ్యక్షుడు, మాజీ అధ్యక్షుని భార్య, ఏడుగురు ప్రయాణికులు, ముగ్గురు మిలటరీ సిబ్బంది వున్నారు. సోమవారం రాజధాని నగరం నుండి బయలుదేరిన విమానం 45నిముషాల తర్వాత ముజ్జు అంతర్జాతీయ విమానాశ్రయంలో దిగాల్సి వుంది. కానీ ఈలోగానే కూలిపోయింది. విమాన శిథిలాలను సహాయక సిబ్బంది కనుగొన్నారు. అనంతరం అధ్యక్షుడు లాజరస్ చాక్వెరా మాట్లాడుతూ, కొండకు సమీపంలో విమాన శిథిలాలను కనుగొన్నారని చెప్పారు. ఉపాధ్యక్షుడిగా రెండోసారి బాధ్యతలు చేపట్టిన చిలిమా వచ్చే అధ్యక్ష ఎన్నికల్లో పోటీచేస్తారని భావించారు. 2022లో ఆయనపై ముడుపుల ఆరోపణలు రావడంతో అరెస్టు చేశారు. అయితే గత నెల్లోనే ఆయనపై అభియోగాలను కోర్టు ఉపసంహరించింది. ఈ కేసును కొనసాగించాలనుకోవడం లేదని పబ్లిక్ ప్రాసిక్యూషన్ డైరెక్టర్ నోటీసులు పంపడంతో కోర్టు కేసును మూసేసింది.

ఆటలు నవతెలంగాణ

ఖమ్మం బుధవారం 12 జూన్ 2024 12

పాకిస్థాన్‌పై సూపర్ విక్టరీ సాధించిన ఉత్సాహంలో ఉన్న ఆతిథ్య అమెరికా.. పాక్‌ను తనదైన శైలిలో మళ్లీ చిత్తుగా ఓడించిన భారత్ నేడు ముఖాముఖికి సిద్ధమయ్యాయి. మెరుపు విజయాలు నమోదు చేసిన అమెరికా సూపర్8 బెర్త్‌పై కన్నేయగా.. గ్రూప్‌లో అగ్రస్థానంతో సూపర్ 8కు చేరుకోవాలని రోహిత్ శర్మ భావిస్తోంది. సంచలన జట్టు అమెరికా మరో వండర్‌పై ఆశలు పెట్టుకోగా.. టీమ్ ఇండియా మరో ఏకపక్ష విజయంపై కన్నేసి బరిలోకి దిగుతోంది. ఐసీసీ టీ20 ప్రపంచకప్‌లో భారత్, అమెరికా పోరు నేడు.

భారత్‌కు ఎదురుందా?

నేడు అమెరికాతో టీమ్ ఇండియా ఢీ

మరో సంచలనంపై ఆతిథ్య జట్టు ఆశలు

ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2024

రాత్రి 8 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..



నవతెలంగాణ-న్యూయార్క్

ప్రపంచ క్రికెట్ అగ్రజట్టు భారత్‌తో పసికూన అమెరికా తొలిసారి ముఖాముఖి పోరుకు సిద్ధమైంది. ఆతిథ్య జట్టుగా టీ20 ప్రపంచకప్‌కు అర్హత సాధించిన అమెరికా గ్రూప్-ఏలో ఇప్పటికే సంచలన విజయాలు నమోదు చేసింది. తొలి రెండు మ్యాచుల్లో విజయాలు సాధించి విమర్శకులను మెప్పించింది. నేడు అగ్రజట్టు టీమ్ ఇండియాతో పోరుకు సై అంటోంది. మరోవైపు భారత్ పసికూనతో పోరుకు సైతం పకడ్బందీగా సన్నద్ధమవుతుంది. హ్యాట్రిక్ విజయంపై కన్నేసిన రోహిత్ శర్మ నేడు మరింత మెరుగైన ప్రదర్శన చేయాలని ఎదురుచూస్తున్నాడు. ఆతిథ్య అమెరికా అభిమానులు సహా భారత అభిమానులు ఎదురుచూస్తున్న క్రేజీ మ్యాచ్‌కు నేడు న్యూయార్క్‌లోని నాసా కౌంటీ ఇంటర్నేషనల్ స్టేడియం వేదిక కానుంది.



పంత్ ఒక్కడే.. : గ్రూప్-ఏలో భారత్ రెండు విజయాలు సాధించింది. ఈ రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ నిలకడగా రాణించిన బ్యాటర్ రిషబ్ పంత్ ఒక్కడే. బంగ్లాదేశ్‌తో వార్మప్‌లోనూ పంత్ అర్థ సెంచరీతో మెరిశాడు. కెప్టెన్ రోహిత్ శర్మ ఐర్లాండ్‌పై అర్థ సెంచరీ బాదినా.. పాక్‌తో మ్యాచ్‌లో నిరాశపరిచాడు. స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి రెండు ఇన్నింగ్స్‌ల్లో విఫలమయ్యాడు. దీంతో ఓపెనర్ల నిలకడలేమి భారత్‌ను ఆందోళనకు గురి చేస్తోంది. సూర్యకుమార్ యాదవ్ సైతం అంచనాలను అందుకోవటం లేదు. రిషబ్ పంత్‌కు తోడుగా రోహిత్, కోహ్లి, సూర్య మెరిస్తే అమెరికా బౌలర్లకు నేడు న్యూయార్క్‌లో పగలే చుక్కలు కనిపిస్తాయి!. లోయర్ ఆర్డర్‌లో హార్దిక్ పాండ్య, రవీంద్ర జడేజా బ్యాట్‌తో బాధ్యత తీసుకోవాల్సి ఉంది. పాక్‌తో మ్యాచ్‌లో అక్షర్ పటేల్‌ను బ్యాటింగ్ ఆర్డర్‌లో ప్రమోట్ చేయటం బాగా కలిసొచ్చింది. నాకౌట్ మ్యాచుల అవసరం కోసం అక్షర్ పటేల్‌ను అవసరమైతే నేడు సైతం ముందుగానే బ్యాటింగ్‌కు పంపే అవకాశం ఉంది. జశ్‌ప్రీత్ బుమ్రా, అర్షదీప్ సింగ్, మహ్మద్ సిరాజ్ త్రయం జోరుమీదుంది. ఇక్కడ భారత్ ఇప్పటికే మూడు మ్యాచులు (వార్మప్‌తో కలిపి) ఆడటంతో నేడు మ్యాచ్‌లో పిచ్ స్వభావం, పరిస్థితులపై మంచి అవగాహనతోనే బరిలోకి దిగనున్నారు.

అమెరికాతో జాగ్రత్త! : ఆతిథ్య అమెరికాను తేలిగ్గా తీసిపారేయడానికి ఏమాత్రం వీలులేదు. పేరుకే అమెరికా జట్టు అయినా.. ఆ బృందంలో సగానికి పైగా భారత సంతతి క్రికెటర్లే ఉన్నారు. ఆరోన్ జోన్స్, మోనాంక్ పటేల్, ఆండ్రీస్ గౌస్, నితీశ్ కుమార్, మిలింద్ కుమార్, స్టీవెన్ టేలర్‌లు ఊపుమీదున్నారు. కెనడా, పాకిస్థాన్‌లపై విజయాల్లో వీరి పాత్ర అమోఘం. నేడు భారత్‌తో మ్యాచ్‌లో మెరిసి ప్రపంచం దృష్టిని తమ వైపునకు తిప్పుకునేందుకు అమెరికా ప్రయత్నించనుంది. ఇక సొంతగడ్డపై ఆడుతున్న అమెరికాకు విచిత్రంగా అభిమానుల మద్దతు లభించటం కష్టమే. భారత అభిమానులో స్టేడియం నిండిపోనుండగా.. ఆతిథ్య జట్టు కాస్త వింత అనుభూతిని ఎదుర్కొనే అవకాశం లేకపోలేదు.

యశస్వికి అవకాశం ఉందా? : భారత్ తొలి రెండు మ్యాచుల్లో తుది జట్టులో ఎటువంటి మార్పులు చేయలేదు. టాప్ ఆర్డర్‌లో విరాట్ కోహ్లి ఇంకా పరిస్థితులకు అలవాటు పడినట్టు అనిపించటం లేదు. సూర్యకుమార్ యాదవ్ సైతం టచ్‌లోకి రాలేదు. దీంతో టాప్ ఆర్డర్‌కు బలమైన మిడిల్ ఆర్డర్‌ను జోడించేందుకు బ్యాటింగ్ లైనప్‌లో మార్పులు చేసే ఆలోచన ఉంది. యశస్వి జైస్వాల్‌ను టాప్ ఆర్డర్‌లో చేర్చేందుకు జట్టు మేనేజ్‌మెంట్ సిద్ధంగా ఉంది. పేస్ ఆల్‌రౌండర్ శివం దూబెను బెంచ్‌కు పరిమితం చేసి యశస్వి జైస్వాల్‌ను బ్యాటింగ్ లైనప్‌లో తీసుకోనున్నారు. సంజు శాంసన్ సైతం రేసులో నిలిచినా.. విరాట్ కోహ్లి ఫామ్ దృష్ట్యా జైస్వాల్‌కు మొగ్గు కనిపిస్తుంది. బౌలింగ్ విభాగంలో ఎటువంటి మార్పులు ఉండే అవకాశం లేదు. ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్య, రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్ జట్టుకు సమతూకం తీసుకొస్తున్నారు.

పిచ్, వాతావరణం : భారత్, అమెరికా మ్యాచ్‌కు ఎటువంటి వర్షం సూచనలు లేవు. న్యూయార్క్ నాసా కౌంటీ స్టేడియం పిచ్ మరోసారి చర్చకు రానుంది. పిచ్ పగుళ్ల నుంచి పచ్చిక మొలకెత్తటంతో అదనపు సీమ్, బౌన్స్ లభిస్తుందని క్యూరేటర్ తెలిపాడు. నేడు మ్యాచ్‌కు పాత పిచ్‌నే వాడనున్నారు. దీంతో పరుగుల వేటలో బ్యాటర్లకు కాస్త ఉపశమనం కలిగే అవకాశం ఉంది. బౌలర్లకు అనుకూలించే పిచ్‌పై టాస్ నెగ్గిన జట్టు తొలుత ఫీల్డింగ్ ఎంచుకునేందుకు మొగ్గు చూపవచ్చు.

వికలాంగుల చట్టాల అమలులో కేంద్రం విఫలం

సామాజిక వివక్షను అరికట్టాలి

ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలి

బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలి

ఆగస్టు 24-26 తేదీల్లో ఎన్‌పీఆర్డీ రాష్ట్ర నాల్గొవ మహాసభ

మహాసభ ఆహ్వాన సంఘం సన్నాహక సమావేశంలో వక్తలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

వికలాంగుల చట్టాల అమలులో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని, నేటికీ వారి పట్ల కొనసాగుతున్న సామాజిక వివక్షను అరికట్టాలని ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మంగళవారం ఎన్‌పీఆర్డీ రాష్ట్ర 4వ మహాసభ ఆహ్వాన సంఘం సన్నాహక సమావేశం జరిగింది. ఎన్‌పీఆర్డీ రాష్ట్ర అధ్యక్షులు కె.వెంకట్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అడివయ్య మాట్లాడారు. 2011 జనాభా లెక్కల ప్రకారం దేశంలో 2.21శాతం మంది వికలాంగులు ఉన్నారని తెలిపారు. 76శాతం మంది గ్రామీణ ప్రాంతంలో, 24శాతం మంది పట్టణ ప్రాంతంలో నివసిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ, ప్రభుత్వయేతర సౌకర్యాలు వికలాంగులకు అందడం లేదన్నారు. రాష్ట్రంలో 40 లక్షల మంది వికలాంగులు ఉంటే.. 5.75 లక్షల మందికే పెన్షన్స్ వస్తోందని చెప్పారు.

కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్ బాబు మాట్లాడుతూ.. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న వికలాంగుల బ్యాక్‌లాగ్ పోస్టులను ప్రకటించి, ప్రత్యేక నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. శారీరక వికలాంగుల రోస్టర్ 10 లోపు తగ్గిస్తూ స్టేట్ సబార్డినేట్ సర్వీస్ రూల్స్ సవరించాలని కోరారు. వికలాంగులకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. నిరుద్యోగ వికలాంగులకు స్వయం ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వ, ప్రయివేట్ భాగస్వామ్యంతో ప్రత్యేక పథకాన్ని ప్రవేశ పెట్టాలని డిమాండ్ చేశారు.

ఎన్‌పీఆర్డీ రాష్ట్ర అధ్యక్షులు కె.వెంకట్ మాట్లాడుతూ.. వికలాంగులపై వేధింపులను అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. తీవ్ర వైకల్యం కలిగిన వికలాంగులకు ప్రత్యేక అలవెన్స్ ఇవ్వాలని నిర్ణయం చేసినా ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. ఉన్న వివాహ ప్రోత్సాహకం నిధులు వెంటనే విడుదల చేయాలన్నారు. వికలాంగుల సంక్షేమ శాఖ అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. 2016 వికలాంగుల హక్కుల పరిరక్షణ చట్టం అమలు పర్యవేక్షణ కోసం రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిలో కో-ఆర్డినేషన్ కమిటీలను ఎందుకు ఏర్పాటు చేయడం లేదని ప్రశ్నించారు. మానసిక, ఆటిజం, హీమోఫిలియా, సికిల్ సెల్ కండరాల క్షీణత వంటి వైకల్యాలు కలిగిన వికలాంగుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి పెట్టాలన్నారు.

డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో మానసిక వైకల్యం కలిగిన విద్యార్థులు 5 లక్షల మంది ఉన్నారని తెలిపారు. వీరికి ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల్లో చదువుకునే హక్కు లేకుండా పోతున్నదన్నారు. 2009 విద్యాహక్కు చట్టం, 2016 ఆర్‌పీడబ్ల్యూడీ చట్టం ప్రకారం మానసిక వైకల్యం కలిగిన వారికి పాఠశాలల్లో అడ్మిషన్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. మూగ, చెవిటి వైకల్యం కలిగిన 2 లక్షల మంది విద్యార్థులకు సైన్ లాంగ్వేజ్ అందుబాటులో లేదన్నారు. ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులను గుర్తించి వారికి విద్యావకాశాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

కోశాధికారి ఆర్.వెంకటేష్, కేంద్ర కమిటీ సభ్యులు జెర్కొని రాజు మాట్లాడుతూ.. ఆగస్టు 24-26 తేదీల్లో ఎన్‌పీఆర్డీ రాష్ట్ర 4వ మహాసభ గ్రేటర్ హైదరాబాద్‌లో నిర్వహి స్తున్నామని తెలిపారు. మహాసభలో దేశం, రాష్ట్రంలో వికలాంగుల స్థితిగతులు, వారి సమస్యలను చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామన్నారు. మహాసభ సందర్భంగా అన్ని జిల్లా కేంద్రాల్లో సదస్సులు, సెమినార్లు నిర్వహిస్తామని తెలిపారు. మహాసభకు 33జిల్లాల నుంచి 700 మంది ప్రతినిధులు హాజరవుతారన్నారు.

ఆహ్వాన సంఘం ఏర్పాటు

మహాసభ ఆహ్వాన సంఘం గౌరవ అధ్యక్షులుగా పి.ఉమర్ ఖాన్, చీఫ్ అడ్వైజర్‌గా కె.వి.కె రావు, చైర్మెన్‌గా ముత్తినేని వీరయ్య వర్మ, తెలంగాణ రాష్ట్ర వికలాంగుల కో-ఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మెన్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.అడివయ్య ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకటేష్, కోశాధికారి కె.వెంకట్‌తో పాటు 300 మందితో ఆహ్వాన సంఘం ఏర్పాటు చేశారు.

ఆహార కల్తీ చేసే వారిపై కఠినంగా వ్యవహరిస్తాం

మంత్రి దామోదర రాజనర్సింహ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఆహార కల్తీ చేసే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ హెచ్చరించారు. మంగళవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీ.ఆర్.అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం - కమిషనర్ ఆఫ్ ఫుడ్ సేఫ్టీ ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నాణ్యమైన ఆహారాన్ని ప్రజలకు అందించాలని కోరారు. హైదరాబాద్ బిర్యానీకి అంతర్జాతీయంగా గుర్తింపు ఉందని గుర్తుచేశారు. హైదరాబాద్‌ను మెడికల్ టూరిజం హబ్‌గా తీర్చిదిద్దుతున్నట్టు తెలిపారు. ఫుడ్ క్యాపిటల్ ఆఫ్ ఇండియాగా హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను పెంచుతున్నట్టు చెప్పారు. హోటళ్ల యజమానులు సామాజిక బాధ్యతతో వ్యవహరించాలని కోరారు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి వర్క్ షాప్‌ల నిర్వహణతో పాటు అవగాహన సదస్సులను నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. హోటల్స్ యజమానులు చేసిన పలు విజ్ఞప్తులపై మంత్రి ఈ సందర్భంగా సానుకూలంగా స్పందించారు. ఈ సమావేశంలో తెలంగాణ స్టేట్ హోటల్స్ అసోసియేషన్, నేషనల్ రెస్టారెంట్స్ అసోసియేషన్, ఆయిల్ మర్చంట్ అసోసియేషన్, బార్ అండ్ రెస్టారెంట్స్, ఇండియన్ డైలీ మిల్క్ ప్రొడక్ట్ అసోసియేషన్, తెలంగాణ ప్యాకేజెడ్ డ్రింకింగ్ వాటర్ అసోసియేషన్, తెలంగాణ రోలర్ ఫ్లోర్ మిల్లర్స్, బేకరీ అండ్ ఐస్ క్రీమ్స్ అసోసియేషన్ లు పాల్గొన్నారు.

న్యూ ఏజ్ కమర్షియల్ సినిమా



జ్ఞానసాగర్ ద్వారక

హీరో సుధీర్ బాబు నటిస్తున్న చిత్రం 'హరోం హర'. శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర సినిమాస్ బ్యానర్‌పై సుమంత్ జి నాయుడు నిర్మించిన ఈ చిత్రానికి 'సెహరి' ఫేమ్ జ్ఞానసాగర్ ద్వారక దర్శకత్వం వహించారు. ఈనెల 14న ఈ చిత్రం విడుదల కానుంది. ఈ నేపథ్యంలో డైరెక్టర్ జ్ఞానసాగర్ ద్వారక మీడియాతో పలు విశేషాలను షేర్ చేసుకున్నారు.

- ఇదొక పీరియాడిక్ ఫిల్మ్. ప్రొడక్షన్ డిజైన్, లోకేషన్స్, కాస్ట్యుమ్స్ ఇలా అన్నింట్లో చాలా ఎఫర్ట్ పెట్టాం. కథగా చెప్పాలంటే ఇదొక అండర్ డాగ్ స్టోరీ. కుప్పంలో ల్యాబ్ అసిస్టెంట్‌గా పని చేసే సుబ్రహ్మణ్యం మామూలు కుర్రాడు. తను గన్ మేకింగ్‌లో ఇన్వాల్ అయి పవర్‌ఫుల్ సుబ్రహ్మణ్యగా ఎలా ఎదిగాడనేది థ్రెడ్. దీంతో పాటు చాలా థ్రెడ్స్ ఉన్నాయి. ఇందులో దైవశక్తికి సంబంధించి ఎలిమెంట్ కూడా ఉంది.
- అలాగే ఇందులో మంచి ఫాదర్ ఎమోషన్ ఉంటుంది. ఇది అందరికీ బాగా కనెక్ట్ అవుతుంది. సుధీర్ బాబు అద్భుతంగా పెర్ఫార్మ్ చేశారు. యాక్షన్, ఎమోషన్ టెర్రిఫిక్‌గా చేశారు. న్యూ ఏజ్ కమర్షియల్ సినిమా ఇది. యాక్షన్ లవర్స్‌కి, మాస్ ఆడియన్స్‌కి, సినిమాని ఇష్టపడే ప్రేక్షకులు అందరికీ నచ్చుతుంది.
- ఇప్పటివరకూ సినిమా చూసిన అందరికీ బాగా నచ్చింది. మైత్రీమూవీ మేకర్స్ వారు, కొంతమంది డిస్ట్రిబ్యూటర్స్ చూశారు. అందరికీ చాలా నచ్చింది. వారు చెబుతున్న ఒక్కొక్క ఎలిమెంట్ నాకు చాలా కిక్ ఇచ్చింది.
- మహేష్‌బాబుకి ట్రైలర్ చాలా బాగా నచ్చింది. రిలీజ్ డే సినిమా చూస్తానని చెప్పడం ఆనందంగా ఉంది. ఇదే బ్యానర్‌లో నా నెక్స్ట్ ప్రాజెక్ట్ ఉంటుంది. వాటి వివరాలు త్వరలోనే తెలియజేస్తాను.

5 భాషల్లో ఎం4ఎం



దర్శక, నిర్మాత మోహన్ వడ్లపట్ల 'ఎం4ఎం' (మోటీవ్ ఫర్ మర్డర్) అనే సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. ఈ చిత్ర టీజర్‌ను నిర్మాత దిల్ రాజు అమెరికాలోని కాలిఫోర్నియా ఫ్రీమాంట్‌లో ఉన్న సినీలాంజ్ సినిమాస్ వెండితెరపై విడుదల చేసి అభినందించారు. టీజర్ చాలా ఆసక్తికరంగా ఉందని, ప్రేక్షకులకు రీచ్ అవుతుందని చిత్రయూనిట్‌ని అభినందించారు. సంబీత్ ఆచార్య, జో శర్మ జంటగా నటించిన నటించిన ఈ చిత్ర టీజర్ హై స్టాండర్డ్ విజువల్స్‌తో, క్రైమ్, సస్పెన్స్ థ్రిల్లర్ జోనర్‌లో అందరినీ ఆకట్టుకునేలా కనిపిస్తోంది. ముఖ్యంగా జో శర్మ యాక్షన్ మరింత అట్రాక్షన్‌గా నిలిచిందని చిత్రయూనిట్ తెలిపింది.

ఈ చిత్రాన్ని మోహన్ మీడియా క్రియేషన్స్ పతాకంపై అమెరికన్ కంపెనీ మెక్‌విన్ గ్రూప్‌తో కలిసి నిర్మించింది. త్వరలోనే ఈ చిత్రం తెలుగు, హిందీ, తమిళ్, కన్నడ, మలయాళం ఐదు భాషల్లో విడుదలకు సిద్ధం కానుంది.

వరదరాజు గోవిందం



రవి జంగు, ప్రీతి కొంగన

వి.సముద్ర దర్శకత్వంలో రవి జంగు, ప్రీతి కొంగన హీరో, హీరోయిన్లుగా శివమహాతేజ ఫిలిమ్స్, వి.సముద్ర మూవీస్ బ్యానర్లు పై విజయలక్ష్మీ సమర్పణలో వి.సాయిఅరుణ్ కుమార్ నిర్మించిన చిత్రం 'వరదరాజు గోవిందం'.

ఆరు భాషల్లో పాన్ ఇండియా సినిమాగా తెరకెక్కించారు. షూటింగ్ పూర్తి చేసుకుని పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుపుకుంటున్న ఈ చిత్రం ఆగస్టులో రిలీజ్‌కు సిద్ధం అవుతోంది. తాజాగా ఈ చిత్ర టీజర్ రిలీజ్ వేడుక వైభవంగా జరిగింది.

దర్శక, నిర్మాత వి.సముద్ర మాట్లాడుతూ, 'కృష్ణుడు బ్యాక్‌డ్రాప్‌లో ఈ చిత్రాన్ని రూపొందించాం. ఎన్టీఆర్, రవితేజ లాగా హీరో రవి జంగు ఫుల్ ఎనర్జిటిక్‌గా చేశాడు. ఈ సినిమా తనకి మంచి బ్రేక్ అవుతుంది. హీరోయిన్ ప్రీతి చక్కగా కోపరేట్ చేస్తూ.. అద్భుతంగా చేసింది. చాలా గొప్ప కథ ఇది. భారతదేశం గర్వించదగ్గ సినిమా అవుతుంది. నా కెరీర్‌లో 'సింహరాశి, శివరామరాజు, ఎవడైతే నాకేంటి' ఎంత పెద్ద హిట్ అయ్యాయో ఈ సినిమా కూడా బ్లాక్‌బస్టర్ హిట్ అవుతుంది' అని చెప్పారు.

నవచిత్రం

రవితేజ 75వ చిత్రం ప్రారంభం



రవితేజ, శ్రీలీల

సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్‌తో కలిసి రవితేజ 75వ చిత్రాన్ని ప్రొడక్షన్ నెంబర్ 28గా నిర్మిస్తోంది. యువ రచయిత భాను బోగవరపు ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. మంగళవారం ఉదయం 07:29 గంటలకు పూజా కార్యక్రమంతో మేకర్స్ అధికారికంగా ఈ చిత్రాన్ని ప్రారంభించారు. ముహూర్తపు షాట్‌కి శ్రీలీల క్లాప్ కొట్టగా, భాను బోగవరపు దర్శకత్వం వహించారు. నేటి నుంచే ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభమైంది.

శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. రవితేజ ఈ చిత్రంలో హాస్యంతో కూడిన మాస్ పాత్రలో కనిపించనున్నారని చిత్రబృందం వెల్లడించింది. వినోదంతో కూడిన పూర్తిస్థాయి మాస్ పాత్రలో రవితేజను చూడాలని అభిమానులు ఎంతగానో ఎదురుచూస్తున్నారు. ఈ చిత్రంతో అభిమానుల కోరిక నెరవేరుతుందని చిత్ర బృందం హామీ ఇచ్చింది.

'వాల్తేరు వీరయ్య'కి మాటల రచయితగా, 'సామజవరగమన'కు కథ, స్క్రీన్‌ప్లే రచయితగా పని చేసి మంచి గుర్తింపు తెచ్చుకున్నారు భాను బోగవరపు. బాలకృష్ణ కథనాయకుడిగా తెరకెక్కుతున్న కొత్త చిత్రానికి సంభాషణలు అందిస్తున్నారు. ఈ చిత్రంతో ఆయన అదిరిపోయే మాస్ ఎంటర్‌టైనర్‌ను అందించడానికి సిద్ధమవుతున్నారు. ఈ సినిమాలో శ్రీలీల కథానాయికగా నటిస్తోంది. రవితేజ-శ్రీలీల జోడి గతంలో 'ధమాకా'తో బ్లాక్ బస్టర్ హిట్ అందించారు. అలాగే ఆ సినిమా విజయంలో కీలకపాత్ర పోషించిన సంగీత సంచలనం భీమ్స్ సిసిరోలియో ఈ చిత్రానికి కూడా సంగీతాన్ని సమకూరుస్తున్నారు. ఈ చిత్రానికి నిర్మాతలు: సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య, ఛాయాగ్రహణం: విధు అయ్యన్న, కూర్పు: నవీన్ నూలి, సంభాషణలు: నందు సవిరిగాన, కళ: నాగేంద్ర తంగాల.

డిఫరెంట్ థ్రిల్లర్



చాందిని చౌదరి, వశిష్ట సింహా, భరత్‌రాజ్, ఆషు రెడ్డి ముఖ్య తారలుగా రూపొందుతున్న చిత్రం 'యేవమ్'. ప్రకాష్ దంతులూరి . దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రానికి నవదీప్, పవన్ గోపరాజు నిర్మాతలు. ఈ నెల 14న చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్ర ప్రీరిలీజ్ వేడుక ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి హీరో విశ్వక్‌సేన్, దర్శకుడు సందీప్‌రాజ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా విశ్వక్‌సేన్ మాట్లాడుతూ,'హీరో నవదీప్ యాక్టింగ్ చేస్తే రొమాన్స్ ఎక్కువ, నిర్మాతగా చేస్తే వయిలెన్స్ ఎక్కువ అని అర్థమైంది. ఈ సీస్పెస్ అనే సంస్థతో నిర్మాతగా ప్రతిభ ఉన్న వారికి నవదీప్ మంచి ఫ్లాట్‌ఫామ్ క్రియేట్ చేశాడు. ఈ సినిమా ద్వారా మహిళా సంగీత దర్శకురాలు, మహిళా ఎడిటర్ ఫీమేల్ ఓరియెంటెడ్ చిత్రానికి పనిచేయడం చాలా ఆనందంగా ఉంది. తప్పకుండా ఈ చిత్రం అందరికి మంచి బ్రేక్ ఇవ్వాలి' అని అన్నారు.

'మంచి ఇంటెన్స్‌తో నిజాయితీగా చేసిన సినిమా ఇది. రెగ్యులర్ సినిమాలు కాకుండా ఎప్పుడూ డిఫరెంట్ సినిమాలు, వైవిధ్యమైన పాత్రల కోసం చాందిని తపన పడతుంది. ఈ సినిమా తనకి మంచి పేరు తీసుకొస్తుంది' అని నిర్మాత, నటుడు నవదీప్ చెప్పారు. దర్శకుడు ప్రకాష్ దంతులూరి మాట్లాడుతూ,'నా కథను, నా పాత్రను నమ్మి ఈ సినిమా చేసింది చాందిని. నవదీప్ మంచి సపోర్ట్ ఇచ్చారు. ఈ సినిమా చూసి సందీప్‌రాజ్ ఇచ్చిన ఫీడ్‌బ్యాక్ మాలో ధైర్యాన్ని నింపింది. కీర్తన్ నేపథ్య సంగీతం ఈ చిత్రానికి ఎంతో ప్లస్ అవుతుంది. అందరి సహకారంతో ఓ మంచి సినిమా తీశాం. ఇదొక ఇంట్రెస్టింగ్ ఎంటర్‌టైనింగ్ థ్రిల్లర్. తప్పకుండా అందరికి నచ్చుతుందే నమ్మకం' అని తెలిపారు.

రాజధాని రౌడీ రిలీజ్‌కి రెడీ



యశ్

సంతోష్ ఎంటర్‌టైన్మెంట్స్ పతాకంపై నిర్మాత సంతోష్ కుమార్ నిర్మాణంలో యశ్, షీనా హీరో, హీరోయిన్లుగా కె.వి.రాజు దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'రాజధాని రౌడీ'. ఈ చిత్రం ఈనెల 14న విడుదలకు సిద్ధమైంది.

ఈ సందర్భంగా నిర్మాత సంతోష్ కుమార్ మాట్లాడుతూ, 'మాదకద్రవ్యాలు, మద్యపానం బారినపడి నలుగురు యువకులు తమ జీవితాల్ని ఎలా నాశనం చేసుకున్నారు అనే కథాంశంతో తెరకెక్కిన చిత్రమిది. వినోదానికి, సందేశాన్ని జోడించి తెరకెక్కించారు. చెడు పరిణామాలను ఎత్తి చూపుతూ, ఆలోచన రేకెత్తించే ఈ చిత్రంలో ప్రకాష్ రాజ్ పోలీస్ ఆఫీసర్‌గా అద్భుతమైన నటన ప్రదర్శించారు. ముమైత్ ఖాన్ తన అందాలతో కనువిందు చేస్తారు. అర్జున్ జన్య అద్భుతమైన సంగీతాన్ని అందించారు. ఇలాంటి మంచి చిత్రాన్ని తెలుగులో విడుదల చేస్తున్నందుకు గర్వంగా ఉంది. అత్యధిక థియేటర్లలో ఈనెల 14న విడుదల చేస్తున్నాం. తెలుగు ప్రేక్షకులందరు ఈ చిత్రాన్ని విజయవంతం చేయాలని కోరుకుంటున్నాను' అని అన్నారు.

మెప్పించే బేవార్స్‌గాడు



వివారెడ్డి, శ్రీధర్

శ్రీ శోభా క్రియేషన్స్ పతాకంపై హర్షవర్ధన్, నిహారిక హీరో, హీరోయిన్లుగా బి.వి.అంజనీ ప్రసాద్ స్వీయ దర్శకత్వంలో రూపొందుతున్న యూత్ ఫుల్ ఎంటర్‌టైనర్ 'బేవార్స్ గాడు'. రెండు షెడ్యూల్స్‌ని కరీంనగర్ జిల్లాలోని హుస్నాబాద్ పరిసర ప్రాంతాల్లో పూర్తి చేసుకుని, ప్రస్తుతం హైదరాబాద్ చుట్టు పక్కల చివరి షెడ్యూల్ షూటింగ్ జరుపుకుంటోంది.

ఈ సందర్భంగా దర్శకుడు బి. వి. అంజనీ ప్రసాద్ మాట్లాడుతూ,'ఈ షెడ్యూల్‌తో పాటల చిత్రీకరణ మినహా టాకీపార్ట్ పాటు పూర్తవుతుంది. కీలక పాత్రలో సుమన్ నటిస్తున్నారు. గత జన్మలో కన్నతల్లి చావుకు కారకుడైన కొడుకు. ప్రస్తుత జన్మలో ఆ కొడుకు మళ్లీ జన్మించి కన్నతల్లి రుణాన్ని ఎలా తీర్చుకున్నాడు అన్నదే ముఖ్య కథాంశం. సోషియో ఫాంటసీగా చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం. ఇందులోని 4పాటలు, 4 ఫైట్లు ప్రేక్షకుల్ని బాగా అలరిస్తాయి' అని అన్నారు.

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886